సోమవారం
27-10-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 35
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్
మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

21 మంది మావోయిస్టుల లొంగుబాటు

విశాలాంధ్ర- చింతూరు : చత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లాలో మరో 21 మంది మావోయిస్టులు ఆదివారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. బస్తర్ రేంజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లొంగిపోయిన మావోయిస్టులు కేశ్‌కాల్ డివిజన్ కుమారి, కిస్కోడా ఏరియా కమిటీ మావోయిస్టులు. లొంగిపోయిన వారిలో కేశ్‌కాల్ డివిజన్ కమిటీ కార్యదర్శి ముకేశ్, నలుగురు డీవీసీఎంలు (డివిజన్ వైస్ కమిటీ సభ్యులు), తొమ్మిది మంది ఏఎంసీ (ఏరియా కమిటీ సభ్యులు) తో పాటు ఎనిమిది మంది పార్టీ సభ్యులు ఉన్నారని పోలీసు అధికారులు తెలిపారు. బస్తర్ రేంజ్

- మిగతా 2 లో

'బురవెస్ట్నిక్' క్రూయిజ్ క్షిపణి పరీక్ష విజయవంతం

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సంచలన ప్రకటన చేశారు. అణుశక్తితో పనిచేసే 'బురవెస్ట్నిక్' క్రూయిజ్ క్షిపణిని రష్యా విజయవంతంగా పరీక్షించినట్లు ఆదివారం వెల్లడించారు. ప్రపంచంలోని ఏ రక్షణ వ్యవస్థనైనా ఛేదించగల ఈ అస్త్రం త్వరలో సైనిక మోహరింపునకు సిద్ధమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ క్షిపణి పరీక్ష, గత వారం నిర్వహించిన అణు విన్యాసాలు.. అమెరికా సహా పాశ్చాత్య దేశాలకు రష్యా పంపుతున్న బలమైన సంకేతంగా అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. రాయిటర్స్ కథనం ప్రకారం, అక్టోబర్ 21న ఈ

- మిగతా 2 లో

మణిపూర్‌లో 3,300 డెంగీ కేసులు

ఇంఫాల్ : మణిపూర్‌లో డెంగీ విజృంభిస్తున్నది. అక్టోబరు 25 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 3,334 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇంఫాల్ వెస్ట్‌లో అత్యధికంగా 2,323 కేసులు, ఇంఫాల్ తూర్పులో మొత్తం 608 కేసులు నమోదయ్యాయి. మణిపూర్‌లో గత 24 గంటల్లో 69 కొత్త కేసులు నమోదయినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య సేవల డైరెక్టరేట్ తెలిపింది. ఇంఫాల్ వెస్ట్‌లో కొత్తగా 38 కేసులు, ఇంఫాల్ తూర్పులో 21 కొత్త కేసులను గుర్తించినట్లు పేర్కొంది. కాగా మణిపూర్‌లోని అన్ని జిల్లాల్లో

- మిగతా 2 లో

44 శాతం ఫిట్‌మెంట్‌తో

వేతన సవరణ

- కూనంనేని డిమాండ్
- ఘనంగా టీఎంఈయూ డైమండ్ జూబ్లీ ఉత్సవాలు

విశాలాంధ్ర- హైదరాబాద్: ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎంఈయూ) రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుతో 60 వసంతాలుగా అప్రతిహతంగా కొనసాగడం ఎంతో గర్వకారణం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు పేర్కొన్నారు. డైమండ్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఆదివారం హిమాయత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ రంగంలో ఇంత సుదీర్ఘ కాలం పాటు గుర్తింపు పొందిన యూనియన్ గా ఉండటం దేశంలోనే ప్రథమం అన్నారు. ఇటీవల కొందరు అధికారులు యూనియన్ నాయకులను మినహాయించకుండా బదిలీ చేస్తే... హైకోర్టు జోక్యం చేసుకొని వాటిని రద్దు చేసి, వారికి రక్షణ కల్పించాలని ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2023, జులై నుంచి వేతన సవరణను 44 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, ఐదు విడతల కరువు భత్యం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. శాసన మండలి సభ్యులు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఇ.ఎస్.ఐ. విభాగంలో జి.ఓ.126 సవరించాలని , రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పూర్వపు పెన్షన్ విధానాన్ని పునఃరుద్ధరించాలని, 317 జి.ఓ. ద్వారా ఇప్పటికీ న్యాయం జరగని ఉద్యోగులందరినీ తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ వైద్య విధాన పరిషత్‌ను రద్దుపరిచి ఆ స్థానంలో సెకండరీ హెల్త్ సర్వీసెస్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, తద్వారా ఉద్యోగుల ట్రెజరీ ద్వారా వేతనాలు పొందేందుకు వీలు కల్గుతుందని అన్నారు. యూనియన్ అధ్యక్షుడు యం.ఎస్.మూర్తి మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉద్యోగులకు ల్యాబ్, ఎక్స్‌రే, ఇ.సి.జి, శిక్షణను పునఃప్రారంభించాలని, రేడియోగ్రాఫర్ లకు ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రధాన కార్యదర్శి పి.ఇందిరా శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళ నర్సింగ్ ఆర్డర్లీ లకు ఇస్తున్న అదనపు ఇంటి అద్దె అలవెన్స్ పురుషులకు కూడా చెల్లించాలని, టీవీవీపీలో క్యాడర్ బలాన్ని సవరించేందుకై ఏర్పాటైన అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ నివేదికను సవరించాలని, అలాగే అసిస్టెంట్ కమిషనర్ (నర్సింగ్) పోస్ట్ ను తక్షణం భర్తీ చేయాలని కోరారు. ట్రేడ్ యూనియన్ బాధ్యులు వి.ఎస్.బోస్, యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వి.వేణు కుమార్, సలహాదారు ఎం.సి.ఎస్.రాజు, ఉప ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసాచారి, ఎస్.శివానంద్, ఉపాధ్యక్షులు పి.నర్సయ్య, పి.స్వాతి, అమృత్‌రావు, వెంకట్రావు, కవిత, కార్యదర్శులు యం.మధుసూదన్ రెడ్డి, పి.సరస్వతి, ఆర్.జగన్ మోహన్ రావు, పి.రామారావు, పి.కిషన్, కోశాధికారి కె. సుశీల నాయకులు శ్రీదేవి, సతీష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో

కాంగ్రెస్ విజయం తథ్యం

- పార్టీ నియమావళికి కట్టుబడి పనిచేయాల్సిందే
- ఎమ్మెల్యేలకు డీసీసీ బాధ్యతలు
- మెట్రో ఫేజ్ 2కు కిషన్‌రెడ్డి అడ్డంకి
- మీడియా ఇష్టాగోష్టిలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్

విశాలాంధ్ర - హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం తథ్యమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తంచేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 46 వేల ఇళ్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, మంచి మెజారిటీతో గెలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. దిల్లీలో ఆదివారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న ప్రతి అంశాన్ని పార్టీ హైకమాండ్ గమనిస్తూనే ఉందన్నారు. మంత్రుల పంచాయితీ ముగిసిన అధ్యాయంగా అభివర్ణించారు. మంత్రి కొండా సురేఖ ఇంటికి పోలీసులు రావడంతో ఆమె కుమార్తె ఆందోళనకు గురైనట్టు చెప్పిందని, గోడలకు చెవులు ఉండే సమయంలో మనం జాగ్రత్తగా మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులది సమాచార లోపం కారణంగా దాన్ని కేటీఆర్, హరీశ్‌రావు అవకాశంగా తీసుకుంటున్నారని చెప్పారు. కొంతమంది ఎమ్మెల్యేలకు డీసీసీ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యేలకు డీసీసీ పదవులు డబుల్ పోస్టులుగా చూడమని పేర్కొన్నారు. రెండు పదవులు ఉండొద్దు అనే నిబంధన పార్టీలో ఉందన్నారు. ఒక పదవి చేపడితే మరో పదవికి రాజీనామా చేస్తారని వివరించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి సరైన సహకారం లేదన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే, అభివృద్ధి కోసం అందరూ కలిసి పని చేయాలని సూచించారు. మెట్రో ఫేజ్ 2 కు కిషన్ రెడ్డి అడ్డంకిగా ఉన్నారని ఆరోపించారు. జీవన్ రెడ్డి, లక్ష్మణ్ లది గురు శిష్యుల బంధమన్నారు. పార్టీ అన్నింటికి సుప్రీం అని, పార్టీ నియమావళికి లోబడి అందరూ నడుచుకోవాల్సిందే అన్నారు. బీజేపీకి మతం పేరుతో ఓట్లు దండుకోవడమే పని అని విమర్శించారు. ఆ పార్టీ నేతలు మతం కులం పేరుతో ఓట్లు అడుగుతున్నారన్నారు. కేంద్ర మంత్రిగా ఉండి బండి సంజయ్ చిల్లరగా మాట్లాడారని మండిపడ్డారు. ఓట్ చోరీ పై తొలుత ఫిర్యాదు చేసింది రేవంత్ రెడ్డి అని, అధికారులు, మంత్రులు ఎవరైనా జవాబుదారీ తనంగా ఉండాలని సూచించారు. కేసీఆర్ ను ఉద్యమ నాయకుడిగా గౌరవిస్తామని, కానీ ఆయన పరిపాలన మాత్రం గాడి తప్పడం వల్లే రాష్ట్రం దివాళా తీసిందని ఆరోపించారు. బనకచర్ల విషయంలో కేసీఆర్ ఉదాసీనంగా వ్యవహరించారని విమర్శించారు. జనంబాట పేరుతో యాత్ర చేపట్టిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన యాత్రలో వాస్తవాలు మాట్లాడాలని సూచించారు.

'ఎంజాయ్ పేరుతో గంజాయి వద్దు'

- నేటి నుంచి నవంబరు 2 వరకు బస్సు కళాజాత
- పోస్టర్ ఆవిష్కరించిన పల్లా, కూనంనేని

ఎంజాయ్ పేరుతో గంజాయి వద్దు అంటూ తెలంగాణ ప్రజా నాట్యమండలి అధ్వర్యంలో సోమవారం నుంచి నవంబరు రెండో తేదీ వరకు బస్సు కళాజాత నిర్వహించనున్నారు.

2 లో

సొంతిల్లు కలేనా?

ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారుల నిరాసక్తత

- చేపట్టిన పనులకు డబ్బులందలేదని నిట్టూర్పు
- మధ్యలోనే ఆగిపోయిన ఇళ్ల నిర్మాణం
- అదనపు సాయం ప్రకటించినా స్పందన కరువు
- మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బందులు



విశాలాంధ్ర-సచివాలయం: రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించింది. గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వందలాది వెంచర్లు వేసినా ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో ప్రారంభించక పోవడంతో పేదల కలలు కల్లలుగానే మిగిలాయి. నీటికుంటలు, ఆటవీ భూములు, గ్రామాలకు దూరంగా ఉన్న ప్రాంతాలను ఇళ్ల నిర్మాణాల కోసం ఎంపికచేయడం కూడా ఇబ్బందిగా పరిణమించింది. లబ్ధిదారులు అక్కడ ఇళ్ల నిర్మాణాలపై ఆసక్తి చూపించలేదు. అయితే గత ప్రభుత్వంలో అధికార పార్టీ నేతలే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి...అందినకాడికి దండుకున్నారన్న ఆరోపణలు సైతం వచ్చాయి. దీనికితోడు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయకుండానే రాజకీయ ప్రమేయంతో బిల్లులు మంజూరు చేయించు కున్నారని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిపివేసిన ఇళ్ల నిర్మాణాలను పునః ప్రారంభించేలా ప్రస్తుత కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పుడు ఇస్తున్న యూనిట్ విలువ రూ.1.80 లక్షలతో ఇళ్ల నిర్మాణం లబ్ధిదారులకు కష్టంగా మారిందన్న విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు... ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనపు సాయం అందిస్తున్నట్లు ప్రకటించారు.. ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75వేలతో పాటు కొండ ప్రాంతాల్లో ఉండే వారికి రూ.1 లక్ష చొప్పున అదనపు సాయం కేటాయించారు. దీంతో ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసుకొనేందుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని భావించారు. అయితే అదనపు సాయం ప్రకటనతో సుమారు లక్ష ఇళ్లు అదనంగా పూర్తిచేసే అవకాశం ఏర్పడింది. ఒకవైపు వర్షాలు, మరో వైపు బకాయిలు

- మిగతా 2 లో

ఎస్ఐఆర్‌పై ఈసీ ప్రకటన నేడు

- ఎన్నికల రాష్ట్రాల్లోనే మొదటి దశ!
- 10-15 రాష్ట్రాల్లో అమలుకు సన్నాహాలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రక్షాళన (ఎస్ఐఆర్)కు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. సోమవారం కీలక ప్రకటన చేయబోతోంది. దేశవ్యాప్తంగా దశల వారీగా ఎస్ఐఆర్ నిర్వహించాలని భావిస్తోంది. ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలే లక్ష్యంగా మొదటి దశ జరిపే అంచనా ఉంది. కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, అరుణాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ చేపట్టనున్నట్లు ఈసీ ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది. ఇదే క్రమంలో 10-15 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. అందుకు ఏర్పాట్లు కూడా పూర్తైనట్లు సమాచారం. దేశమంతటా ఎస్ఐఆర్‌ను నిర్వహించడానికి సంబంధించి కీలక ప్రకటనకు ఎన్నికల సంఘం సమాయత్తమైంది. ఇందుకోసం 26వ తేదీ అనగా సోమవారం సాయంత్రం

- మిగతా 2 లో

పెద్దఎత్తున జూదం

- పోలీసు దాడుల్లో ఏడుగురి అరెస్ట్
- రూ.2.50 లక్షలు స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో -ఖమ్మం: ఇటీవలి కాలంలో ఖమ్మం ప్రాంతంలో జూదరులు కొత్త మార్గాలను వెతుకుతున్నారు. కొత్తరకం బెట్టింగులతో సునాయాసంగా డబ్బు సంపాదించేందుకు కొందరు ముఠాగా ఏర్పడి నూతన తరహా ఆటలకు తెర తీశారు. పేకాటలో 'లోపల-బయట' ఆటను మారుమూల ప్రాంతంలోని మామిడి తోటలో రాత్రిపూట పెద్ద ఎత్తున ఆడుతున్నారు. రూ.లక్షల్లో చేతులు మారుతున్నాయి. ఖమ్మం చుట్టుపక్కల సురక్షిత ప్రాంతాల్లో ఒక అడ్డాగా ఏర్పరచుకొని ఈ ఆటలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఇందులో ఖమ్మం జిల్లాలో ఉన్న కొంతమంది ప్రముఖులతో పాటు కృష్ణాజిల్లా జగ్గయ్యపేట కోదాడ జిల్లాకు సంబంధించినటువంటి కొంతమంది పాల్గొంటున్నారు. అంతేగాక క్రికెట్ బెట్టింగ్ ముఠాలు కూడా గుట్టుగా తమ పని తాము చేస్తూనే ఉన్నాయి. ఆదివారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పరిధిలో ఒక మామిడి తోటలో రాత్రి సమయంలో జూదం ఆడుతుండగా పోలీసులకు సమాచారం అందడంతో ఆ ముఠాపై దాడి చేశారు. అయితే వారిలో ముఖ్యమైన వ్యక్తులంతా తప్పించుకోగా కొంతమంది దొరికారు. వారి నుంచి పోలీసులు రూ. రెండు లక్షల నగదు , ఏడు సెల్ ఫోన్లు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. దొరకని ముఠాలు అనేకం ఉన్నాయి. సర్వం పోగొట్టుకుని అప్పుల పాలైన కుటుంబాలు అనేకం ఉన్నాయి. ఖమ్మం సీపీ సునీల్ దత్ నగరంలోను వెలుపల రాత్రిపూట జూదం ఆడటం, మద్యం తాగడం వంటి వాటిపై ఉక్కు పాదం మోపారు. అనేక మందిపై కేసులు నమోదు చేశారు . రాత్రిపూట స్పెషల్ పోలీస్ టీం ను ఏర్పాటు చేసి అదుపు చేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో నగరం దగ్గరలో కాకుండా దూరంగా ఉన్న కొన్ని గ్రామాల్లోని మామిడి తోటలకు జూదరులు తమ మకాం మార్చారు. కుసుమంచి మండలంలోని నాయకంగూడెం గ్రామ శివారులో ఉన్న కైలాస రామూర్తి మామిడి తోటలో సాయంత్రం 10.15 గంటల సమయంలో నాణేలతో డబ్బులు పందెంగా పెట్టి జూదం ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం రావడంతో, కుసుమంచి ఎస్ఐ జె. నాగరాజు, రూరల్ ఎస్ఐ లు విశ్వతేజ ,హరికృష్ణ ... సిబ్బందితో దాడి చేయగా ఆరుగురు పట్టుబడ్డారు. ఖమ్మంకు చెందిన షేక్ మస్తాన్, గొడుగు వీరబాబు , ఆకుల సాయి కుమార్, సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు తల్లూరి సాయి, నాయుడు, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలానికి చెందిన మూర్తి లింగరావు , గర్లపాటి రామును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వారి వద్ద నుంచి రూ.2,49,600 నగదు, రెండు మోటార్ సైకిళ్లు, ఎనిమిది మొబైల్ ఫోన్లు, పది పెట్టెల ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా కొంతమంది పరారయ్యారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

వక్ఫ్ చట్టం బుట్ట దాఖలు చేస్తాం

- కొత్త బీహార్ నిర్మిస్తాం
- వృద్ధులకు రూ.2 వేల పింఛన్ ఇస్తాం
- పంచాయతీ ప్రతినిధుల జీతం పెంచుతాం
- సీమాంచల్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం
- 'ఇండియా' సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ హామీలు - గెలుపుపై ధీమా

పట్నా: తమకు అవకాశమిస్తే కొత్త బీహార్‌ను నిర్మిస్తామని ప్రతిపక్ష మహాకూటమి తరపు సీఎం అభ్యర్థి, ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ హామీనిచ్చారు. అధికారంలోకి రాగానే వక్ఫ్ చట్టాన్ని బుట్టదాఖలు చేస్తామన్నారు. వృద్ధులకు రూ.2వేల నెలసరి పింఛన్ ఇస్తామని, సీమాంచల్ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీలు ఇచ్చారు. పంచాయతీ రాజ్ ప్రతినిధులకు జీతభత్యాలు పెంచుతామన్నారు. వారికి పింఛన్, బీమా సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. తేజస్వీ యాదవ్ ఆదివారం కటిహార్ జిల్లాలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. బీజేపీపై, నితీశ్ పాలనపై విమర్శలు

- మిగతా 2 లో

నేడే మద్యం దుకాణాలకు లక్కీడ్రా

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో మద్యం దుకాణాల టెండర్లకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సోమవారం ఉదయం లక్కీ డ్రా నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ అధికారులను ఆదేశించారు.

జిల్లాల వారీగా ఎక్సైజ్ అధికారుల సమక్షంలో కలెక్టర్ల చేతుల మీదుగా డ్రా ప్రక్రియ కొనసాగిస్తామన్నారు. రాష్ట్రం మొత్తం 2,620 మద్యం దుకాణాలకు 95,137 దరఖాస్తులు వచ్చాయి. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న వైన్స్‌లకు భారీగా దరఖాస్తులు వచ్చాయి.

అమెరికా శాశ్వత యుద్ధాన్ని సృష్టిస్తోంది

మాపై తప్పుడు ఆరోపణలు చేస్తోంది: మదురో

2 లో

ఇదీ లోకం!

ఈయనేంటీ..? నాకు తెగ పోటీ వచ్చేస్తున్నాడు!

అమెరికా శాశ్వత యుద్ధాన్ని సృష్టిస్తోంది

మాపై తప్పుడు ఆరోపణలు చేస్తోంది: మదురో

కారకస్: ట్రంప్ ప్రభుత్వం కొత్తగా శాశ్వత యుద్ధాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని వెనిజులా అధ్యక్షుడు నికోలాస్ మదురో ఆరోపించారు. 90 యుద్ధ విమానాలను తరలించగలిగిన సామర్థ్యంగల ప్రపంచంలోనే అతిపెద్ద వాహక నౌక 'యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్'తో పాటు దాడులకు వినియోగించే హెలికాప్టర్లు వెనిజులాకు దగ్గరగా చేర్చడంపై ఆయన స్పందించారు. 'అమెరికా కొత్త, శాశ్వత యుద్ధాన్ని సృష్టిస్తోంది. మాదకద్రవ్యాల విషయంలో నేరపూరితమైన, తప్పుడు కథనాలతో అనుచితంగా వ్యవహరిస్తోంది. మా దేశం గంజాయి ఉత్పత్తి చేయదు' అని మదురో అన్నారు. అమెరికా

ఒత్తిళ్లకు తలొగ్గేది లేదన్నారు. ప్రతిపక్ష నాయకుడు లియోపోల్డో లోపెజ్ పాస్‌పోర్టు, పౌరసత్వం రద్దుపై న్యాయపరమైన కార్యకలాపాలను ప్రారంభించిన తర్వాత అమెరికా నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురవుతోందన్నారు. మళ్లీ యుద్ధంలో జోక్యం చేసుకోమని హామీ ఇచ్చారు కానీ యుద్ధాన్ని సృష్టిస్తున్నారు... దానిని మేము నివారిస్తాం అని జాతినుద్దేశించి మదురో అన్నారు. ఆధారాలు లేకుండా తనపై ట్రంప్ ఆరోపణలు చేస్తున్నారని, తప్పుడు కథనాలతో అవమానకరంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వెనిజులా కొకైన్ ఉత్పత్తి చేయదని, మాదక ద్రవ్యాల నెపంతో వెనిజులా తీరంలో అనేక పడవులను అమెరికా దళాలు నాశనం చేశాయని మదురో తెలిపారు. ఈ దాడుల్లో 43 మంది చనిపోయారన్నారు. 'ట్రెన్ ది అరాగ్వా' ముఠాకు మదురో నాయకుడని ట్రంప్ ఇటీవల తీవ్ర ఆరోపణలు చేశారు. మదురో ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. కాగా, అమెరికా సహా మరికొన్ని దేశాలు గతేడాది జరిగిన ఎన్నికల్లో మదురో గెలుపుపై అభ్యంతరం తెలిపాయి. ఆయన ఎన్నికను గుర్తించడం లేదని అమెరికా తేల్చిచెప్పింది.

నింగిలోకి జపాన్ కార్గో వ్యోమనౌక

టోక్యో: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు సరుకు పంపేందుకు చేపట్టిన తొలి మిషన్‌గా మానవరహిత కార్గో వ్యోమనౌకను హెచ్ 3 రాకెట్ ద్వారా జపాన్ విజయవంతం పరీక్షించింది. ఈ మేరకు జపాన్ అంతరిక్ష కేంద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. జపాన్‌లోని తనేగషిమా అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగం జరిగింది. నం.7 హెచ్ 3 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లినట్లు తెలిపింది. హెచ్‌టీవీ-ఎక్స్1 స్పేస్ క్రాఫ్ట్ నిర్దేశిత కక్షలోకి చేరిందని జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ వెల్లడించింది. ప్రక్రియ సునాయాశంగా సాగిందని, మరికొద్ది రోజుల్లో ఐఎస్ఎస్‌కు అది చేరుకుంటుందని తెలిపింది.

థాయిలాండ్, కంబోడియా మధ్య సంధి

ట్రంప్ సమక్షంలో కాల్పుల విమరణ ఒప్పందంపై సంతకాలు

కౌలాలంపూర్: థాయిలాండ్, కంబోడియా మధ్య సంధి కుదిరింది. కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎదుట రెండు దేశాల నాయకులు ఈ ఒప్పందంపై ఆదివారం సంతకాలు చేశారు. కౌలాలంపూర్‌లో అసోసియేషన్ ఆఫ్ సౌతీస్ట్ ఏషియన్ నేషన్స్ సమ్మిట్ కోసం ట్రంప్ మలేసియా చేరుకున్న క్రమంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. మూడు నెలల కింద ట్రంప్ మధ్యవర్తిత్వం ద్వారా ఈ రెండు దేశాల రాజీకి వచ్చాయి. ఇదిలావుంటే, థాయిలాండ్, కంబోడియాతో ఆర్థికపరమైన ఒప్పందాలను ట్రంప్ ఈ

సందర్భంగా కుదుర్చుకున్నారు. కంబోడియాతో వాణిజ్య ఒప్పందం, థాయిలాండ్‌తో కీలక ఖనిజాలకు సంబంధించి ఒప్పందం చేసుకున్నారు. ఏషియన్ సమ్మిట్‌లో భాగంగా మలేసియాతోనూ కీలక ఖనిజాల ఒప్పందాన్ని ట్రంప్ కుదుర్చుకోనున్నట్లు అమెరికా అధికారి ఒకరు వెల్లడించారు.

కెనడాపై ట్రంప్ అక్కసు

సుంకాల్లో 10 శాతం పెంపు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాపై కక్షసాధింపునకు దిగారు. ఆ దేశంపై సుంకాలు పెంచారు. అదనంగా 10 శాతం చెల్లించాలంటూ ఆదేశించారు. వాణిజ్య ప్రకటనపై వివాదంతో ట్రంప్ తాజా చర్యలు తీసుకున్నారు. ఆ దేశంతో వాణిజ్య చర్చలను నిలిపివేస్తున్నట్లు ఆయన ఇప్పటికే ప్రకటించారు. కెనడాపై సుంకాలను 10 శాతం మేర పెంచుతున్నట్లు ట్రూత్ సోషల్ మాధ్యమంగా ట్రంప్ వెల్లడించారు.

'వాళ్లు ఆ ప్రకటనను తక్షణమే నిలిపివేయకుండా వరల్డ్ సిరీస్ సందర్భంగా ప్రసారాన్ని కొనసాగించారు. మోసం అని తెలిసి కూడా ఆ పని చేశారు. వాస్తవాలను తీవ్రంగా వక్రీకరించారు. అందుకే కెనడాపై

విధించిన సుంకాలను 10 శాతం పెంచుతున్నాను. ఇప్పుడు చెల్లించే దాని కంటే 10 శాతం ఎక్కువగా ఆ దేశం చెల్లించాల్సి ఉంటుంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

నిరసనలు, ఆందోళనలు వద్దు

చర్చలతోనే సమస్యలకు పరిష్కారం: నేపాల్ హోంశాఖ

ఖాట్మండు: వచ్చే ఏడాది మార్చి 5న సార్వత్రిక ఎన్నికలు జరగనున్న దృష్ట్యా దేశంలో శాంతి భద్రతల సమస్యలు రాకుండా నేపాల్ హోంమంత్రి ఓం ప్రకాశ్ ఆర్యల్ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆపద్ధర్మ ప్రభుత్వంతో చర్చలకు రావాలని సంబంధిత వర్గాలను ఆహ్వానించారు. సమస్యలకు చర్చలతోనే పరిష్కారం సాధ్యమన్నారు. నిరసనలు, ఆందోళనల్లో దేశ ప్రజలు ఎవరూ పాల్గొనరాదని హోంశాఖ తాజాగా ఆదేశాలు జారీచేసింది. అస్థిరత పరిస్థితులు సృష్టించేందుకు కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రయత్నించే అకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. చర్చలకు ప్రభుత్వం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని, సంప్రదింపులు జరపడం వల్ల శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవచ్చని హోంమంత్రి వెల్లడించారు. వేర్వేరు డిమాండ్లతో ఇటీవల నేపాల్ వ్యాప్తంగా ఆందోళనలు పెరిగిన క్రమంలో ఆయన స్పందించారు. 'రాజకీయ డిమాండ్ పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది కాబట్టే చర్చలు అనివార్యం. వీధుల్లోకి రావాల్సిన అవసరం ప్రజలకు లేదు. సొంత హక్కులు వినియోగించే క్రమంలో ఇతరుల హక్కులనూ గమనంలో ఉంచుకోవడం ముఖ్యం. ప్రజా-ప్రభుత్వ ఆస్తులకు నష్టం



కలిగించవద్దని అన్ని వర్గాలను హోంశాఖ కోరుతోంది. అన్ని రాజకీయ పార్టీలు, నిరసన సంఘాలు సంయమనం పాటించాలని, హింసకుకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేస్తోంది' అని ఓం ప్రకాశ్ అన్నారు.

భారత్, ఆసియాన్‌లదే 21వ శతాబ్దం: మోదీ

న్యూఢిల్లీ: 21వ శతాబ్దం భారత్, ఆసియాన్ దేశాల శతాబ్దమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మలేసియాలో కౌలాలంపుర్ జరుగుతోన్న ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో ఆదివారం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. భారత్ యాక్ట్ ఈస్ట్ పాలసీకి ఆసియాన్ దేశాలు మూలస్తంభమని పునరుద్ఘాటించారు. 2026ను ఆసియాన్-భారత్ సముద్ర సహకార సంవత్సరంగా మోదీ ప్రకటించారు. ఆసియాన్ సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు అతిథ్య మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంను మోదీ అభినందించారు. ఈ ఏడాది సమ్మిట్ థీమ్ అయిన సమ్మిళితత్వం, స్థిరత్వం ఇరుభాగస్వామ్యాల ఉమ్మడి ప్రయత్నాల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తుందన్నారు. విద్య, పర్యటకం, సైన్స్, టెక్నాలజీ, ఆరోగ్యం, గ్రీన్ ఎనర్జీ, సైబర్ భద్రతలో ద్వైపాక్షిక సహకారాన్ని బలంగా ప్రోత్సహిస్తున్నట్లు మోదీ చెప్పారు. ఆసియా అంతటా శాంతి, శ్రేయస్సు కోసం భారత్, ఆసియాన్ మధ్య సహకారం ముఖ్యమని ప్రధాని నొక్కి చెప్పారు. భారత్ యాక్ట్ ఈస్ట్ పాలసీకి ఆసియాన్ ప్రధాన మూలస్తంభమని ప్రధాని వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా ఆసియాన్‌లో కొత్తగా చేరిన ఈస్ట్ తైమూర్‌కు ప్రధాని మోదీ స్వాగతం పలికారు. భారత్‌కు సమన్వయకర్తగా పనిచేస్తున్నందుకు ఫిలిప్పీన్స్‌ను ప్రశంసించారు. థాయిలాండ్ మహారాణి సిరికిట్ మృతికి ప్రధాని సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారమే ప్రారంభమైన ఆసియాన్ సదస్సు 28 వరకు జరగనుంది. ఈ ఆసియాన్‌లో మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం, మయన్మార్ వంటి 10 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి. గత కొన్నేళ్లుగా భారత్-ఆసియాన్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు గణనీయంగా పెరిగాయి. వాణిజ్యం, పెట్టుబడి రంగాలతో పాటు భద్రత, రక్షణల్లో సహకారంపై దృష్టి సారించాయి.

సొంతిల్లు కలేనా?

(మొదటిపేజీ తరువాయి)

విడుదల కాకపోవడంతో మందకొండిగానే పనులు సాగుతున్నాయి. 2014-19 కాలంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో బీసీలకు రూ.1.50 లక్షలతో స్కీమ్ ఒకటి కాగా, మరొకటి ఎస్సీలకు రూ.రెండు లక్షల పథకం. వాటిలో ఇళ్లు మంజూరై ఒక్క పైసా రాని వారు, కొంతమేర సొమ్ములు వచ్చిన వారూ ఉన్నారు. ఇళ్లు పూర్తిచేసినవారికి బిల్లులు చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడం, అప్పటికి ఇంకా ఎవరూ ఇళ్లను పూర్తి చేయలేకపోవడంతో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులను జమ చేయలేదు. దీంతో ఇళ్లు మంజూరైన వారు తమ సొంత డబ్బులతో పునాదులు, రూఫ్ లెవల్ పనుల వరకు చేపట్టారు. తమ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఉన్నపళంగా ఇంటి నిర్మాణ పనులు ఆపేశారు. కొందరికి పునాదులకు రూ.10 వేలు, 15 బస్తాల సిమెంట్ ఇచ్చారు. వారు పునాదులు వేసి వదిలేశారు. బిల్లుల కోసం ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేనా ఫలితం లేకపోవడంతో మిన్నకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండుసార్లు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు నాలుగు నెలల పాటు సర్వే చేశారు. సర్వేలో గుర్తించిన లబ్ధిదారులు, వారికి చెల్లించాల్సిన నగదు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గృహ నిర్మాణాలకు సంబంధించి జిల్లా అధికారులు ఆన్‌లైన్లో నమోదు చేశారు.

టీడీపీ హయాంలో మంజూరైన ఇళ్లకు బిల్లులు చెల్లించేందుకు తొలుత వైసీపీ ప్రభుత్వం నిరాకరించింది. లబ్ధిదారుల నుంచి ఒత్తిళ్లు, ప్రజాప్రతినిధుల వినతులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, బిల్లులు చెల్లించేందుకు అంగీకరించింది. టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను వెరిఫికేషన్ చేయాలని నిర్ణయించింది. అర్హులను గుర్తించేందుకు 2022 డిసెంబరులో గృహనిర్మాణ శాఖ సిబ్బంది, గ్రామ, వార్డు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సర్వే చేయించింది. వారంతా అర్హులేనని అధికారులు నిర్ధారించారు. గతేడాది జూన్‌లోనూ మరోసారి పరిశీలించారు. అందులోనూ వారు అర్హులేనని తేల్చారు. సర్వేలు చేసినా లబ్ధిదారులకు డబ్బులు మాత్రం చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత మూడోసారి ఇళ్ల తనిఖీ ప్రక్రియను చేపట్టింది. గతేడాది సెప్టెంబరు నుంచి డిసెంబర్ వరకు గ్రామాల్లో ఈ ప్రక్రియ నిర్వహించారు. వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీన చెల్లిస్తామని చెప్పినా, ఇప్పటివరకు నగదు జమ చేయలేదు.

పేదలు వారికి కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్నా ఆ ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో అందులో నివసించేందుకు ముందుకు రావడం లేదు. మరికొందరు ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించిన తర్వాతనే ఇళ్ల నిర్మాణాలు చేపడతామని మొండికేస్తున్నారు. అయితే ప్రస్తుతం గృహ నిర్మాణ శాఖ నిర్మిస్తున్న ఇళ్లల్లో ఎటువంటి మౌలికసదుపాయాలు కల్పించడం లేదు. కేవలం స్లాబ్ వేసి, తలుపులు ఏర్పాటు చేస్తే పూర్తిస్థాయిలో బిల్లులు మంజూరు చేసేస్తు న్నారు. అయితే అదనపు హంగులకు మరింత ధనం అవసరమవు తుందని, నెమ్మదిగా చేసుకుంటామని లబ్ధిదారులు కోరడంతో అధికా రులు ఫినిషింగ్ పరిశీలించి బిల్లులు ఇస్తున్నారు. కాగా రహదారులు, మురుగు కాలువలు, విద్యుత్, మంచినీరు తదితర సౌకర్యాలను సంబంధిత శాఖలే కల్పించాలని హౌసింగ్ డిపార్ట్‌మెంట్ కు సంబంధం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణాల పురోగతి తెలుసుకునేందుకు గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక యాప్ రూపొందించింది. ఇందులో క్షేత్రస్థాయి సిబ్బంది ఇళ్ల నిర్మాణ దశలను ఎప్పటికప్పుడు పొందుపరుస్తున్నారు. దీంతోపాటు జియో ట్యాగింగ్ ప్రక్రియ కూడా పూర్తిచేయడంతో ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణాల ప్రగతిని కార్యాలయం నుంచే పరిశీలించే అవకాశం ఉంది. గత ప్రభుత్వాలు ఇవ్వని రీతిలో పేదల కోసం కూటమి ప్రభుత్వం అదనపు సాయం ప్రకటించింది. సుమారు 3,200 కోట్లను కేటాయించింది. ఈ మొత్తంతో 92 వేల మందికి లబ్ధి చేకూరనుంది. అయితే ఇప్పటి వరకు కేవలం 22వేల మంది మాత్రమే ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. లబ్ధిదారులకు అదనపు సాయం గురించి అవగాహన కల్పిస్తున్నా, అది కూడా సరిపోదని అప్పులు చేయాల్సి వస్తోందని నిర్మాణాలకు ముందుకు రావడం లేదు.

ఎస్ఐఆర్‌పై ఈసీ ప్రకటన నేడు

(మొదటిపేజీ తరువాయి)

4.15 గంటలకు విలేకరుల సమావేశాన్ని నిర్వహించబోతోంది. ఇదే అంశాన్ని ఎన్నికల సంఘం ఆదివారం వెల్లడించింది. ఈ సమావేశంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఈసీలు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పాల్గొంటారని ఓ ప్రకటనలో తెలిపింది. ఎస్ఐఆర్‌ను మొదటగా బీహార్‌లో నిర్వహించడం, అది వివాదాస్పదంగా మారడం విదితమే. కాగా, గత రెండు నెలల్లో రాష్ట్ర సీఈఓలతో ఈసీ రెండు సమావేశాలు నిర్వహించింది. చివరిగా ఈనెల 22, 23 తేదీల్లో ఎస్ఐఆర్ కోసం ఏర్పాట్లను సమీక్షించింది.

అధికారులకు చంద్రబాబు అలర్ట్

విశాలాంధ్రబ్యూరో-అమరావతి : మొంథా తుపాను రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉండటం తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో తీరప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం అధికారులతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వాయుగుండం 28వ తేదీ ఉదయం నాటికి తీవ్రమైన తుపానుగా మారుతుందని, ఈ సమయంలో ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మచిలీపట్నం నుంచి కాకినాడ ప్రాంతం వరకు తుపాను తీవ్ర ప్రభావం చూపిస్తుందని, ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థలు సిద్ధంగా ఉండాలని సీఎం చెప్పారు. ఎస్ఎంఎస్ అలర్ట్స్, సోషల్ మీడియా, ఐవీఆర్ఎస్ కాల్స్, వాట్సాప్‌ల ద్వారా ప్రజలకు ముందస్తుగా హెచ్చరికలు పంపించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తుఫాన్ ప్రభావంపై సమాచారం వేగంగా చేరవేసి, నష్ట నివారణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఇప్పటికే తీర జిల్లాలలో మోహరించామని వెల్లడించిన ముఖ్యమంత్రి... తుపానుపై ప్రెడిక్టివ్ మోడల్, రియల్ టైమ్ డేటా ఆధారంగా విశ్లేషణ చేస్తున్నామన్నారు. రిజర్వాయర్లు, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించి అందుకు అనుగుణంగా కార్యాచరణ అమలు చేయాలని స్పష్టం చేశారు. విద్యుత్, టెలికాం, తాగునీటి సరఫరా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సముద్ర తీర ప్రాంత ప్రజలను తక్షణమే సమీపంలోని తుపాను రక్షణ కేంద్రాలకు తరలించి పునరావాసం కల్పించాలని సూచించారు. తుపాను తీవ్రతను బట్టి విద్యా సంస్థలకు ఆయా జిల్లాల కలెక్టర్లు సెలవులు ప్రకటించాలన్నారు. రహదారులు, చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేసేలా సిద్ధంగా ఉండాలన్నారు. చెట్లు కూలిపోయినా, కొమ్మలు విరిగిపడినా వాటిని తొలగించడానికి అవసరమైన పవర్ సా, క్రేన్‌లు, జేసీబీలు ప్రతీ సబ్ డివిజన్ స్థాయిలో సిద్ధం చేయాలని, డ్రోన్ల ద్వారా సహాయక చర్యలు చేపట్టేలా ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వాహనాలు సిద్ధం చేశామని, రాష్ట్రవ్యాప్తంగా 851 జేసీబీలు, అలాగే క్రేన్‌లు, పవర్ సాలు 757 అందుబాటులో ఉంచామని అధికారులు వెల్లడించారు.

'ఎంజాయ్ పేరుతో గంజాయి వద్దు'

విశాలాంధ్ర- హైదరాబాద్: ఎంజాయ్ పేరుతో గంజాయి వద్దు అంటూ తెలంగాణ ప్రజా నాట్యమండలి అధ్వర్యంలో సోమవారం నుంచి నవంబరు రెండో తేదీ వరకు బస్సు కళాజాత నిర్వహించనున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో ఆదివారం పార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు... వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటి నరసింహ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కార్యదర్శివర్గ సభ్యులు కళవేణ శంకర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, ప్రజానాట్యమండలి నాయకులు కె.లక్ష్మి నారాయణ, రాము, సైదులు, శైలజా, మంగలు పాల్గొన్నారు. పల్లె నర్సింహ నేతృత్వంలో 30 మంది కళాకారులు పాల్గొనున్న ఈ బస్సు కళా జాత సోమవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ లో నిజాం కళాశాల ప్రాంగణం నుంచి ప్రారంభం కానుంది. ఈ కళా జాత వివిధ విశ్వవిద్యాలయాలు, డిగ్రీ, జూనియర్ కళాశాలను సందర్శించి తమ సాంస్కృతిక కళా రూపాల ద్వారా విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగనుంది. ఎంపిక చేసిన జిల్లాలలోని మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనుంది. ఈ బస్సు కళాజాతను నవంబరు రెండో తేదీన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా మంచిర్యాలలో సాయంత్రం ఐదు గంటలకు ముగుస్తుంది. తెలిసీ తెలియక కొంత మంది విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న ఈనేపథ్యంలో కళాజాతను చేపట్టామని పల్లె నర్సింహ వివరించారు.

వక్ఫ్ చట్టం బుట్ట దాఖలు చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

గుప్పించారు. బీహార్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, 20 ఏళ్ల నితీశ్ పాలనతో విసిగిపోయి ఉన్నారని ఆయనన్నారు. ఎన్డీయే పాలనలో అవినీతి రాజ్యమేలులోందని, నేరాలు తార స్థాయికి చేరుకున్నాయని విమర్శించారు. బీజేపీ వ్యూహాలను ప్రజలు అర్థం చేసుకున్నారని, ఓటుతో ఆ పార్టీకి రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. 'ఎన్డీయేకు 20 ఏళ్లు ఇచ్చారు... మాకు ఒక్క అవకాశం ఇవ్వండి... 20 నెలల్లో మార్పు చేసి చూపిస్తాం. మా పాలనలో కొత్త బీహార్‌ను చూస్తారు' అని తేజస్వి పిలుపునిచ్చారు. బీహార్ ప్రజలు తనను ఆదరిస్తారన్న పూర్తి నమ్మకం ఉందన్నారు. అదే సమయంలో బీజేపీపై విమర్శలు గుప్పించారు. బీజేపీని 'భారత్ జలావో పార్టీ' (భారత్‌ను తగలబెట్టే పార్టీ) అనాలంటూ దుయ్యబట్టారు. నితీశ్ ప్రభుత్వ అండదండలతో ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు రెచ్చిపోయి మతవిద్వేషాన్ని సృష్టించాయని విమర్శించారు. తన తండ్రి, ఆర్జేడీ అధినేత, మాజీ సీఎం లాలు ప్రసాద్ యాదవ్ ఎప్పుడు కూడా మత శక్తులతో రాజీ పడలేదని... నితీశ్ మాత్రం ఆ శక్తులకు అండగా నిలిచారన్నారు. 20 ఏళ్లుగా అధికారంలో ఉన్నగానీ ముఖ్యమంత్రికి సోయ లేదని దుయ్యబట్టారు. ప్రతి ప్రభుత్వ శాఖలో అవినీతి పేట్రేగిపోయిందని, రాష్ట్రంలో శాంతి భద్రతులు పూర్తిగా క్షీణించాయని తేజస్వి విమర్శించారు. సీమాంచల్ ప్రాంతాభివృద్ధికి ఎన్డీయే చేసినదేమిటని ప్రశ్నించారు. ఇండియా ఐక్య సంఘటన అధికారంలోకి వచ్చాక సీమాంచల్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తామని తేజస్వీ యాదవ్ హామీనిచ్చారు. ఎన్నికల సందర్భంగా తామిచ్చే హామీలను ఎన్డీయే కాపీ కొడుతోందని ఆరోపించారు. 'వృద్ధాప్య పింఛన్ పెంచుతామని మేము చెప్పాం. నితీశ్ ప్రభుత్వం నెలసరి పింఛన్‌ను రూ.400 నుంచి రూ.1,100కు పెంచింది. ఇప్పుడు మేము అధికారంలోకి వస్తే దానిని రూ.2 వేలకు పెంచుతాం' అని తేజస్వీ యాదవ్ అన్నారు. అలాగే, రాష్ట్రంలోని క్షురకులకు, కుండల వ్యాపారులకు, వడ్రంగులకు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఆరు కొత్త జిల్లాలు?

విశాలాంధ్ర-సచివాలయం : రాష్ట్రంలో పాలనాపరంగా సంస్కరణలకు ప్రభుత్వం సిద్ధపడుతోంది. జిల్లాల పెంపు, వివిధ మండలాల మార్పులు, చేర్పులపై రాష్ట్రంలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రజల అవసరాలు, పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాలను పెంచుతూ మార్పులు చేర్పులు జరిగాయి. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జిల్లాల పునర్విభజనపై క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ కానుంది. కొత్త జిల్లాల ఏర్పాటు, జిల్లా కేంద్రాల మార్పులపై చర్చించనున్నారు. ఏపీలో ప్రస్తుతం ఉన్న 26 జిల్లాలను 32 జిల్లాలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. మంత్రి వర్గ ఉప సంఘాన్ని కూడా ఏర్పాటు చేసింది. ఎన్నికల్లో టీడీపీ కూటమి పార్టీలు తాము అధికారంలోకి వస్తే కొత్త జిల్లాలను ప్రకటిస్తామని హామీ ఇచ్చాయి. వైసీపీ హయాంలో అశాస్త్రీయంగా చేసిన కొన్ని జిల్లాలలో పరిస్థితిని మార్పు చేస్తామని కూడా కూటమి స్పష్టం చేసింది. వైసీపీ హయాంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించారు. జిల్లాల విభజన, పెంపు జరిగిన నాటి నుంచి అనేక వివాదాలు, అసంతృప్తులు ప్రజలు, రాజకీయ పక్షాల నుంచి వెల్లువెత్తాయి. ప్రజల అభిప్రాయాలను సమగ్రంగా సేకరించకుండానే గత పాలకులు నిర్ణయం తీసుకోవడం గందరగోళానికి దారి తీసింది. అయితే ఈ గందరగోళానికి తెరవేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

జేడీయూకు 'రెబల్స్' బెడద

16 మందిపై వేటు

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో అధికార జేడీయూకు రెబల్స్ వ్యవహారం తలనొప్పిగా మారింది. పార్టీకి చెందిన కొందరు నేతలు ఆయా స్థానాల్లో సొంత కూటమి అభ్యర్థులపైనే పోటీకి దిగారు. దీంతో పార్టీ అధిష్ఠానం... రెండు రోజుల వ్యవధిలో 16 మందిపై బహిష్కరణ వేటు వేసింది. ఓ సిట్టింగ్ ఎమ్మెల్యేతోపాటు ఇద్దరు మాజీ మంత్రులు ఈ జాబితాలో ఉండటం గమనార్హం. భాగల్‌పూర్ జిల్లా గోపాల్‌పూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే నరేంద్ర నీరజ్ ఎలియాస్ గోపాల్ మండల్ ఆ స్థానం వరుసగా నాలుగుసార్లు గెలిచారు. అయితే.. ఈసారి పార్టీ తనకు టికెట్ ఇచ్చే అవకాశం లేదని తెలుసుకున్న ఆయన ఇటీవల పట్నాలోని సీఎం నితీశ్ కుమార్ నివాసం ఎదుట ధర్నాకు దిగారు. చివరకు నిరాశే ఎదురుకావడంతో.. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. మాజీ మంత్రులు శైలేశ్ కుమార్, హిమ్‌రాజ్ సింగ్ సైతం ఆయా స్థానాల నుంచి స్వతంత్రులుగా పోటీ చేస్తున్నారు. వీరితోపాటు మాజీ ఎమ్మెల్యేలు మహేశ్వర్ ప్రసాద్ యాదవ్, శ్యామ్‌బహదూర్ సింగ్, సుదర్శన్ కుమార్, మాజీ ఎమ్మెల్సీలు సంజయ్ ప్రసాద్, రణ్‌విజయ్ సింగ్, సంజీవ్ శ్యామ్ సింగ్‌లపైనా జేడీయూ చర్యలు తీసుకుంది.

21 మంది మావోయిస్టుల లొంగుబాటు

(మొదటిపేజీ తరువాయి)

పోలీసు ఇన్‌స్పెక్టర్ పి.సుందర్‌రాజ్ మాట్లాడుతూ మావోయిస్టులు తాము అనుసరిస్తున్న మార్గం వ్యర్థమని భావించి... వారి జీవితాలను పునర్నిర్మించుకునేందుకు జనజీవన స్రవంతిలోకి తిరిగి రావాలని ఎంచుకున్నారన్నారు. ఆయుధాలను విడిచిపెట్టిన 21 మందిలో 13 మంది మహిళలు, ఎనిమిది మంది పురుషులు ఉన్నారని అన్నారు. సాయుధ పోరాటాన్ని వీడి శాంతి, పురోగతి మార్గంలో వెళ్లాలనుకుంటున్నారని పోలీసు అధికారి తెలిపారు. లొంగుబాటు సమయంలో మావోయిస్టులు 18 ఆయుధాలను అప్పగించారు. ఇందులో మూడు ఏకే 47 రైఫిల్స్, నాలుగు ఎస్ఎల్ఆర్‌లు, రెండు ఇన్సాస్ రైఫిల్స్, ఆరు 303 రైఫిల్స్, రెండు సింగిల్ షాట్ రైఫిల్స్, ఓ బీజీఎల్ (బారెల్ గ్రెనేడ్ లాంచర్) ఉన్నాయి. చట్టప్రకారం పునరావాసం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. లొంగుబాటు, పునరావాసానికి సంబంధించిన వివరాలన్నీ త్వరలోనే వివరిస్తామని ఐజీ సుందర్‌రాజ్ పేర్కొన్నారు. ఇదిలాఉండగా, ఇటీవల పెద్ద సంఖ్యలో మావోయిస్టులు అడవి మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. అక్టోబరు మూడవ వారంలో దాదాపు 238 మంది మావోయిస్టులు లొంగిపోయారు. 17న బస్తర్ జిల్లా ప్రధాన కార్యాలయం జగదల్‌పూర్‌లో అధికారుల ముందు లొంగిపోయిన కేంద్ర కమిటీ (సీసీ) సభ్యుడితో సహా దాదాపు 210 మంది మావోయిస్టులు లొంగిపోయిన విషయం తెలిసిందే. రూ.9.18 కోట్ల రివార్డును ప్రకటించారు. లొంగిపోయిన సీనియర్ నేతల్లో కేంద్ర కమిటీ సభ్యుడు రూపేశ్ అలియాస్ సతీశ్, భాస్కర్ అలియాస్ రాజ్‌మన్ మాండవి, రాణిత, రాజు సలాం, ధన్ను వెట్టి, అలియాస్ సంతు, నలుగురు సభ్యులు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, ప్రాంతీయ కమిటీ సభ్యుడు రతన్ ఎలామ్ ఉన్నారు.

'బురవెస్ట్నిక్' క్రూయిజ్ క్షిపణి పరీక్ష విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

క్షిపణిని పరీక్షించారు. సైనిక దుస్తుల్లో ఉన్న పుతిన్.. ఉక్రెయిన్ యుద్ధాన్ని పర్యవేక్షిస్తున్న జనరల్స్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రష్యా సైనిక దళాల చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్ వాలెరీ గెరాసిమోవ్ మాట్లాడుతూ.. ఈ క్షిపణి పరీక్ష సమయంలో అణుశక్తితో ఏకధాటిగా 15 గంటల పాటు గాల్లో ప్రయాణించిందని, మొత్తం 14,000 కిలోమీటర్ల దూరాన్ని చేరుకుందని పుతిన్‌కు వివరించారు. ఈ క్షిపణికి దాదాపు అపరిమితమైన పరిధి ఉందని, దాని ప్రయాణ మార్గాన్ని అంచనా వేయడం అసాధ్యమని ఆయన తెలిపారు.

నాటో దేశాలు 'ఎస్ఎస్‌సి-9 స్కైఫాల్' అని పిలుస్తున్న ఈ బురవెస్ట్నిక్ క్షిపణి గురించి పుతిన్ మాట్లాడుతూ, "ఇది ప్రపంచంలో మరెవరి దగ్గరా లేని ఒక ప్రత్యేకమైన ఆయుధం. ఒకప్పుడు ఇలాంటి క్షిపణి తయారీ అసాధ్యమని మా నిపుణులే చెప్పారు. కానీ ఇప్పుడు కీలకమైన పరీక్షలు పూర్తయ్యాయి" అని అన్నారు. ఈ ఆయుధాన్ని మోహరించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని ఆయన జనరల్ గెరాసిమోవ్‌ను ఆదేశించారు.

2001లో యాంటీ-బాలిస్టిక్ మిస్సైల్ ఒప్పందం నుంచి అమెరికా ఏకపక్షంగా వైదొలగడం, నాటో కూటమిని విస్తరించడం వంటి చర్యలకు ప్రతిస్పందనగా 2018లోనే పుతిన్ ఈ క్షిపణి గురించి తొలిసారి ప్రకటించారు. ఉక్రెయిన్‌కు అమెరికా అత్యాధునిక ఆయుధాలు, నిఘా సమాచారం అందిస్తున్న నేపథ్యంలో, రష్యాపై దాడి చేస్తే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించేందుకే ఈ పరీక్షను సరైన సమయంలో నిర్వహించినట్లు స్పష్టమవుతోంది.

మణిపూర్‌లో 3,300 డెంగీ కేసులు

(మొదటిపేజీ తరువాయి)

డెంగీ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. బిష్ణుపూర్‌లో 96, తౌబాల్‌లో 74, సేనాపతిలో 61, కాక్చింగ్ జిల్లాలో 45 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఉఖ్రుల్, చందేల్, తమెంగ్‌లాంగ్, టెంగ్నౌపాల్, కామ్‌జోంగ్, నోనీ, కాంగ్‌పోక్‌పి, చురచంద్‌పూర్ జిల్లాల్లో 50 కంటే తక్కువ కేసులు ఉన్నాయన్నారు. మరోవైపు, జిరిబామ్, ఫెర్జావల్‌లో ఎలాంటి డెంగీ కేసులు నమోదు కాలేదని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. బిష్ణుపూర్ జిల్లాలో డెంగీ వల్ల ఒకరు మరణించారని, పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు చెప్పారు.

ప్రకృతి వైద్య ఆసుపత్రి ప్రారంభం

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలోని శివలింగాపూర్ గ్రామంలో సత్య ప్రకృతి వైద్య ఆసుపత్రిని పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి కాలంలో ప్రకృతి వైద్యం అందించడం చాలా గొప్ప విషయమని, ఇంత మంచి ప్రకృతి ఆసుపత్రి స్థాపించిన స్థాపకులకు అభినందిస్తూ చెన్నూర్ ప్రాంతంలో ఇలాంటి వైద్య సేవలు అందించడం చాలా ఆనందంగా ఉంది. నేచురల్ లైఫ్‌ను మనం ఈ కాలంలో వాడుకోవడం లేదు. ఇప్పుడు అన్నింటిలోనూ కెమికల్స్ విపరీతంగా వాడకం జరుగుతుందన్నారు. ఈ ఆసుపత్రి దినదిన అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ నేచరల్ పద్ధతిలో వైద్యం అందించి రోగాల నివారణకు కృషి చేస్తున్న ఆసుపత్రి యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

గంజాయి స్మగ్లర్ వెంకన్నపై పీడీ యాక్ట్ నమోదు

విశాలాంధ్ర - ఇల్లందు : గంజాయి రవాణా చేస్తున్న స్మగ్లర్లపై జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం గంజాయి కేసుల్లోని నిందితుడు సపావత్ వెంకన్నపై ఇల్లందు పోలీసులు పీడీయాక్ట్ నమోదు చేసారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఇల్లందు డీఎస్పీ సలహా ప్రకారం సీఐ సురేష్ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కాశీరామ్ తండాకు చెందిన వెంకన్నపై పిడి యాక్టు కింద కేసు పెట్టి ఉన్నతాధికారులకు ఆ పత్రాలను అందించారు. అక్రమార్జనకు అలవాటుపడి నిషేదిత గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడిన వెంకన్నపై ఇల్లందు, భద్రాచలంతోపాటు హైదరాబాద్ రాజేంద్ర నగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ కేసుల నేపథ్యంలో ఖమ్మం సబ్‌జైలులో ఉన్న నిందితుడిపై పీడీయాక్టు అమలు చేస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేసారు. సీఐ సురేష్ నిందితుడిని చర్లపల్లి జైలుకి తరలించారు. ఇలాంటి నేరస్తుల వల్ల ఎంతో మంది యువత మత్తుకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఎస్పీ రోహిత్ రాజు ఈ సందర్భంగా తెలిపారు. వెంకన్నపై పీడి యాక్ట్ నమోదయ్యేలా కృషి చేసిన ఇల్లందు డిఎస్పీ చంద్రభాను, ఇల్లందు సీఐ సురేష్, సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఉద్యమ సూరీడు ఎర్రయ్యకు ఘన నివాళి

విశాలాంధ్ర-నల్లగొండబ్యూరో : అట్టడుగు వర్గాల నుంచి పుట్టి సమాజంలో చైతన్య జ్వాలలు రగిలించిన ఉద్యమ సూరీడు రుద్రాక్షి ఎర్రయ్యని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి స్మరించారు. ఆదివారం పట్టణంలోని 3వ వార్డు ఎస్టీ కాలనీలో రైతు వేదిక సమీపంలో కామ్రేడ్ రుద్రాక్షి ఎర్రయ్య 34వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదనంతరం నల్లగొండ మండలంలోని ఖాజీరామారం ఎక్స్ రోడ్డులో రుద్రాక్షి ఎర్రయ్య జ్ఞాపకార్థం నిర్మించనున్న బస్సు షెల్టర్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన వర్ధంతి సభలో ప్రధాన అతిథిగా పాల్గొన్న వీరారెడ్డి మాట్లాడుతూ ఎర్రయ్య పెద్దగా చదువుకోనప్పటికీ ప్రజా సమస్యలపై చైతన్యం కలిగిన వ్యక్తి. 90వ దశకంలో ఖాజీరామారం, అల్లిగూడెం, తానే దారుపల్లి గ్రామాల్లో ఉద్యమ పాఠాలు నేర్పి ప్రజా శక్తిని ఏకం చేశారు. సర్పంచ్‌గా సేవలందించి పేదల కోసం ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయడం ఆయన ప్రజాభిమానాన్ని తెలియజేస్తుందన్నారు.ఇప్పటికీ ఆ ప్రాంత ప్రజలు ఎర్రయ్యను స్మరించుకుంటూ ఆయన పేరుతో బస్సు షెల్టర్ నిర్మించడాన్ని హర్షనీయమని వీరారెడ్డి అభినందించారు. "కమ్యూనిస్టు ఉద్యమం బలపడకూడదనే ఉద్దేశంతో నాటి కాంగ్రెస్ గుండాలు నకిలీ నక్సలైట్లతో చేతులు కలిపి ఎర్రయ్యను దారుణంగా హత్య చేయడం చరిత్రలో నలుపు అక్షరాలుగా మిగిలిపోయింది" అని ఆయన పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హాషం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాలడుగు నాగార్జున, ప్రభావతి, ఎండీ సలీం, దండంపల్లి సత్తయ్య, చింతపల్లి బయ్యన్న, పెంజర్ల సైదులు, తుమ్మల పద్మ, అనంతుల శంకరయ్య, పోలే సత్యనారాయణ, భీమగాని గణేష్, గంజి నాగరాజు గౌడ్, హాస్టల్ అధ్యక్షుడు సుంకరి వెంకటేశ్వర్లు, రుద్రాక్షి రామచంద్రు, యాదయ్య, పాలకూరి యాదయ్య, బూర జానయ్య, నకిరేకంటి జానయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను పట్టించుకోరా?

విశాలాంధ్ర గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బోద్దుగుండ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న చిల్లకండి తండాలో గిరిజన ప్రాథమిక పాఠశాల అస్తవ్యస్తంగా ఉన్నదనీ ఆ పాఠశాలను పట్టించుకునే నాధుడే కరువయ్యారా గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. చిన్న వర్షానికి చెరువును తలపిస్తూ విద్యార్థులు కూర్చోవడానికి కూడా వీలు లేకుండా పాఠశాల గదిలలో వర్షపు నీరుతో పాటు చేరి ఊట కూడా తోడవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు పాఠశాల బలోపేతం కోసం చర్యలు తీసుకుంటున్నట్టు ప్రచారం చేస్తూ ఆచరణలో మాత్రం అమలు కావడం లేదనీ ఆ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు గుగులోతు హరినాయక్ అన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం తన సొంత గ్రామమైన చిల్లగంటి తండాకు బదిలీ అయి పాఠశాలల విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నాడు. పాఠశాల రూపురేఖలు ఒక్కసారిగా అతడిని కలచివేసింది. వెంటనే ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణ ముందు వర్షపు నీరు రాకుండా 20 ట్రిప్పుల మట్టి పోయించి పాఠశాల గదిలలో అస్తవ్యస్తంగా తయారైన గదుల రూపురేఖలను మార్చి మరమ్మతులు చేయించారు. పాఠశాల స్థితిగతులను ఐటీడీఏ పీవోకు ఎన్నోసార్లు అర్జీ పెట్టినా కూడా పాఠశాలపై కనికరం రావట్లేదనీ ఆ గ్రామంలో చదువుకున్నటువంటి ఐదవ తరగతి విద్యార్థులు పాఠశాలలోకి నీరు రావడం వల్ల బొద్దుగొండకు వెళ్లాలంటే 4 కిలోమీటర్ల దూరం వెళ్లవలసి వస్తుందని ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన నిర్మాణ పనులు చేసినా కూడా వర్షపు నీరు ఊటగా మారి పాఠశాల గదిలోకి వచ్చి కూర్చోవడానికి చోటు లేకుండా ఇబ్బందికరంగా మారిపోయిందని తెలిపారు. ఇకనైనా ఐటీడీఏ పిఓ, మహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎంపీ లు పాఠశాలపై కనికరం చూపి నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని హరినాయక్ కోరారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు : ఎమ్మెల్యే జారె

విశాలాంధ్ర - అశ్వరావుపేట : తన నియోజకవర్గంలో ప్రతి మండలంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి తీరుతానని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ భరోసా ఇచ్చారు. ఆదివారం ఆయన అశ్వారావుపేట మండలంలో విస్తృతంగా పర్యటించారు. వివిధ గ్రామాలలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల స్థితిగతులను పరిశీలించారు. బిల్లులు సకాలంలో తగ్గుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. అలాగే ఉసిర్లగూడెం వినాయకపురం గ్రామాలలో కొన్ని శుభకార్యాలలో పాల్గొన్నారు. అనంతరం దొంతికుంటలో నూకాలమ్మ అమ్మవారి దేవాలయాన్ని సందర్శించి పూజకార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతలో నైపుణ్య అభివృద్ధి పెరగాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : యువత నైపుణ్యాలు పెంపొందించుకుని ఎదగాలని జిల్లా కలెక్టర్ జితేష్ కోరారు. వివిధ పనులు నైపుణ్యం ఉన్న యువతకు ఉపాధి కల్పించే బాధ్యత తనపై ఉందన్నారు. ఎక్కడైనా స్వయం కృషితోనే గ్రామాభివృద్ధి సాధ్యమన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే విద్యతోపాటు కుటుంబాల, సామాజిక, ఆర్థిక స్థితిల్లో నైపుణ్యాలు పెంపొందించాలన్నారు. ఆదివారం పాల్వంచ మండలంలోని బంద్రుగొండ పంచాయతీ పరిధిలోని కోయగట్టు గొత్తికోయ గ్రామాన్ని సందర్శించారు. ఆ గ్రామీణ ప్రజలతో ముచ్చటించి అభివృద్ధి చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మతో కలిసి గ్రామంలో మట్టితో ఇటీకల తయారీ విధానాన్ని స్వయంగా ప్రదర్శించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రతీ చిన్న పనికీ ప్రభుత్వంపై ఆధారపడకుండా, స్వయం కృషితో ముందుకు సాగాలని కలెక్టర్ ప్రోత్సహించారు. ఉదయం పూట ఖాళీ సమయాన్ని వినియోగించి స్వయంగా ఇటుకలు తయారు చేసుకుని గ్రామంలో పాఠశాల భవనం నిర్మాణానికి ఉపయోగించుకోవాలన్నారు.అడవుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, అటవీ ప్రాంతంలో చెట్లు నరకకుండా ఉపాధి హామీ పథకం ద్వారా ప్రత్యామ్నాయ జీవనాధారాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో గ్రామస్తులు చేపల పెంపకం, కౌజు పిట్టల పెంపకం, వెదురు సాగు వంటి ఉపాధి మార్గాలను ఎంచుకుని స్థిరమైన ఆదాయం పొందవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి, ఎంపీఓ చెన్నకేశవులు, ఏపీఓ పోరండ్ల రంగా, ఆర్ఐ ప్రసాద్, అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్, ఈసీలు రాజు, తిరుపతయ్య, గ్రామ కార్యదర్శులు నారాయణ, ప్రవీణ్ కుమార్, శంకర్, రాములు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-ఖమ్మం : కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం నూతనంగా పీఎం శ్రీ స్కూల్స్ ఏర్పాటు చేయడం ద్వారా నూతన విద్యా విధానం పేరుతో పసిపిల్లల మెదల్లో మతతత్వ బీజాలు నాటే ప్రయత్నం చేస్తుందని, వెంటనే నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం ఆదివారం గిరిప్రసాద్భవన్లో ఏఐఎస్ఎఫ్ నగర ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ. దేశవ్యాప్తంగా 2022- 23 నుంచి 2026 - 2027 వరకు ఐదు సంవత్సరాలు కాలంలో దేశవ్యాప్తంగా పీఎం శ్రీ సుమారుగా 14,500 పాఠశాలలను నెలకొల్పాలని ప్రాథమిక విద్య నూతన విద్యా విధానం ద్వారా మతతత్వ బోధనలు చేయాలని తలపెట్టిందన్నారు. దానిలో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో ప్రతి మండలానికి పీఎం శ్రీ పాఠశాల ఏర్పాటు చేయడానికి పూనుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై పునరాలోచన చేయాలని ఆయన కోరారు. దేశవ్యాప్తంగా విద్యావేత్తలు ప్రగతిశీల మేధావులు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం సరైనది కాదని చాలా కాలంగా నిరసన లు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు శివ వంశీ జిల్లా నాయకులు గోపి పవన్ నరేందర్ సందీప్ వెంకట్ రమేషు తదితరులు పాల్గొన్నారు...

అభివృద్ధిలో యువత తమవంతు బాధ్యత నిర్వర్తించాలి: కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: తెలంగాణ రైసింగ్ 2047 లక్ష్యాన్ని రాష్ట్ర యువత సమిష్టిగా సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల ఎ ఎం సి మైదానంలో సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి డీసీపీ ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, సింగరేణి సంస్థ డైరెక్టర్ (పి.పి.) కె.వెంకటేశ్వర్లు, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ లతో కలిసి హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రైసింగ్ 2047 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర అభివృద్ధి చేసి దేశంలో నంబర్ 1 స్థానంలో నిలిపేందుకు రాష్ట్ర యువత సమిష్టిగా కలిసి రావాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రభుత్వం యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి అధునాతన సాంకేతిక వృత్తి విద్య కోర్సులను అందించడం జరుగుతుందని తెలిపారు. యువతలో నైపుణ్యాభివృద్ధికి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా అనేక కోర్సులలో నైపుణ్య శిక్షణ అందిస్తుందని తెలిపారు. నిరుద్యోగ యువత ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని నైపుణ్య శిక్షణతో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వృత్తి విద్య కోర్సుల ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలలో ఉపాధి అవకాశాలు కల్పిస్తూ జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలను పరుస్తుందని, ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగం పొందిన వారు తమ రంగంలో నైపుణ్యత సాధించాలని తెలిపారు. యువత రాష్ట్ర అభివృద్ధిలో తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని తెలిపారు. అనంతరం జాబ్ మేళా కార్యక్రమంలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు.

వంద పడకల ఆసుపత్రికి మోక్షం ఎప్పుడు?

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్: జిల్లాలోని అతిపెద్ద డివిజన్ కేంద్రంగా ఉన్న తొర్రూర్ మున్సిపల్ , మండలం, దానికి తోడు వరంగల్ నుండి ఖమ్మం, హైదరాబాద్,సూర్యాపేట హైవే రోడ్డుకు ఆనుకొని ఉండడంతో ప్రజలు రాకపోకలకు అనువైన స్థలంగా తొర్రూరు ఉంది. 2023- 24 సంలో 36 కోట్లతో 100 పడకల నిర్మాణానికి శాంక్షన్ అయింది. హాస్పటల్‌కు సరిపడే 89 మంది సిబ్బందిని శాంక్షన్ చేశారు. అందులో ఏరియా సూపరిండెంట్‌తో పాటు 24 మంది సిబ్బంది జాయిన్ అయి డ్యూటీ చేస్తున్నారు. 100 పడకల ఆసుపత్రి కాగితాల మేరకే శాంక్షన్ అయింది. ఆచరణలో శూన్యంగా మారిపోయింది. ఈ వంద పడకల ఆసుపత్రిని నిర్మాణం చేపట్టడానికి తొర్రూర్ ఆస్పత్రి ఆవరణములో లేక అంగడి మరియు మడిపల్లి గ్రామంలో ఉన్న స్థలాలను ప్రజా ప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. కానీ ఎక్కడేసిన గొంగళి అక్కడే ఉన్న సందర్భంగా మారిపోయింది. ఇటీవల మడిపల్లి గ్రామంలో 100 పడకల ఆసుపత్రి నిర్మించకూడదని ధర్నాలు చేశారు. దీనికి తోడు 100 పడకల ట్రామా సెంటర్‌ను శాంక్షన్ అయినట్లు విశ్వసనీయ సమాచారం. వంద పడకలకే దిక్కు లేదు కానీ, ట్రామా సెంటర్ ఏర్పాటు చేస్తారంటే నమ్మశక్యంగా లేదని, ఇదంతా ప్రజలను మభ్యపెడదానికే తప్ప, పని చేసేది ఏమీ లేదని అంటున్నారు ప్రజలు. 100 పడకల హాస్పటల్ కి డిసెంబర్ 2024 టెండర్ కూడా అయింది. కానీ ప్రభుత్వం అన్ని ఇచ్చిన అల్లుని నోట్లో శని ఉన్న సందముగా మిగిలిపోయింది వంద పడకల ఆస్పత్రి. రెక్కాడితే డొక్కాడని ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. పెద్ద పెద్ద జబ్బులు, మరియు యాక్సిడెంట్ అయినప్పుడు వారు వైద్యం చేయించుకోవడానికి దిక్కులేక ప్రవేట్ ఆస్పత్రిలకు పోవాల్సి వస్తుందని సామాన్య ప్రజలు తెలుపుతున్నారు. స్థల సేకరణ అని చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప సామాన్య ప్రజలకు వైద్యం అందించాలని మనసు లేకపోవడం శోచనీయంగా ఉంది. నాంచార్ మదూరు నుండి మాటేడు వరకు హైవే రోడ్డు ఇరుపక్కల ప్రభుత్వ స్థలాలు లేవా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు అనుకూలమైన స్థలము కాకుండా తొర్రూరు పట్టణానికి దూరముగా ఆసుపత్రిని నిర్మిస్తే, సామాన్య ప్రజలు పోలేని దుస్థితి నెలకొంటుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని 100 పడకల ఆసుపత్రితో పాటు ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మరిపెడలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి అక్కడి ఎమ్మెల్యే ఎంపీలు స్థల సేకరణ చేశారని, త్వరలో శంకుస్థాపనకు చేయబోతున్నారు. మరిపెడ కంటే ముందే తొర్రూర్ 100 పడకల ఆసుపత్రి శాంక్షన్ అయిందని, ఇప్పటి వరకు గతిమోక్షం లేకుండా ఉందని ప్రజలు బాహాటంగానే చర్చించుకుం టున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీ నాయకులు ,అధికారులు ప్రజలకు అనుకూలమైన స్థల పరిశీలన చేసి 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని వేడుకుంటున్నారు. ఏరియా సూపరిండెంట్ సుగుణాకర్ రాజును వివరణ కోరగా వంద పడకల ఆసుపత్రికి ప్రభుత్వం రూ.36 కోట్లు సాంక్షన్ చేసిందని, టెండర్ ప్రక్రియ పూర్తయిందని తెలిసిందన్నారు. స్థల నిర్ధారణ కాగానే కాంట్రాక్టర్ పనులు చేపట్టాలన్నారు.

రైతు బిడ్డ ఆలపాటికి రైతు నేస్తం అవార్డు

విశాలాంధ్ర, దమ్మపేట : తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫామ్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్‌కు ఆదివారం 'రైతు నేస్తం' అవార్డు అందించారు. రాష్ట్రంలో పామాయిల్ సాగు విస్తరణకు ఆయన చేసిన విశేష కృషి చేసినందుకు ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు స్వీకరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇది పామాయిల్ రైతుల సమిష్టి కృషికి తనకు లభించిన గుర్తింపు అన్నారు. రాజధానిలో జరిగిన ఈ అవార్డు ప్రధాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పాల్గొని మాట్లాడారని ఆలపాటి వివరించారు. పామాయిల్ సాగు విస్తరణలో కీలకపాత్ర పోషిస్తూ రైతాంగ అభివృద్ధికి కృషి చేస్తున్న తనను వెంకయ్యనాయుడు తోపాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వేదికపై ప్రశంసించి, అభినందించడం మరిచిపోలేని ఘట్టమన్నారు. దమ్మపేట మండలంలో పామాయిల్ రైతులను ప్రోత్సహించిన ఫలితంగానే తలకు అవార్డు వచ్చిందని వెంకయ్య నాయుడు పేర్కొన్నారని చెప్పారు. అవార్డు గౌరవం తనకొడిదే కాదని మొత్తం పామాయిల్ రైతుల కృషి ఫలితమేనని ఆలపాటి అన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి: కట్టా

విశాలాంధ్ర ఖమ్మం/ వైరా : బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి లక్ష్యంగా కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేయాలని స్థానిక సంస్థల్లో పార్టీని గెలిపించాలని పార్టీ జిల్లా నాయకులు కట్ట కృష్ణ అర్జున్ రావు పిలుపునిచ్చారు. వైరా పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మద్దెల రవి అధ్యక్షతన స్థానిక శ్రీనికేతన్ స్కూల్ ఆవరణంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల ముఖ్య కార్యకర్తలు పాల్గొన్న ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేయాలని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఒక పెద్ద సముద్రం లాంటిదని ఎప్పటికీ పార్టీ అంతరించిపోదని ఎవరో కలలు కంటూ పార్టీ పట్లా మాట్లాడే మాటలు వారి నైతిక విలువలకే వదిలేస్తున్నామన్నారు. వైరా మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ బలంగానే ఉందని ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలన్నారు. మన అందరి ఎజెండా బీఆర్ఎస్ పార్టీ గెలుపు ధ్యేయం ,మన నాయకుడు కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో రావటం ఖాయమన్నారు. త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని మాగంటి సునీత విజయాన్ని ఎవరు ఆపలేరని జోష్యం చెప్పారు. భవిష్యత్తు కార్యాచరణ ఏ విధంగా ఉండాలి సమస్యలపై ఉద్యమం ఏ విధంగా చేయాలనే దానిపై సమాలోచన చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు , జిల్లా వర్తక సంఘం అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ సీనియర్ నాయకులు వనమా విశ్వేశ్వరరావు,మాజీ కౌన్సిలర్ దారిల్లి పవిత్ర కుమారి ,మాదినేని దుర్గాప్రసాద్ ,దొంతేబోయన వెంకటేశ్వర్లు, ఎదునూరి శ్రీను, నుకల వాసు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

పారదర్శకంగా మద్యం లాటరీ : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: పారదర్శకంగా మద్యం దుకాణాల కోసం ఈనెల 27న లాటరీ ప్రక్రియ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం మెదక్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్ లో లాటరీ ఏర్పాట్లను పరిశీలించారు. 2025 - 27 సంవత్సరాలకు మెదక్ జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మొత్తం 49 మద్యం షాపులకుగాను 1420 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తు ఫీజు రూ.42 కోట్ల 60 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. ఉ.11 గంటలకు డ్రా తీయడం ప్రారంభం అవుతుందన్నారు.

దళారులను నమ్మొద్దు....

మెదక్ మండల రాజ్ పల్లిలో కలెక్టర్ రాహుల్ రాజ్ విస్తృతంగా పర్యటించారు. ఫ్యాక్స్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం, 33 /11 సబ్ స్టేషన్ తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, సబ్ స్టేషన్ లో పలు రికార్డులను పరిశీలించారు. ధాన్యం సేకరణ తీరును, మాశ్చరైజేషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాపై రైతులను వివరాలు తెలుసుకున్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 498 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు దళారులను నమ్మి మోస పోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్ లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు.

అమరవీరుడి కుటుంబాన్ని పరామర్శించిన ఏఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా అమరవీరుడు హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య కుటుంబాన్ని ఏఎస్పీ మహేందర్ పరామర్శించారు. అమరవీరుడు పెంటయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఆరోగ్యం, జీవన పరిస్థితులను తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. 1997 నవంబర్ 17న నక్సలైట్ల కదలికలపై సమాచారం అందుకొని విధి నిర్వహణలో బయలుదేరిన సందర్భంలో శివంపేట్ మండలంలోని పిలుట్ల వద్ద జరిగిన బాంబు దాడిలో ఆరుగురున్నారు. అప్పటి తూప్రాన్ డియస్పి యం. బాల సుబ్రహ్మణ్యం, తూప్రాన్ సీఐ వై. వెంకటస్వామి, ఎస్బి హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, శివంపేట్ కానిస్టేబుళ్లు లక్ష్మన్ నాయక్, శ్రీనివాస్‌రావు, సుజాయత్ అలీ ఆ దాడిలో వీరమరణం పొందారు. విధి పట్ల కట్టుబాటుతో ప్రాణత్యాగం చేసిన వారి సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. వెంట మెదక్ డియస్పి డి. ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్, సిబ్బంది ఉన్నారు.

31న బ్యాడ్మింటన్ డబుల్స్ టోర్నమెంట్....

పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఈనెల 31న మెదక్ పట్టణంలోని పీఎన్ఆర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ డబుల్స్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. 30న సాయంత్రం 5 గంటలలోపు 87126 57954 ఆర్ఎస్సై నరేష్ వద్ద పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ మహేందర్ చేతుల మీదుగా విజేతలకు ట్రోఫీలు అందజేస్తామన్నారు. ఈ టోర్నమెంట్ ఓపెన్ టు ఆల్ విధానంలో ఉంటుందన్నారు. పోలీసులు మాత్రమే కాకుండా, ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొనవచ్చన్నారు.

సింగరేణి సీఐగా సాగర్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర కారేపల్లి : సింగరేణి సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా నూనావత్ సాగర్ ఆదివారం బాధ్యతల స్వీకరించారు. ఆయన ప్రస్తుత సీఐ తిరుపతిరెడ్డి నుంచి బాధ్యతలు చేపట్టారు. వైరా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సాగర్ బదిలీపై సింగరేణి వచ్చారు. ఇక్కడ పనిచేసిన బి.తిరుపతిరెడ్డి డీజీపీ కార్యాలయం హైదరాబాద్‌కు వెళ్లారు.

గోవింద్ తండాలో బాలిక మృతిలి

విశాలాంధ్ర కారేపల్లి : పండ్లు తోముకునే పేస్టు అనుకుని ఎలకల మందు తిన్న బాలిక చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన ఘటన కారేపల్లి మండల పరిధిలోని గోవింద్ తండాలో చోటుచేసుకుంది. గోవింద్ తండాకు చెందిన ధారావత్ మానస (3)ఈనెల 17న ఇంట్లో ఉన్న దంతాలు తోముకునే పేస్టు అనుకోని ఎలకల మందు తిన్నది. విషయం గమనించిన బాలిక తల్లిదండ్రులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాదు తరలించగా చికిత్స పొందుతూ బాలిక ఆదివారం మృతి చెందింది. బాలిక తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు కారేపల్లి ఎస్ఐ బైరు గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాగ్దేవి స్టడీ హాల్ ప్రారంభం

విశాలాంధ్ర-నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణంలో శ్రీనివాస్ థియేటర్ సమీపంలోని భవనంలో ఏర్పాటు చేసిన వాగ్దేవి స్టడీ హాల్‌ను ఆదివారం నేరేడుచర్ల మండల విద్యా అధికారి పుట్లూరు సత్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువతకు వాగ్దేవి స్టడీ హాల్ ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని అన్నారు. దూర ప్రాంతాలకు, ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లకుండానే తమ స్వగ్రామంలోనే సౌకర్యవంతమైన వాతావరణం లో చదివే వీలుందని పేర్కొన్నారు. వాగ్దేవి స్టడీ హాల్‌ను ప్రారంభించిన సత్యనారాయణ రెడ్డి, ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకుడు చింతలచెర్వు గంగ రాజును ఎంతో అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో కీలకమని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ నాయక్, జెట్ పీ హెచ్ ఎస్ నేరేడుచర్ల హెచ్ఎం బట్టు మధు, అంజలి స్కూల్ కరస్పాండెంట్ అలక సైదిరెడ్డి, పినాకిల్ కరస్పాండెంట్ మహమ్మద్ మదార్ తదితరులు పాల్గొన్నారు.

దారులు

దారులు హఠాత్తుగా ఆకాశం నుంచి
ఊడిపడవు, అవి స్వేద
పాదముద్రలతో విత్తనమై,
కాలం కరవాలం పట్టుకుని
ఎన్నో యుద్ధాలు గెలిచిన తరువాతే
సువర్ణకాంతులతో పుష్పిస్తాయి.

దారులంటే కేవలం బాటలు కావు
మనిషి మనుగడకై చేసిన పోరాటాలు
పల్లేరుకాయలను బొండుమల్లెలుగా,
ముళ్లకంపలను గొంగడి పరుపులుగా

మార్చగల శక్తి సంకల్పానికీ ఉంది

భవిష్యత్తు వెలిగించే తారకలు,
అవని అంధకారం తొలగించే సూర్యుళ్లు,
మనిషి సంకల్పవికల్పాలే ఈ దారులు

అవహేళనలతో దగ్ధమైన హృదయంలో
స్వప్నాలను రాసుకుంటూ సాగితే,
బద్దలయ్యే అగ్నిపర్వత గుండెలో
కొత్తకొత్త దారులు జ్వలిస్తాయి

కానీ దారులు ఏర్పడటం
అనుకున్నంత సులువేమీ కాదు
అది అనుభవాల సమీకరణం,
పోరాటాల పరిణామం.
ముళ్లబాటల్లోనూ పూలబాటను కనుగొనగలవాడు
ఈ భూమ్మీద చెరగని రేఖలను గీయగలడు

డా. ఐ. చిదానందం, 8801444335

సాహితి

ఉత్తరాంధ్ర వలస జీవితం విషాదం-సాహిత్య సృజన ఆవశ్యకత

కె.చంద్రమోహన్
సెల్: 98662 98354

వలసలు ప్రవాసాలు మానవ నాగరికతలో సర్వసాధారణం. అయితే ఆధునిక యుగంలో ఈ వలసలు కొన్ని ప్రాంతాలకు, ప్రజలకు మాత్రమే పరిమితం అవుతున్న వేళ సాహిత్యకారులు వారి జీవితాలలోని సుఖసంతోషాలకు సృజనాత్మకంగా నిర్మించవలసిన సందర్భం వచ్చింది. నిజానికి భారతదేశంలోకి ఆర్యుల వలసలే ఇప్పటికీ చర్చనీయమైనవిగా వున్నాయి. మధ్య ఆసియాలో బైబిల్ గ్రంథంలో ముఖ్యంగా పాతనిబంధనలో జరిగిన యూదులవలస జీవితం విషాదాంతం. నేటి ప్రపంచ సంక్షోభానికి కారణం అవుతున్న ఇజ్రాయిల్ పాలస్తీనా సమస్య మన ముందు కనిపిస్తుంది. మన దేశం నుంచి వలస వెళ్లిన వారి గురించి అమితవ్ ఘోష్ అరవింద్ ఆదిగా నవలలురాశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ముఖ్యంగా కళింగాంధ్ర ప్రాంతం నుంచి క్రీస్తుపూర్వం తర్వాత బ్రిటీష్‌వారి కాలంలో బర్మా శ్రీలంక ఆఫ్రికా వలసలగురించి పెద్దగా చర్చజరగలేదు. ఇప్పుడు ఆంధ్ర రాష్ట్రంలో ప్రధానసమస్య ఉత్తరాంధ్ర ప్రజల మనసు, జీవితం లక్షలమంది హైదరాబాద్, కలకత్తా, బిలాయి, ఢిల్లీ, మద్రాసు వంటి నగరాలకు వలస వెళ్తున్నారు. ఇక్కడ శ్రీకాకుళం పోరాటం జరిగినప్పుడు దాని ప్రభావంతో ఎంతోమంది రచయితలు వచ్చారు. అవార్డులు రివార్డులు గుర్తింపులు పొందారు గాని శ్రీకాకుళ పోరాటం చల్లారిన తర్వాత ఈ ప్రాంత ప్రజలు జీవితాలపై ఏ రచయిత పెద్దగా స్పందించలేదు. అట్టాడ అప్పలనాయుడు, చింతకింద శ్రీనివాస్‌రావు లాంటివారు నవలలు కథలు రాశారు.

అయితే ఇక్కడ ఈ పరిస్థితులు రావడానికి దారి తీసిన సామాజిక ఆర్థిక అంశాల ప్రస్తావన ఈ రచనలలో రాలేదు. సాహిత్య సృజనకు ఒక సంఘటన, ఒక సందర్భం ఒక ఉత్పాతం జరిగినప్పుడు రచయితలు కథలు, కావ్యాలు కవిత్వాలు రాయటం జరుగుతుంది. గాని ఉత్తరాంధ్ర పరిస్థితి ఒక సంఘటనో, సందర్భమో కాదు. దశాబ్దాలుగా రాజకీయ ఆర్థిక దోపిడీకి గురవుతోంది. తెలంగాణలోని పాలమూరు వలస కార్మికులపై అక్కడ రచయితలు చాలా సాహిత్యం సృష్టించారు. ఉత్తరాంధ్ర అభ్యుదయ, విప్లవ రచయితలు సిద్ధాంతాలు, రాద్ధాంతాలు పేరుతో చాలా రచనలు చేశారు. అవి ఇక్కడ ప్రజల వెతలను పూర్తిగా ప్రతిబింబించలేదనే చెప్పాలి. ఇటీవల మత్స్యకారుల వలసలపై తండేలు సినిమా వచ్చింది. గతంలో వీరయ్య అనే సినిమాల్లో స్మగ్లర్లు, విలన్లు చిక్కోల్ భాష మాట్లాడటం, విశాఖ ఓడరేవు కేంద్రంగా కథలు నడపడం చూశాము. ఎక్కడా స్థానికుల దయనీయ పరిస్థితి, విషాదమైపోతున్న కుటుంబాలు, పిల్లలకు, పెళ్లాలకు దూరంగా జీవించే మగాళ్లు మగతోడు లేని ఆడ కూతుళ్లు, చదువుకున్న ఉద్యోగం లేని కుర్రాళ్ల గురించి ఎవరూ రాయలేదు.

ఈ నేపథ్యంలో ప్రొఫెసర్ కె ఎస్ చలం ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక

నెలకొల్పి సుమారు నాలుగు దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం ఉత్తరాంధ్ర దోపిడీ రాజకీయ నిరాసక్తత పై చాలా రచనలు చేశారు. వాటితో ప్రభావితమైన రాజకీయ నాయకులు, యువకులు ఇప్పుడున్న పరిస్థితుల్లో రాజకీయ స్వార్థ ఉప్పెనలో కొట్టుకుపోయారు. ఉత్తరాంధ్ర మళ్లీ ఒంటరిదైపోయింది. ఈ విషాదాన్ని దిగమింగలేక పరిశోధకుడైన ఆచార్య కేయస్ చలం, ఇక్కడ చలం మాస్టారు అని పిలిచే కూర్మాన సింహాచలం ముందుకు వచ్చారు. ఆయన కొన్ని సమావేశాలలో అంటుంటారు నా పేరు నా ఇంటిపేరు ఉత్తరాంధ్ర గుర్తు అని, సింహాచలం, శ్రీకూర్మం అచ్చు ఉత్తరాంధ్ర ఆనవాళ్లు గదా అని. ఆయనే రెండు ఏళ్ల క్రితం వలస అనే నాటకం రాసి ప్రింట్ చేసి పంచిపెట్టారు. ఉత్తరాంధ్రలో ఉన్న చాలామంది దగ్గర ఆ నాటకం ఉంది. దాన్ని కనీసం వీధి నాటక రూపంలో అయినా వేస్తే బాగుంటుందని ఎంతోమందిని కదిలించారు. చలనం లేదు ఎవరిలో. ఇప్పుడు అట్టాడ అప్పలనాయుడు గారు శోకగర్భ కథ కావడంతో బలమైన సాహిత్య వాతావరణం ఏర్పడింది.

వలస నాటకంలో చలం మాస్టారు చెప్పింది ఏమిటి!

తన ముందుమాటలో ఈ నాటకంలో ఒక వేదన ఉంది. దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం, నిరాదరణ గూర్చి మాట్లాడుతునే ఉన్నాం. పెద్దగా మార్పు వచ్చినట్లు లేదు. రాష్ట్రం వేరయింది. పెద్ద తేడా రాలేదు. అందరికీ అర్థమయ్యేలా నాటకం మిగతా సాంస్కృతిక రూపంలో చెప్పాలి అనే కోరిక ఇది రాసేలా చేసింది అన్నారు. ఇందులో ఆయా సందర్భాని కనుగుణంగా మార్పు చేసుకోవచ్చని అన్నారు. మొత్తం ఇందులో 10 పాత్రలు, వచ్చి పోయే రెండు మూడు పాత్రలు ఉన్నాయి. నాటకం ప్రారంభమే శ్రీకాకుళం జిల్లా వలసకు కేంద్రమైన తిలారు రైల్వేస్టేషన్లో ప్రారంభమవుతుంది. అటు కలకత్తా, ఇటు హైదరాబాద్ వలసలు పెరగడానికి కారణం ఏమిటి! చేతివృత్తులు కోల్పోతున్న దళిత ఆదివాసి ప్రజలు చిరు వ్యాపారాలు కోల్పోయిన కళింగ కోమట్లు, ఉన్న భూమి అన్యాక్రాంతమైనా సన్నకారు రైతు కూలీలు ఇలా ఉత్తరాంధ్ర అందమైన జిల్లాలన్నీ నిర్మానుష్యమైపోతుంటే కోస్తా జిల్లా మోతుబరులు విశాఖ కేంద్రంగా దోపిడీ తీవ్రతరం చేశారు. ఇందులో చాలా పాత్రలు మాస్టర్ గారి శిష్యులు, మిత్రులు ఇప్పటికీ సజీవంగా ఉన్నారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా జమీందారీ విధానంతో నష్టపోయిన చిన్న కులాల వారి గూర్చి ఎవరూ రాయలేదు. కాళీపట్నం రామారావు యజ్ఞం కథ కల్పితం. దళితులకు జిల్లాలో భూములు ఎప్పుడూ లేవు.

అప్పలనాయుడుకు ఎక్కడి నుంచి వచ్చిందొ భూమి. సరే అక్కడ జరిగిన తంతు ఏమిటంటే బ్రాహ్మణులు అంటే కాళీపట్నం రామారావు తండ్రిగారి తరం కరణాలు అప్పుడక్కడ వెట్టి చాకిరీ చేసే అంటరాని వారు చిన్న చిన్న కమతాలు చూసుకునే తూర్పు కాపులు, వెలమలు జమీందారులు ఇచ్చిన సేవక ఇనాంలు ఉన్న చాకలి, మంగలి తాలూకా భూములను రాజకీయనాయకులకు, నాయకలే, కరణాలు బదలాయించడంతో పెద్ద పాత్ర పోషించారు.

చదువులు పెరగలేదు, ఉన్న వూళ్లో వ్యవసాయం లేదు. అందుకే ముసలయ్య భార్య కొడుకు అప్పయ్య, తర్వాత అప్పారావుగా మారతాడు. కలకత్తా బయలుదేరుతాడు. గానీ కలకత్తాలో కూడా బతకలేకపోవడంతో స్థానికంగా ఉన్న కమలితో డాన్స్ నేర్చుకుంటూ హైదరాబాద్ చేరుతాడు.

ఆంధ్ర యూనివర్సిటీలో ఎంఏ చదివి చైతన్యవంతమైన విజయనగరం కుర్రాడు కొంతమందితో కలిసి హైదరాబాద్ చేరుతాడు. హైదరాబాద్‌లో లక్షల మంది నిర్మాణ కార్మికులు మూడు జిల్లాల వారు ఉండే మురికివాడల్లో అక్కడ ప్రజల బాగోగులు చూస్తూ అందరి ఆదరణ చేస్తూ ఉంటాడు. ఇంతలో విజయ నగరం నుంచి కొత్తగా వచ్చిన నిర్మాణ కార్మికులు కొత్తగా పనిలో చేరిన రోజే లిఫ్టు కూలిపోయి నలుగురు మరణిస్తారు. దీంతో జ్ఞానోదయంఅయి హైదరాబాదులో ఉండే చైతన్యవంతమైన యువకులంతా వెంకట్రావు నాయకత్వంలో విశాఖ చేరి అక్కడ విశాఖ విజయ నగరం, శ్రీకాకుళం వివిఎస్ అనే సంస్థను ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహిస్తారు. వారికి అర్థమైంది ఏమిటంటే ఉత్తరాంధ్ర కేంద్రం విశాఖలో సృష్టించిన సంపద భూములు ఉద్యోగాలు అన్నీ స్థానికేతర్లు కోస్తా వారు దోపిడీ చేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా కనీసం తోపుడుబల్ల వ్యాపారంలోనైనా తమ వాటా కావాలని కోరుకుంటారు. విచిత్రంగా ఈ నాటకం రాసిన రెండేళ్లకు విశాఖలో బడ్డీలు తొలగించేశారు. చిన్న అలజడి వచ్చింది గాని ఉద్యమం రాలేదు. దానికి కారణాలు కూడా వెంకట్రావు చెబుతాడు. విశాఖలో ఉండే రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకత్వం కోస్తా వారి చేతుల్లో ఉండబట్టి ఎప్పుడూ స్థానిక సమస్యలపై స్పందించలేదు. అంతర్జాతీయ సమస్యలు, సిద్ధాంత పోరాటాలు, ఆఫ్ఘనిస్తాన్ గాజా అంటారు తప్ప పేదలు, వలస కార్మికుల ఉద్యమాలు జరగలేదు. అందుకే మొట్టమొదట విశాఖ కమిషనర్ను కలిసి స్థానిక రిజర్వేషన్ ప్రకారం తమకు న్యాయం చేయాలనే కార్యక్రమం వెంకట్రావు నాయకత్వంలో చేపడతారు. ఈ సమావేశానికి వలస వెళ్లిన ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలు వివిధ ప్రాంతాల నుంచి ముఖ్యంగా హైదరాబాద్ నుంచి లక్షల మంది విశాఖకు బస్సుల్లో చేరుకుంటారు. విశాఖలో ఉన్నవారే కాదు వలసలు పోయిన ప్రజలందరినీ ఒక తాటిపైకి తెచ్చి ఉత్తరాంధ్ర ఉద్యమం చేయాలని, మా వనరులు మాకే, మా తీరం మాకే, స్థానిక సంస్థల్లో ఉద్యోగాల్లో మాకు వాటా కావాలని నినదిస్తూ ఉండగా నాటకం ముగుస్తుంది.

ఇందులో నాటికీయత కోసం కమలి అప్పారావు, ప్రసాదు, రమ్య వంటి ఉత్తరాంధ్ర సాంస్కృతిక జీవితాన్ని, ఉత్తరాంధ్ర మన భాషను ప్రతిబింబిస్తూ అద్భుతంగా 50 పేజీల నాటకాన్ని చలం రాశారు.

ఈ నాటకం చిన్నదే అయినా ఇందులో కొన్ని దశాబ్దాలుగా ఉత్తరాంధ్రలో జరిగిన రూపాంతరం, ఓ సిద్ధాంత భూమిక ఆధారంగా తయారు చేసిన కథనం ఇది. దీనిపై చాలామంది ఉద్యమ నాయకులు స్పందించారని అనేక సమావేశాల్లో చలం చెప్పారు. ఉత్తరాంధ్రలో జరిగిన ఆర్థిక దోపిడీ రాజకీయ దివాలాతనం కొంతమంది కొన్ని కులాల్లోని కుటుంబాల స్వార్థ రాజకీయం మూలంగా లక్షల కోట్లు విశాఖ సంపద కోస్తా, రాయలసీమ పెత్తందారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. విశాఖపట్నం జిల్లా మొత్తం స్థానికేతర నాయకుల కబంధహస్తాల్లో ఉంది. దీనికి కారణం ఇక్కడ ఉన్న సామాజిక వర్గాలు అందరూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆదివాసీకి చెందిన వారే. 90 శాతం వాళ్లు నుంచి వచ్చిన కొద్దిమంది రాజకీయ నాయకులు కోస్తా వారికి తాబేదారులుగా మారారు తప్ప స్థానిక ప్రజల అవసరాలు చూడలేదు. కుటుంబాలు బాగుపడ్డాయి తప్ప కులాలు కాదు. అందుకే స్థానిక యువకులు చైతన్యవంతమైన మేధావి వర్గం రచయితలు వలసలు వెళ్లిన వారితో ఒక నెట్వర్క్ ఏర్పాటు చేసుకొని ఉద్యమం చేయవలసిన ఆవశ్యకత, దాని ద్వారా కొంతైనా స్థానికత, స్థానిక సాంస్కృతి గుర్తింపు మిగులుతుంది అనే ఉద్దేశంతో రాసిన చలం వలస నాటకం బహుశా ఈ ప్రాంతంలో మళ్లీ ఒక సంచలనం సృష్టిస్తుందని ఆశిస్తున్నాము. కనీసం ఈ నాటిక ప్రాముఖ్యతను, అందులోని ఇతివృత్తాన్ని, అది అందించే సందేశాన్ని పత్రికలైనా గుర్తించాలని ఈ సమీక్ష.

వనితలకు స్ఫూర్తినిచ్చే

'తొలితరం తెలుగు రచయిత్రులు - అభ్యుదయ కథలు'

చలపాక ప్రకాష్, 9247475975

గ్రంథ సమీక్ష

20వ శతాబ్దపు మొదటి దశకంలోనే తమ తోటి స్త్రీలను చైతన్యపరచడానికి కవయిత్రులు, రచయిత్రులు సాహిత్య సృజన చేశారు. ఈ క్రమంలో స్త్రీలు స్వాతంత్ర్యం సాధించే కంటే ముందు తమ వ్యక్తిగత స్వాతంత్ర్యం ముఖ్యమని భావించారు. కుటుంబం, సమాజం, దేశం, పరపాలన విముక్తి వంటి విషయాలపై విస్తృతంగా రచనలు చేశారు. కానీ వందలకొద్దీ కవయిత్రులు, రచయిత్రులు చరిత్ర మరుగున పడిపోయింది. కేవలం వేళ్ల మీద లెక్కించే సంఖ్యలో మాత్రమే మనకు లభ్యమయ్యాయి. ఆ క్రమంలో రచయిత్రి, పరిశోధకురాలు సి. హెచ్ సుశీలమ్మ అటువంటి వారి గురించి ప్రపంచానికి తెలియచేయాలనే ప్రయత్నంలో తన అన్వేషణ సాగించారు. ముఖ్యంగా కథా రచయిత్రుల గురించి అన్వేషిస్తున్నప్పుడు అనేకమంది పేర్లు కనిపించినా, చాలావరకు వారి రచనలు లభ్యం అయ్యే పరిస్థితి కలగలేదు. అయినా పట్టుదలతో అనేక గ్రంథాలయాలు సందర్శించి తనకు దొరికినంత మేరకు రచయిత్రుల సమాచారం సేకరించి ఈ గ్రంథ రూపంలో వెలుగులోకి తెచ్చారు. స్వాతంత్ర్య కాలంలో అనేకమంది కవయిత్రులు తమ కలాలతో పోరాటం సల్పినా ముఖ్యంగా రచయిత్రుల రచనల్లో ఆనాటి వారి ఆలోచనా పటిమ, వ్యక్తిగత స్వాతంత్ర్యం కొరకు వారి ఆరాటం, మూఢవిశ్వాసాల ఊబిలో కూరుకుపోతున్న సమాజం పట్ల ఆవేదన చేస్తే ఆశ్చర్యం కలిగి అటువంటి రచయిత్రులను, వారి రచనలు విశ్లేషించి ఈనాటి తరంకి, రేపటి తరానికి అందించి భద్రపరచాలని సుశీలమ్మ నడుం కట్టి ఈ గ్రంథం వెలువరచడం ఎంతైనా అభినందనీయం. భారతదేశం స్వాతంత్ర్యం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 'అమృతోత్సవాలు' జరుపుకుంటున్న సమయంలో తెలుగుభాషలో స్త్రీల సృజనాత్మకతను, రచనా పటిమను గుర్తించవలసిన అవసరం ఎంతైనా అవసరం.

ఆ ప్రయత్నంలో భాగంగా 'తొలితరం తెలుగు రచయిత్రులు-అభ్యుదయ కథలు (1900-1955)' పేరుతో కనుపర్తి వరలక్ష్మమ్మ రచన 'కుటీరలక్ష్మి'తో మొదలుకొని, కొమ్మూరి ఉషారాణి రచన 'అభ్యుదయము' వరకు దాదాపు 25మందిని పరిచయాలు, కథల విశ్లేషణ వ్యాసాలలో పరిచయం చేశారు. చాలా గ్రంథాల్లో రచయిత్రుల పరిచయం మాత్రమేనో లేక వారి రచనలు మాత్రమేనో పరిచయం చేస్తూ ఉంటారు. కాని ఈ గ్రంథంలో రచయిత్రి సంక్షిప్త పరిచయంతో పాటు, ఆ రచయిత్రి రాసిన కథను పరిచయం చేస్తూ అందులోని సారాంశాన్ని



విశ్లేషణ చేస్తూ సాగడం ఈ గ్రంథం విశేష లక్షణం. ఆనాటి ఈ రచనల్లో కొన్ని గ్రాంధికంలో సాగినా సుశీలమ్మ చేసిన పరిచయంలో ఎంతో సరళంగా అందరికీ అర్థమయ్యే భాషలో సాగడం చదువరులని వెంటనే పఠించే విధంగా చేస్తుంది. ఇందులో కనుపర్తి వరలక్ష్మమ్మ, దుర్గాబాయమ్మ, ఆచంట శారదాదేవి, వేదుల మీనాక్షిదేవి, కొమ్మూరి ఉషారాణిలాంటి అతి తక్కువమంది మత్రమే మనకు పరిచయం కలిగినవారు ఉండగా, బి.ప్రేమలీల, నందగిరి ఇందిరాదేవి, స్థానపతి రుక్మిణమ్మ. ఆ. భాస్కరమ్మ వంటి లోకానికి అంతగా పరిచయం కలగని వారిని, వారి రచననీ ఈ గ్రంథం పరిచయం చేసి వెలుగులోకి తీసుకువచ్చినట్లైంది.

ఉదాహరణకు- కనుపర్తి వరలక్ష్మమ్మ 'కుటీరలక్ష్మి' రచనను పరిశీలిద్దాం. ఇందులో రామలక్ష్మి వస్త్ర వ్యాపారి అయిన వెంకటస్వామి భార్య. వెంకటస్వామి తన తండ్రి మరణానంతరం వ్యాపారాన్ని అభివృద్ధి పర్చాలని తలిచి బొంబాయి నుంచి తానే స్వయంగా రంగులను, బట్టలను తెప్పించి చెక్కలతో, తీగలతో డిజైన్లు వేయించి తెలుగు ప్రాంతాలకే కాకుండా ఇతర ప్రాంతాలకు కూడా ఎగుమతి చేసేవాడు. ఆ రకంగా ఒకొక్క మెట్టు ఎక్కుతూ పది సంవత్సరాలలో ఎంతో అభివృద్ధి దిశలో సాగి.. తమకు వచ్చిన సంపదతో దానధర్మాలు చేస్తూ, అవసరం ఉన్న స్త్రీలకు సహాయం చేస్తూ భర్తతోపాటు రామలక్ష్మి 'ధార్మికురాలు' అని పేరు తెచ్చు కుంది. అంతలో ఐరోపాలో ఆర్థికసంక్షోభంకారణంగా వస్తువుల ధరలు పెరిగిపోయి, ఆ ప్రభావంతో తమ వ్యాపారానికి లాభం రాకపోయినా నష్టంరాకుంటే చాలని, వ్యాపారాన్ని ఆపకూడదని అనుకుంటారు. కాని దురదృష్టవశాత్తు ఇదే సమయంలో హఠాత్తుగా ఆద్దకపు పాకలకు నిప్పంటుకొని మొత్తంకాలి బూడిదవడంతో ఆ బాధతో కుప్పకూలి కన్నుమూస్తాడు భర్త వెంకటస్వామి.

ఆ రకంగా నిరాశ్రయురాలయిన రామలక్ష్మి, తన ఇద్దరి పిల్లలను పోషించుకోవడం కోసం ఇరుగు పొరుగు ఇళ్లల్లో పిండి రుబ్బడం వంటి తనకు చేతనైన పనులు చేస్తూ తన కాళ్లపై తాను నిలబడుతుంది. అదే సమయంలో దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య సమరం, సహాయ నిరాకరణ ఉద్యమం ఊపందుకుంటున్న సందర్భంలో 'ఖద్దరు పరిశ్రమలవారు రాట్నం, ప్రత్తి ఇంటికే తెచ్చి ఇచ్చి, వడికిన నూలుకు 'వీ'సెకు రూపాయి పావలా' కూలి ఇస్తామని.. ఆసు కూడా పోసి ఇస్తే మరొక పావలా ఇస్తున్నారని తెలిసి, అది గౌరవప్రదమైన పని అని తలచి రామలక్ష్మి తను కూడా చేసి.. ఆ పనిలో నిమగ్నమై అతి త్వరలోనే సన్నటి నూలు తీయటంలో నైపుణ్యం సంపాదించుకుంటుంది. చివరికి 'అహ్మదాబాద్‌లో దేశీయ మహాసభ సందర్భంగా జరగబోతున్న ఖద్దరు ప్రదర్శనలో మీ నూలు ప్రదర్శించెదము' అని ఆమె నైపుణ్యం ప్రతిభకు మెచ్చడం చూస్తే... ఆ రకంగా భర్తను, ఆస్తిని కోల్పోయిన ఓ స్త్రీ ఎలాంటి అఘాయిత్యాలకు తలొగ్గకుండా .. తన బిడ్డలకోసం, తన ఆత్మాభిమానానికి భంగం కలగకుండా గౌరవప్రదంగా నిలవడం అన్నది కనుపర్తి వరలక్ష్మమ్మ గారి కథలో ఆనాటి కాలంలో ..కాలానికి తగ్గట్టుగానే స్త్రీ ఉన్నతిని అద్భుతంగా మలచడం అన్నది ఈ కథలో కనిపిస్తుంది. ఈ కథంతా ఆనాడు పూర్తి గ్రాంథికంలో నడిచినా తిరిగి ఈనాటి కాలానికి అర్థమయ్యేరీతిలో రచించారు సుశీలమ్మ. అలాగే ఇందులో ఉన్న మిగతా 24కథలుకూడా.. ఆయా రచయిత్రులను పరిచయం చెయ్యడంలో సుశీలమ్మ చేసిన కష్టతరమైన కృషి కనిపిస్తుంది. చరిత్రారచనలో భాగంగా ముఖ్యంగా 'రచయిత్రుల' గురించి.. దానికి తోడుగా వారి 'కథల' గురించి కలగలిపి తెలుసుకోతగ్గ ఈ పుస్తకం చదవడం ఏమాత్రం పాఠకుడికి వృథా కాదుకదా... ముఖ్యంగా వనితలకు స్ఫూర్తినిచ్చేదిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

'తొలితరం తెలుగు రచయిత్రులు- అభ్యుదయ కథలు
(1900-1955)
రచన: ప్రొఫెసర్ సి.హెచ్.సుశీలమ్మ,
పుటలు:112, వెల: రూ.200/-
ప్రతులకు: విశాలాంధ్ర , నవచేతన అన్ని బ్రాంచీలు

హాస్యపు హరివిల్లు

డాక్టర్ కె. నటరాజు నాయుడు, 9441919014

సుప్రసిద్ధ కథా రచయిత ఆర్సీ కృష్ణస్వామి రాజు కలం నుంచి వెలువడిన కథల సంపుటి 'గరం గరం చాయ్'. ఒక కథ తర్వాత మరో కథను నిరాటంకముగా చదవాలనే ఆసక్తి పాఠకుల మదిలో మెదిలే విధంగా కథల రచన సాగింది. రచయిత తన కథలలో హాస్యానికి అగ్ర తాంబూలం ఇస్తూనే మానవతా విలువలకు, నైతికతకు, సామాజిక స్పృహకు కూడా తగిన స్థానాన్ని కల్పించాడు.

రంగు, రుచి, చిక్కదనం లాంటి మూడు గుణాలు మాత్రం కలిగిన త్రీ రోజెస్ టీ పొడి కంటే ఆర్సీ కృష్ణస్వామి రాజు మనసుపెట్టి తయారు చేసిన వేడి వేడి తేనీరు 'గరం గరం చాయ్' లో ఎన్నో సుగుణాలు దాగి ఉన్నాయి. తాను తయారుచేసిన తేనీరును 50 కప్పులలో కథలలో పోసి పాఠకలోకం ముందు ఉంచాడు రచయిత. ప్రతి కప్పులోని తేనీరూ ప్రతి కథా వైవిధ్య భరితమైన సందేశాలను సమాజానికి అందించింది. "సామాజిక పరివర్తన కోసమే సాహిత్యం" అని రాజు తన రచనల ద్వారా నిరంతరం సమాజానికి చాటి చెబుతాడు.

వానలో గంటల కొద్దీ నిలబడి వర్షపు నీరు పోవడానికి తెరచి ఉంచిన "మ్యాన్‌హోల్" లో ఎవరూ పడిపోకుండా, ప్రమాదం జరగకుండా ట్రాఫిక్ పోలీసు లాంటి పాత్రను పోషించిన ఒక పేద మహిళకు ఉన్న సామాజిక స్పృహను, సామాజిక బాధ్యతను రచయిత ఎంతో హృద్యంగా చిత్రీకరించాడు.

రైతులకు పొలమేప్రాణం. నేలే దేవాలయం. ఇందులో "భూమి భక్తి" ని చాటుకున్న రైతు కథను చక్కగా రక్తి కట్టించారు రాజుగారు. చదువులు పూర్తిచేసి మీరు ఎలాంటి ఉద్యోగాలు చేస్తారు అని నలుగురు విద్యార్థులను ప్రిన్సిపల్ మేడం ప్రశ్నిస్తుంది. అందులో ఒక అమ్మాయి పెళ్లి బట్టలు కుడతాను అని చెప్తుంది. ఆ అమ్మాయికి పేద ఇంటి పెళ్లికూతురుల పట్ల ఉండే జాలి, దయ, కరుణ, తక్కువ ధరలకే అందమైన ఆధునిక దుస్తులు వారికి అందించాలనే సేవాగుణమును రచయిత అద్భుతంగా ఆవిష్కరించాడు. మాతృదేశాన్ని, మాతృమూర్తిని, మాతృభాషను మరువ వద్దు అంటారు. డబ్బు కన్నా హోదా కన్నా తల్లిప్రేమే మిన్న అన్న విషయాన్ని "అమ్మ అమ్మే" అనే కథలో ఒక మహిళా కలెక్టర్ పాత్ర ద్వారా ప్రపంచానికి తెలియజేస్తాడు రచయిత.

జాగరూకత వహించకపోతే చాలా తెలుగు పదాలు చరిత్రలో లేకుండా పోతాయేమోనని ఆవేదన వ్యక్తం చేస్తూ మాతృభాషపై తనకున్న మమకారాన్ని చాటుకున్నాడు రచయిత తాను రాసిన "స్విస్ బ్యాంకు డబ్బు" కథ ద్వారా. బ్రదర్ ని 'బ్రో' అని, సిస్టర్ ని 'సిస్' అని పిలవడం ఈ కాలంలో పిల్లలకు ఫ్యాషన్ అయిపోయిందని, అంతా కలికాలం మహిమ అని రచయిత ఆందోళన చెందుతాడు. మాతృభాషలకు మంచి రోజులు రావాలి, కుటుంబ పెద్దలు వారి పిల్లలకు పదాలను కట్ చేయకుండా పదాన్ని పూర్తిగా పలకడం నేర్పాలనేది రచయిత అభి భావన.

"గరంగరం చాయ్" కథ సంపుటిలో ప్రతి కథకు రచయిత న్యాయం చేకూర్చాడు. ప్రతి కథ ఏదో ఒక మంచి సందేశం పాఠకలోకానికి, సమాజానికి అందే విధంగా రచయిత కృషి చేశాడు. ఇంత మంచి కథలను రాసిన రాజుగారికి అభినందనలు.

పుస్తకం ధర: 100/-, పేజీలు: 168, ప్రతులకు: 9393662821

స్లీపర్ బస్సులో మంటలు..

ప్రయాణికులు క్షేమం

లక్నో: ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రైవేటు బస్సులో మంటలు చెలరేగాయి. ఢిల్లీ నుంచి లక్నో మీదుగా గోండా ప్రాంతానికి వెళ్తున్న ఏసీ స్లీపర్ బస్సులో రెవ్రి టోల్ ప్లాజా సమీపంలో ఆదివారం మంటలు ఎగిసిపడ్డాయి. తెల్లవారుజామున టోల్ ప్లాజాకు 500 మీటర్ల ముందు బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ వారందరినీ కిందకు దించేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని..మంటలు ఆర్పివేశారు. బస్సులో ఉన్న దాదాపు 39 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. మొదట బస్సు చక్రంలో ప్రారంభమైన మంటలు వాహనంలోని మిగిలిన భాగాలకు వ్యాపించినట్లు డ్రైవర్ జగత్ సింగ్ తెలిపాడు. విషయం తెలుసుకున్న ప్రైవేటు బస్సు యాజమాన్యం ప్రయాణికులకు మరోబస్సును ఏర్పాటు చేసింది. బస్సుకు మంటలు అంటుకోవడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

జార్ఖండ్‌లో వైద్యుల నిర్లక్ష్యం

ఐదుగురు పిల్లలకు హెచ్ఐవీ పాజిటివ్ రక్తం

రాంచీ: జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లా, చాయిబాసాలో సంచలన ఘటన వెలుగులోకి వచ్చింది. చాయిబాసాలోని సదర్ ఆసుపత్రిలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న ఐదుగురు చిన్నారులకు హెచ్ఐవీ పాజిటివ్ రక్తాన్ని ఎక్కించినట్లు తేలింది. దీనిపై జార్ఖండ్ హైకోర్టు సుమోటోగా స్వీకరించి, విచారణకు ఆదేశించడంతో రాంచీ నుంచి ఆరోగ్య శాఖ బృందం విచారణ కోసం చాయిబాసా చేరుకుంది. తొలుత సదర్ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్, పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ని తనిఖీ చేసింది. జార్ఖండ్ ఆరోగ్య సేవల డైరెక్టర్ డాక్టర్ దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల దర్యాప్తు కమిటీ ఈ కేసును విచారిస్తోంది. బాధితులందరి వయసు 15 ఏళ్ల లోపే ఉన్నట్లు తెలుస్తోంది. గత వారం రోజుల్లో 56 మంది తలసేమియా బాధితులకు పరీక్షలు చేయగా.. వారిలో ఐదుగురు పిల్లలకు హెచ్ఐవీ పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారణ కావడం విస్తుగొలుపుతోంది. ప్రాథమిక విచారణలో అనేక తీవ్రమైన నిర్లక్ష్యాలు, బ్లడ్ బ్యాంకులో కూడా లోపాలు, అవకతవకలు బయటపడ్డాయి. దర్యాప్తు పూర్తయిన తర్వాత సమగ్ర నివేదికను రాష్ట్ర ఆరోగ్య విభాగానికి కమిటీ సమర్పిస్తుంది. చాయిబాసాకు చెందిన ఏడేళ్ల తలసేమియా బాధితుడి తండ్రి పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లా డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తమ బిడ్డకు సదర్ ఆసుపత్రిలో హెచ్ఐవీ పాజిటివ్ రక్తం ఎక్కించారని ఆయన ఆరోపించారు. తల్లిదండ్రులు ఇద్దరూ తమకు పరీక్షలు చేయించుకోగా, వారికి నెగెటివ్ వచ్చింది. కానీ తలసేమియా బాధితుడైన తమ బిడ్డకు మాత్రం పాజిటివ్ వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బైక్ స్టంట్‌లో బీటెక్ విద్యార్థి మృతి

సిమ్లా: బైక్ స్టంట్ ఉసురుతీసింది. అది రోడ్డుపై జారిపోవడంతో నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. స్టంట్ చేసిన బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మరణించాడు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో ఈ ఘటన జరిగింది. నాగ్‌చాలాకు చెందిన అనికేత్ (22) అనే బీటెక్ విద్యార్థి... ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌తో చాలా ప్రాముఖ్యత సంపాదించాడు. ఈ నేపథ్యంలో అతడు శనివారం అర్ధరాత్రి సమయంలో రీల్ కోసం ప్రయత్నించాడు. కిర్తాపూర్-మనాలీ రహదారిలోని మలోరి టన్నెల్ సమీపంలో బైక్‌పై స్టంట్ చేశాడు. అదికాస్త బెడిసికొట్టింది. బైక్‌పై నియంత్రణ కోల్పోయాడు. టన్నెల్ మలుపు వద్ద రోడ్డుపై బైక్ జారడంతో నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అనికేత్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా... స్టంట్‌కు ప్రయత్నించమని అనికేత్‌ను ప్రేరేపించిన వీడియోగ్రాఫర్‌ను ఈ కేసులో నిందితుడిగా పోలీసులు పేర్కొన్నారు. మొబైల్ ఫోన్‌లు, కెమెరా ఫుటేజ్‌లను స్వాధీనం చేసుకున్నారు.

నేడు కరూర్ బాధితులను కలవనున్న టీవీకే అధినేత

చెన్నై : ప్రముఖ నటుడు, తమిళిగ వెట్రి కళగం పార్టీ అధ్యక్షుడు సోమవారం కరూర్ తొక్కిసలాట బాధితులను కలవనున్నారు. మల్లప్పురంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో బాధిత కుటుంబాలతో సమావేశం కానున్నారు. ఉదయం 7.30 గంటలకే సమావేశం ప్రారంభం కానుందని పార్టీ వర్గాలు తెలిపాయి. కరూర్‌తో పాటు ఇతర జిల్లాల్లో ఉన్న బాధిత కుటుంబాలను ప్రత్యేక బస్సుల్లో హోటల్‌కు తీసుకురానున్నట్లు టీవీకే పార్టీ వెల్లడించింది. సమావేశంలో విజయ్ ఒక్కో కుటుంబంతో విడివిడిగా మాట్లాడతారని తెలిపింది. అయితే ఈ ప్రైవేట్ సమావేశానికి మీడియాకు అనుమతి లేదని పేర్కొంది. దీనిపై పోలీసులను ఆరా తీయగా అది ఇండోర్ ప్రోగ్రామ్ అని చెప్పారు. ముందుగా విజయ్ ఒక్కో బాధిత కుటుంబం దగ్గరికి వెళ్లేలా ప్లాన్ చేసినా ప్రయాణం సమస్యగా మారుతుందనే ఉద్దేశంతో అందరినీ ఒకేచోటుకు పిలిచి మాట్లాడాలని నిర్ణయించారు. కాగా ఈ దీపావళి పండుగకు ముందే విజయ్ ఒక్కో బాధిత కుటుంబానికి రూ.20 లక్షల చొప్పున పరిహారం చెల్లించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొత్త పార్టీని స్థాపించి ప్రచారం మొదలుపెట్టిన విజయ్ తొలి ర్యాలీలో తొక్కిసలాట జరిగింది. మొత్తం 41 మంది తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయారు.

42 స్థానాలపై ఆర్జేడీ కన్ను

- ఈబీసీ నేతకు డిప్యూటీ సీఎం ఆఫర్
- ఎన్డీఏకి సవాలేనంటున్న రాజకీయ విశ్లేషకులు

పట్నా: దేశం చూపు బీహార్ వైపు ఉంది. రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలను ఎన్డీఏ-మహాఘట్బంధన్ కూటములు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పోటీ రసవత్తరంగా మారింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో మొదటి దశ పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో రెండు కూటములు అత్యంత వెనుకబడిన తరగతుల (ఈబీసీ) ఓట్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాయి. ఎన్నికల్లో ఈ వర్గాల ఓటర్లే నిర్ణయాత్మకం కానున్నట్లు భావిస్తున్నాయి. ఈ క్రమంలో మహాఘట్బంధన్‌కు నేతృత్వం వహిస్తున్న ఆర్జేడీ పశ్చిమ చంపారన్ నుంచి ముజఫర్‌పూర్, దర్భంగా వరకు విస్తరించి ఉన్న 42 సీట్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ స్థానాల్లో సుదీర్ఘకాలంగా ఎన్డీఏ పాతుకుపోయిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ కోటను బద్దలు కొట్టడానికి మహాఘట్బంధన్ సమాయత్తమైంది. ఈ క్రమంలోనే మహాఘట్బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్, తాము అధికారంలోకి వస్తే ముకేశ్ సాహ్నీ (వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ వ్యవస్థాపకుడు) డిప్యూటీ సీఎం అవుతారని ప్రకటించారు. వాస్తవానికి ఈ ప్రకటనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌లకు సాంప్రదాయకంగా విధేయులుగా ఉన్న అత్యంత వెనుకబడిన తరగతుల ఓటర్లను ఆకర్షించే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. మల్లా, కేవత్, బింద్, కశ్యప్ వంటి ఉప కులాలను కలిగి ఉన్న నిషాద్ కమ్యూనిటీ బీహార్ జనాభాలో దాదాపు 5.5 శాతం ఉన్నారు. ముకేశ్ సాహ్నీ చాలా కాలంగా ఈ వర్గానికి షెడ్యూల్డ్ కుల హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ అలా చేస్తే రాష్ట్రంలో ఉన్న దళిత వర్గాలు ఆగ్రహం చెందే అవకాశం ఉంది. రిజర్వేషన్ల విభజనను వారు వ్యతిరేకించవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తెలివిగా తేజస్వి దానికి సంబంధించిన ఎలాంటి వాగ్దానం చేయకుండా ఉన్నారని చెబుతున్నారు. అయితే సాహ్నీకి డిప్యూటీ సీఎం పదవిని ప్రకటించడం ఎన్డీఏకి తీవ్రమైన సవాలుగా మారవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉత్తర, వాయువ్య బీహార్‌లోని మత్స్యకార ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉన్న సుమారు 30 వరకు అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తారని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వాస్తవానికి ఉప ముఖ్యమంత్రిగా ముకేశ్‌సాహ్నీ పేరును ప్రకటించడం ద్వారా రాష్ట్రంలో లాలూ యాదవ్ కుటుంబం ఇతర వర్గాలతో అధికారాన్ని పంచుకోవడానికి సిద్ధంగా ఉందనే సంకేతాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తుందనే సంకేతాన్ని సూచిస్తోంది. అయితే ముకేశ్ సాహ్నీకి ఈ ఎన్నికల్లో పోటీ తీవ్రంగా ఉందని అనేక నివేదికలు పేర్కొన్నాయి. సహర్సాలోని సిమ్రి భక్తియార్‌పూర్ నుంచి 2020లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఆయన ఓడిపోయిన నేపథ్యంలో దాని ప్రభావం ఈ ఎన్నికల్లో కూడా కనిపించే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు. ముజఫర్‌పూర్‌లోని జాలర్ల సంఘం, తూర్పు చంపారన్, పశ్చిమ చంపారన్, వైశాలి, దర్భాంగా, ఖగారియా వంటి జిల్లాలను బీజేపీ కంచు కోటగా భావిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో చంపారన్‌లోని 21 సీట్లలో బిజెపి 15 సీట్లను గెలుచుకుంది, అలాగే ఎన్డీఏ కూటమి ముజఫర్‌పూర్‌లోని 11 సీట్లలో తొమ్మిది, దర్భంగాలోని 10 సీట్లలో తొమ్మిది స్థానాల్లో విజయం సాధించింది. రాష్ట్రంలో బీజేపీకి పెరుగుతున్న సవాలును గ్రహించిన నాయకత్వం ఇటీవల మల్లా నాయకుడు, ముజఫర్‌పూర్ మాజీ ఎంపీ అజయ్ నిషాద్‌ను తిరిగి పార్టీలోకి తీసుకున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన భార్యకు ఔరాయ్ స్థానం నుంచి పోటీ పడుతున్నారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో మహాఘట్బంధన్ పట్టు చిక్కించుకోడానికి గట్టి ప్రయత్నాలు చేస్తోంది.

వైద్యురాలి బలవన్మరణం...సంస్థాగత హత్య

బీజేపీపై రాహుల్ ధ్వజం

న్యూఢిల్లీ : మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఒక మహిళా ప్రభుత్వ వైద్యురాలి ఆత్మహత్యను కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం 'సంస్థాగతీకరించిన హత్య' గా అభివర్ణించారు. ఆమె మరణం బీజేపీ నేతృత్వంలోని అమానవీయ స్వభావాన్ని బహిర్గతం చేస్తోందని విమర్శించారు. మహారాష్ట్రలోని మరాఠ్వాడ ప్రాంతంలోని బీడ్ జిల్లాకు చెందిన ఈ వైద్యురాలు, సతారా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్నారు. గురువారం రాత్రి ఫల్టాన్ పట్టణంలోని ఒక హోటల్ గదిలో ఉరివేసుకుని కనిపించింది. ఆమె తన అరచేతిలో రాసిన సూసైడ్ నోట్‌లో పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ బదానే తనపై అనేకసార్లు అత్యాచారం చేశాడని, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రశాంత్ బంకర్ తనను మానసికంగా వేధించాడని ఆరోపించింది. 'ఎక్స్' లో హిందీలో పోస్ట్ చేసిన రాహుల్ గాంధీ... అత్యాచారం, వేధింపులను ఎదుర్కొన్న తర్వాత సతారాలో వైద్యురాలు ఆత్మహత్య చేసుకోవడం ఏ నాగరిక సమాజానికైనా మనస్సాక్షిని కదిలించే విషాదమని పేర్కొన్నారు. ఇతరుల బాధలను తగ్గించాలని ఆకాంక్షించిన ఒక వైద్యురాలు అవినీతి వ్యవస్థలోని నేరస్థుల హింసకు బలైపోయారన్నారు. 'నేరస్థుల నుంచి ప్రజలను రక్షించే బాధ్యత అప్పగించబడిన వారు ఈ అమాయక మహిళపై అత్యంత దారుణమైన అత్యాచారం, దోపిడీకి పాల్పడ్డారు. బీజేపీతో సంబంధం ఉన్న కొంతమంది ప్రభావవంతమైన వ్యక్తులు ఆమెను అవినీతిలోకి నెట్టడానికి కూడా ప్రయత్నించారు' అని రాహుల్ అన్నారు. 'ఇది అధికారంతో రక్షించబడిన నేర భావజాలానికి అత్యంత నీచమైన ఉదాహరణ. ఇది ఆత్మహత్య కాదు. ఇది సంస్థాగత హత్య' అని రాహుల్ ధ్వజమెత్తారు. అధికారం నేరస్థులను కాపాడితే... న్యాయం ఎవరికి దక్కుతుందని ప్రశ్నించారు. న్యాయం కోసం జరిగే ఈ పోరాటంలో బాధితురాలి కుటుంబానికి మేము అండగా నిలుస్తామని తెలిపారు.

ఎస్ఐ గోపాల్ బదానే అరెస్టు

వైద్యురాలి ఆత్మహత్య కేసులో పోలీసులు సబ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ బదానేను అరెస్టు చేశారు. శనివారం సాయంత్రం సతారాలోని ఫల్టాన్ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో బదానే లొంగిపోయాడని, ఆ తర్వాత అతన్ని అరెస్టు చేసినట్లు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుషార్ దోషి తెలిపారు. కాగా, శనివారం ఉదయం ఫల్టాన్ పోలీసుల బృందం పూణేలో మరో నిందితుడైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బంకర్‌ను అరెస్ట్ చేసింది.

బాధితురాలికి న్యాయం చేస్తాం: సీఎం ఫడ్నవీస్

ఈ కేసులో బాధితురాలికి న్యాయం జరిగేంత వరకు తాను విశ్రమించబోనని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు. సతారాలోని ఫాల్టాన్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి తనను రాకుండా చేసేందుకు ప్రయత్నాలు జరిగాయన్నారు. మాజీ ఎంపీ రంజిత్ సిన్హ్ నాయక్ నింబాల్కర్, ఎమ్మెల్యే సచిన్ పాటిల్ పేర్లు ఈ కేసుతో ముడిపడి ఉన్నాయన్న ఆయన... వైద్యురాలి మృతి కేసును రాజకీయం చేసే ప్రయత్నాలను సహించబోనన్నారు. బాధితురాలిని తన సోదరిగా పేర్కొంటూ... ఆమె ఆత్మహత్య విషాదకరం, దురదృష్టకరమన్నారు. ఆమెకు న్యాయం జరిగేలా చూడటంలో రాజీపడేది లేదని పునరుద్ఘాటించారు. బాధితురాలు తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్న ఇద్దరు వ్యక్తులనూ అరెస్టు చేసినట్లు చెప్పారు. కాగా, తనను వేధింపులకు గురిచేస్తున్నట్లు వైద్యురాలు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోలేదని ఆమె తరఫు బంధువు ఒకరు తెలిపారు.

బాధితురాలు పనిచేస్తున్న సబ్ డిస్ట్రిక్ట్ ఆస్పత్రిలో మెడికల్ రిపోర్టులను మార్చాలంటూ ఒత్తిడి చేశారని మరో బంధువు ఆరోపించారు. మరోవైపు బీజేపీ మాజీ ఎంపీ రంజిత్‌సింగ్ నాయక్ నింబాల్కర్ గతంలో ఆమెపై ఒత్తిడి తీసుకొచ్చారని శివసేన యూబీటీ నేత అంబాదాస్ దాన్వే ఆరోపించారు. అయితే దీనిపై స్పందించిన నింబాల్కర్... తనపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. కావాలనే ఈ కేసులోకి తన పేరును లాగుతున్నారన్నారు.

వాయు కాలుష్యంతో ప్రజలకు ముప్పు

కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్

న్యూఢిల్లీ : వాయు కాలుష్య సంక్షోభం ఇకపై శ్వాసకోశ సమస్య మాత్రమే కాదని, మన మెదడు, శరీరాలపై పూర్తిస్థాయి దాడి అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్) జైరాం రమేశ్ అన్నారు. 'మన ప్రస్తుత పీఎం 2.5 ప్రమాణం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) వార్షిక బహిర్గత మార్గదర్శకం కంటే ఎనిమిది రెట్లు ఎక్కువ. 24 గంటల బహిర్గతం నాలుగు రెట్లు ఎక్కువ' అని ఆయన పేర్కొన్నారు. '2017లో ప్రారంభించబడిన జాతీయ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ) ఉన్నప్పటికీ, పీఎం 2.5 స్థాయిలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రతి ఒక్క భారతీయుడు ఇప్పుడు డబ్ల్యూహెచ్ఓ పరిమితులను మించిన ప్రాంతాల్లో నివసిస్తున్నారు' అని 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'వాయు కాలుష్యం ప్రజారోగ్య విపత్తు, జాతీయ భద్రతా ముప్పుగా మారింది. భారతదేశ సమాజం, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ, భవిష్యత్ శ్రామిక శక్తిని ప్రమాదంలో పడేస్తుంది' అని వివరించారు. స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ 2025 నివేదికను ఉటంకిస్తూ, 2023లో భారతదేశంలో దాదాపు 20 లక్షల మరణాలు వాయు కాలుష్యంతో ముడిపడి ఉన్నాయని జైరాం రమేశ్ తెలిపారు. ఇది 2000 సంవత్సరం నుంచి 43 శాతం పెరుగుదల. ఈ మరణాలలో దాదాపు 90 శాతం గుండె జబ్బులు, ఊపిరితిత్తుల క్యాన్సర్, మధుమేహం, చిత్త వైకల్యం వంటి అంటు వ్యాధి కాని వ్యాధుల వల్ల సంభవించాయని ఆయన అన్నారు. భారతదేశంలో ప్రతి లక్ష మందికి 186 వాయు కాలుష్య సంబంధిత మరణాలు నమోదవుతున్నాయని, ఇది అధిక ఆదాయ దేశాలలో రేటు కంటే పది రెట్లు ఎక్కువ అని ఆయన అన్నారు. సూక్ష్మ కణ పదార్థానికి (పీఎం 2.5) ఎక్కువ కాలం గురికావడం ఇప్పుడు మెదడు దెబ్బతినడం, అభిజ్ఞా క్షీణతకు కారణమవుతుందని, 2023 లో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 6,26,000 చిత్తవైకల్య మరణాలు వాయు కాలుష్యంతో ముడిపడి ఉన్నాయని జైరాం రమేశ్ హెచ్చరించారు. ఇదిలాఉండగా, ఢిల్లీలో గాలి నాణ్యత 15.8 డిగ్రీల సెల్సియస్‌కు 'చాలా పేలవమైన' వర్గంలోకి పడిపోయింది. ఇది గత రెండేళ్లలో అక్టోబరులో నమోదయిన అత్యల్పం. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ విభాగం, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) బుధవారం రాజధాని నగరంలో తీవ్ర వాయు కాలుష్యానికి బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వమే బాధ్యత వహించాలని విమర్శించాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ దేశ రాజధానిలో ప్రజలకు పండుగల గురించి 'ప్రబోధాలు అవసరం లేదు. జవాబుదారీతనం అవసరం' అని అన్నారు.

ఔరంగాబాద్ రైల్వేస్టేషన్ పేరు మార్పు

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని ఔరంగాబాద్ రైల్వేస్టేషన్ పేరును దక్షిణ మధ్య రైల్వే 'ఛత్రపతి శంభాజీనగర్' గా మార్చింది. ఈ మేరకు రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రైల్వే స్టేషన్ నూతన కోడ్‌ను సీపీఎస్ఎన్‌గా నిర్ణయించారు. చాలా కాలంగా ఈ స్టేషన్ పేరు మార్చాలనే డిమాండ్ ఉంది. దీన్ని పరిగణలోకి తీసుకుని పేరు మార్పు ప్రక్రియ జరిగింది.

మొక్కజొన్న పంట తిని 50 నెమళ్ల మృతి

చెన్నై: తమిళనాడులోని తెన్‌కాశీ జిల్లా మీనాక్షిపురం గ్రామంలో దారుణం జరిగింది. జాన్సన్ అనే రైతు తన మొక్కజొన్న పంటను పక్షులు, జంతువుల నుంచి రక్షించేందుకు ఆహార పదార్థాలలో ఎలుకల మందు కలిపి పెట్టాడు. ఈ దుష్పరిణామం కారణంగా అక్కడికి వచ్చిన సుమారు 50 నెమళ్లు ఆ ఆహారం తిని అక్కడికక్కడే మృతి చెందాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు... పోలీసుల సహకారంతో ఘటనా స్థలానికి చేరుకుని నెమళ్ల కళేబరాలను స్వాధీనం చేసుకున్నారు. రైతును అరెస్ట్ చేశారు.

చాత్ పూజ ప్రారంభోత్సవాల్లో విషాదం... 11 మంది మృతి

పట్నా: బీహార్‌లో చాత్‌పూజ ప్రారంభోత్సవాల సందర్భంగా 'నహయ్ ఖాయ్' ఆచారాల సమయంలో విషాదాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏడు జిల్లాల్లో దాదాపు 11 మంది మరణించారు. వీరిలో పిల్లలు, యువకులే అధికంగా ఉన్నారు. పట్నాలో గంగానదిలో స్నానం చేస్తుండగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు యువకులు, వైశాలిలో ఒక బాలుడు, జముయిలో ఇద్దరు యువకులు, బెగుసరాయ్‌లో ఒక యువకుడు, సీతామర్హిలో ముగ్గురు, కైమూర్‌లో ఒక బాలుడు నీటిలో మునిగి మరణించారు. పండుగ వేళ ఆయా కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

'కొమురం భీం' పోరాటం యువతకు ఆదర్శం

'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ వీరుడు 'కొమురం భీం'ను కీర్తించారు. 20వ శతాబ్దం తొలినాళ్లలో దేశ ప్రజలకు స్వాతంత్ర్యం సుదూరస్వప్నంగా ఉండేదన్న మోదీ... ఆ కాలంలో బ్రిటీష్‌వారి దోపిడీని గుర్తు చేశారు. అప్పట్లో తెలంగాణ, హైదరాబాద్ ప్రజలపై దమనకాండ తీవ్రంగా ఉండేదన్న మోదీ.. ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయంపై, బ్రిటీషర్ల అకృత్యాలపై 20 ఏళ్ల వయసులో కొమురం భీం ఉద్యమించాడని మోదీ చెప్పారు. ప్రతి ఆదివారం దేశ ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగించే మన్‌కీ బాత్ కార్యక్రమంలో మోదీ ఈ మేరకు కొమురం భీంను గుర్తు చేసుకున్నారు. నిజాం పోలీసు అధికారిని కొమురం భీం చంపడమే కాకుండా, అరెస్ట్ కాకుండా తప్పించుకోగలిగారని కీర్తించారు. అసంఖ్యాక ప్రజల హృదయాల్లో, ముఖ్యంగా ఆదివాసీల మనస్సుల్లో.. కొమురం భీం సుస్థిరస్థానం సంపాదించారని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. కొమురం భీం నుంచి యువత ఎంతో నేర్చుకోవాలని కూడా ప్రధాని మోదీ సూచించారు. ఇక జీఎస్‌టీ సంస్కరణలు దేశంలోని అన్ని వర్గాల్లో సంతోషాన్ని నింపాయని... ఈ పండుగల సీజన్‌లో దేశీయ వస్తువుల కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. వంట నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించాలని రాసిన లేఖకు సానుకూల స్పందన వచ్చిందని మోదీ వెల్లడించారు. చత్తీస్‌గఢ్‌లో అంబికాపూర్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తున్న గార్బేజ్ కేఫ్ వినూత్నంగా పర్యావరణానికిసేవలందిస్తోందని ప్రధాని కొనియాడారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఇచ్చి అక్కడ ఉచితంగా ఆహారం తినొచ్చని చెప్పారు. ఈసారి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కూడా దీపావళి వెలుగులు కనిపించాయని వివరించారు. ఈ సందర్భంగా దేశీ జాతి శునకాలను పెంచుకోవాలని ప్రధాని మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. 'దేశీ జాతి శునకాలను పెంచుకోవాలని ప్రజలు, భద్రతా దళాలను కోరుతున్నా. ఎందుకంటే అవి మన వాతావరణ పరిస్థితులకు త్వరగా అలవాటుపడతాయి. ఈ విషయంలో భద్రతా దళాలు గణనీయమైన పురోగతి సాధించాయి' అన్నారు.

దేశంలో 22 గుర్తింపులేని వర్సిటీలు: యూజీసీ

న్యూఢిల్లీ: దేశంలో మొత్తం 22 గుర్తింపులేని యూనివర్సిటీలు ఉన్నాయని 'యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)' హెచ్చరించింది. ఢిల్లీలోని కోట్లా ముబారక్‌పూర్‌లోగల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంజినీరింగ్ సంస్థ విషయంలో యూజీసీ మరోసారి హెచ్చరికలు చేసింది. ఆ వర్సిటీ అనుమతులు లేని డిగ్రీ కోర్సులను నిర్వహిస్తోందని పేర్కొంది. ఆ సంస్థ జారీచేసే డిగ్రీలకు ఎలాంటి విలువ లేదని తెలిపింది. అసలు ఈ విశ్వవిద్యాలయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ఏ చట్టాలకు లోబడి ప్రారంభించలేదని స్పష్టం చేసింది. దేశంలో 22 గుర్తింపులేని యూనివర్సిటీల్లో తొమ్మిది ఢిల్లీలో ఉన్నాయి. ఐదు ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉండగా... మిగిలినవి కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరిల్లో నిర్వహిస్తున్నట్లు యూజీసీ గణాంకాలు చెబుతున్నాయి. తమ సంస్థలకు పేర్లుపెట్టే సమయంలో 'నేషనల్', టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఇన్‌స్టిట్యూట్ వంటి పదాలు వాడుతున్నారు. యూపీలో విద్యాపథ్, పరిషద్, ఓపెన్ యూనివర్సిటీ వంటి పదాలను వినియోగిస్తున్నారు. విద్యార్థులు ఏదైనా సంస్థలో చేరే సమయంలో దాని పేరు సెక్షన్ 2 (ఎఫ్) లేదా 3 కింద యూజీసీ గుర్తించిన జాబితాలో ఉందో లేదో చెక్ చేసుకోవాలి. ఇక ఏఐసీటీఈ, పీసీఐ, ఎన్ఎంసీ వంటి కౌన్సిల్స్ నుంచి ఆయా సంస్థల్లో ఏ కోర్సుల నిర్వహణకు అనుమతులు లభించాయో సరిచూసుకోవాలి.

నలుగురు ఉగ్రవాదుల అరెస్ట్

ఇంఫాల్: మణిపూర్‌లో వివిధ నిషేధిత సంస్థలకు చెందిన నలుగురు ఉగ్రవాదులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిషేధిత పీఆర్‌ఈపీఏకే (ప్రో)కి చెందిన ఇద్దరు క్రియాశీల కార్యకర్తలను తౌబాల్ జిల్లాలో అరెస్ట్ చేశామని అన్నారు. నిషేధిత కాంగ్లీపాక్ కమ్యూనిస్ట్ పార్టీ (తైబాంగ్ నాన్బా)కి చెందిన మరో సభ్యుడిని ఇంఫాల్ తూర్పులోని పొరొంపట్‌లో అదుపులోకి తీసుకున్నామని అన్నారు. కేవైకేఎల్‌కి ఒక క్రియాశీల సభ్యుడిని పశ్చిమ ఇంఫాల్‌లోని సింగ్జామీలో అతడి నివాసంలో అరెస్ట్ చేసినట్లు పోలీసులు వివరించారు. వారి నుంచి భద్రతా దళాలకు చెందిన ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని, వాటిలో హ్యాండ్ గ్రెనేడ్లు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.

పంట వ్యర్థాలు కాల్చని రైతులకు నగదు బహుమతులు

పంజాబ్‌లో కొత్త విధానం

చండీగఢ్: ఉత్తరాది రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను (వరి గడ్డి) రైతులు పొలాల్లోనే కాల్చడం తీవ్ర వాయు కాలుష్యానికి కారణమవుతోన్న నేపథ్యంలో దీనిని నియంత్రించేందుకు పంజాబ్ లోని బర్నాలా జిల్లా యంత్రాంగం వినూత్న ఆలోచన చేసింది. పంట వ్యర్థాలను దహనం చేయకుండా రైతులను ప్రోత్సహించడానికి 'లక్కీ డ్రా' పథకాన్ని ప్రారంభించింది. ఇందుకోసం రూ. 7 లక్షలు కేటాయించారు. ఈ పథకం కింద ప్రతీ వారం 25 మంది రైతులను విజేతగా ప్రకటిస్తారు. వారికి నగదు బహుమతి ఇస్తారు. అలాగే ప్రశంసా పత్రాన్ని అందించి సత్కరిస్తారు. మొదటి స్థానంలో నిలిచిన రైతుకు రూ. 20,000, రెండో స్థానంలో నిలిచిన అన్నదాతకు రూ. 15,000, మూడో ప్లేస్ నిలిచిన కర్షకుడికి రూ. 10,000 నగదు బహుమతిని అందజేస్తారు. మరో 22 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ. 2,500 చొప్పున ఇస్తారు. లక్కీ డ్రా పథకం మొదటి దశను బర్నాలా డిప్యూటీ కమిషనర్ టి. బెనిత్ ప్రారంభించారు. 25 మంది లక్కీ డ్రా విజేతలకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను ఇచ్చి సత్కరించారు. రైతుల కోసం బర్నాల జిల్లా యంత్రాంగం ఆన్ లైన్ పోర్టల్ ను ప్రారంభించిందని జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ధరమ్ వీర్ సింగ్ తెలిపారు. ఇందులో పంటల వ్యర్థాల కాల్చని రైతులు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ పోర్టల్ లో రైతులు తమ పంట పొలాల ఫొటోలను అప్‌లోడ్ చేశారని, అందుకు అనుగుణంగా తాజాగా విజేతలను ప్రకటించామని పేర్కొన్నారు. "పంట, వరి కోసిన తర్వాత మిగిలిన గడ్డి లాంటి భాగం వంటి ఫొటోలను పోర్టల్ లో పెట్టాలి. ఆ తర్వాత ఈ రైతులందరి పొలాలను అధికారులు పరిశీలిస్తారు. దీని ఆధారంగా వారి పేర్లను లక్కీ డ్రాలో చేర్చారు. ఈ లక్కీ డ్రాలో మొదటి బహుమతి గంగోహర్ గ్రామానికి చెందిన కైహర్ సింగ్, రెండో ప్రైజ్ కొట్టున్నకు చెందిన హర్‌ప్రీత్ సింగ్, మూడో ప్రైజ్ బిక్కర్ సింగ్ గెలుచుకున్నారు" అని ధరమ్ వీర్ సింగ్ వెల్లడించారు. కాగా, తాను 'లక్కీ డ్రా' పథకంలో మొదటి బహుమతి విజేతగా నిలవడంపై రైతు కైహర్ సింగ్ ఆనందం వ్యక్తం చేశారు. "వ్యవసాయ శాఖ నాకు ఫోన్ చేసి లక్కీ డ్రా వచ్చిందని చెప్పింది. గత నాలుగేళ్లుగా నేను పంట వ్యర్థాలను కాల్చలేదు. ఏటా పంట కోయగా మిగిలిన వ్యర్థాలను అలాగే వదిలేస్తాను. ఆ తర్వాత అదే భూమిలో గోధుమ విత్తనాలు వేస్తాను. ఈసారి కూడా నా 100 ఎకరాల భూమిలో పంట వ్యర్థాలకు నిప్పు పెట్టలేదు. దీంతో మేము మా పరిసరాలను కాలుష్యం నుంచి రక్షిస్తాము. బర్నాలా జిల్లా అధికారులు తీసుకొచ్చిన ఈ చొరవ ప్రశంసనీయం" అని కైహర్ సింగ్ తెలిపారు.

విశాలాంధ్ర హైదరాబాద్

నేడే బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సమావేశం : వెంకట్రాములు

విశాలాంధ్ర, హైదరాబాద్ : బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఆఫీసు బేరర్స్ సమావేశం 27న సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ హిమాయత్ నగర్ లోని రాజ బహదూర్‌గౌర్ సమావేశం మందిరంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనంజయ నాయుడు ప్రకటనలో తెలియజేశారు. బీసీ రిజర్వేషన్స్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవంగా శాసనసభలో బిల్లులు ఆమోదించి కేంద్రానికి పంపిస్తే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏమాత్రం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అన్ని రాజకీయ పార్టీల బీసీ సంఘాల ప్రతినిధులతో అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని చెప్పిన మాటలు విస్మరించడం విడ్డూరంగా ఉందన్నారు. 18న రాష్ట్రంలో బీసీ బందు కనీవినీ ఎరుగని రీతిలో జయప్రదమైన పాలకులు స్పందించకపోవడం బీసీ రిజర్వేషన్ల ఎడల వారికున్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతున్నదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలల్లో విద్యా ఉద్యోగ రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకై రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చే విధంగా రాష్ట్ర కేంద్ర పాలకులపై ఒత్తిడి తెచ్చేందుకు ఐక్య ఉద్యమాల నిర్వహణకు తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు నిర్వహిస్తున్న ఈ సమావేశానికి రాష్ట్రంలోని ఆఫీస్ బేరర్స్, ఆహ్వానితులు సకాలంలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని వెంకట్రాములు, ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు.

బ్యాలెట్ యూనిట్‌లకు ర్యాండమైజేషన్

విశాలాంధ్ర, హైదరాబాద్ : జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల నిర్వహణకు ఉపయోగించే బ్యాలెట్ యూనిట్ (సప్లిమెంటరీ) లకు ర్యాండమైజేషన్ ఆదివారం చాదర్ ఘాట్ విక్టరీ ప్లేగ్రౌండ్ లో చేపట్టారు. నోటా తోకలిపి మొత్తం 59 అభ్యర్థులు బరిలో ఉండడంతో ఎన్నికల నిర్వహణకు అదనంగా బ్యాలెట్ యూనిట్‌ల అవసరం అయ్యాయి. డీఈఓ, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక కోసం బ్యాలెట్ యూనిట్‌లను కేటాయించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ పాల్గొన్నారు.

స్వీప్ చైతన్య కార్యక్రమాలు

జూబ్లీహిల్స్‌లో స్వీప్ చైతన్య కార్యక్రమాలు ఊపందుకున్నాయి. స్వీప్ కార్యక్రమాలలో భాగంగా యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కులో ఎన్నికల తేది (11-11-2025)" మరియు "నేను తప్పక ఓటు వేస్తాను" అంటు ఇంగ్లీష్, ఉర్దూ భాషతో కూడిన సందేశాలను భారీ బెలూన్ పై ప్రదర్శించారు. ఓటు హక్కు వినియోగంతో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం : జాజుల

విశాలాంధ్ర, బషీర్ బాగ్: తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేసి 42 శాతం రిజర్వేషన్లు సాధించుకుంటామని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. నవంబర్ 2న హైదరాబాద్ కళింగ భవన్‌లో బీసీల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాక్ వైస్ చైర్మన్ విజీఆర్ నారగోని, కో చైర్మన్ దాసు సురేష్, కో-ఆర్డినేటర్ గుజ్జ కృష్ణలతో కలసి జాజుల మాట్లాడుతూ రాష్ట్రంలో రాస్తారోకోలు, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రైల్ రోకోలతో పాటు దిల్లీలో కేంద్ర మంత్రులు, ప్రతిపక్ష నాయకులను కలవనున్నట్లు తెలిపారు. చివరగా లక్షలాది మందితో హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 18న తలపెట్టిన బీసీ బంద్‌పై అన్ని పార్టీలు బంద్‌కు మద్దతు యిచ్చాయని, బీసీ బంద్ ఎవరి కోసం అని కొంతమంది అగ్రకుల నాయకులు హేళన చేసే విధంగా మాట్లాడటంపై జాజుల మండిపడ్డారు. లక్ష్యాన్ని సాదించేంత వరకు అన్ని పార్టీలను, సంఘాలను కలుపుకొని వెళ్తామని చెప్పారు. ఎవరితో కుమ్మక్కై ప్రసక్తే లేదన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారానే 42శాతం రిజర్వేషన్లు సాధ్యమవుతుందని తెలిపారు. ఆ దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని ఒప్పించాలని కోరారు. ఎన్ని కేసులు, జైల్లో పెట్టిన తమ గమ్యస్థానం చేరుకునేంత వరకు పోరాటం కొనసాగిస్తామని జాజుల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు వేముల రామకృష్ణ, భాస్కర్, జాజుల లింగం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు నేతల అశీర్వాదం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : సీనియర్ నాయకులు, అప్పల బాలయ్య యాదవ్ మనవరాలు, అప్పల శ్రీశైలం యాదవ్ కూతురు పెండ్లి ఆదివారం నార్సింగ్‌లోని హెరాం కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖులు అధిక సంఖ్యలో విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. ముఖ్యంగా మాజీ మంత్రి కేటీఆర్, హరీష్ రావు, సనత్ నగర్ ఎమ్మెల్యే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేంద్ర, అంజన్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి. విజయరెడ్డి మొదలైన ప్రముఖులు వచ్చి నవవధులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అప్పల సురేంద్ర యాదవ్, అప్పల సత్యనారాయణ యాదవ్, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ అభివృద్ధి జరగాలంటే...

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి : మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా మధురానగర్‌లో ఆదివారం మంత్రి సీతక్క సహచర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, మహిళా కార్పొరేషన్ చైర్పర్సన్ బండ్రు శోభారాణి, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, ప్రజల కోసం చేస్తున్న సేవలను వివరించారు. గత మూడు సార్లు బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చినా అభివృద్ధి జరగలేదని ప్రజలకు గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు అవకాశం ఇవ్వాలి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యం అని సీతక్క ప్రజలను ఉద్దేశించి పిలుపునిచ్చారు. మధురానగర్‌లో స్ట్రీట్ కార్నర్ సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ మూడుసార్లు అవతలి పార్టీకి ఓటేస్తే ఇక్కడ ఒరిగిందేమీ లేదు. ఇందిరాగాంధీ హయాంలోనే ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు వచ్చాయి. దీనివల్ల ఇక్కడ అనేక కాలనీలు నిర్మించారు. అభివృద్ధి అంటేనే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి అని పేర్కొన్నారు. పది సంవత్సరాలుగా పేదలకు ఉద్యోగాలు రాలేదు. కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 80 వేల ప్రభుత్వ ఉద్యోగాలు, ఉచితంగా సన్నబియ్యం పంపిణీ, ఉచిత రవాణా, ఉచిత విద్యుత్, మహిళలకు వడ్డీ లేని లోన్లు, ప్రతి పేద కుటుంబానికి రూ.5 లక్షల విలువైన ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నాం అని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల తర్వాత ఈ నియోజకవర్గంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తాం. మూడుసార్లు మాగంటిని గెలిపించిన ఉపయోగం లేదు. ఈసారి గల్లీ బిడ్డ నవీన్ యాదవ్‌కు ఒక అవకాశం ఇవ్వండి అని మంత్రి ప్రజలను కోరారు. 'రాష్ట్రంలో మన ప్రభుత్వం ఉంది, అందుకే అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం. ఇప్పటికే రూ.150 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇళ్లు కావాలంటే, ఉచిత విద్యుత్ కావాలంటే, సన్న బియ్యం కావాలంటే చేతి గుర్తుకే ఓటేయండి అని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. నవీన్ యాదవ్‌ను ఆశీర్వదిస్తే జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి వేగవంతం అవుతుంది అని సీతక్క హామీ ఇచ్చారు. సీతక్క ప్రచారంతో కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్ పెరుగుతుంది. ఉదయం 8 గంటల కే ప్రచారం ప్రారంభించి.. గల్లీలో తిరుగుతూ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం విశేషంగా కృషి చేస్తున్నారూ. ఎంతో ఓపిగ్గా ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాల్సిన అవసరాన్ని వివరిస్తున్నారు. ఒక జూబ్లీహిల్స్ హోటల్ సైతం సీతక్కను అక్కున చేర్చుకుంటున్నారు. తమ ఇండ్లలోకి ఆప్యాయంగా ఆహ్వానిస్తూ... కాంగ్రెస్ కే ఓటేస్తామని హామీ ఇస్తున్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలలో కార్పొరేట్ స్థాయి విద్య : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎమ్మెల్యేగా తాను గెలిచిన తర్వాత మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ విద్యాసంస్థలలో కార్పొరేట్ స్థాయి విద్య అందుబాటులోకి వచ్చింది అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నగరం, వడ్డెర బస్తీలోని ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ భవనంలో ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ మరియు ప్రైవేటు ఎలక్ట్రికల్ షాప్స్ యాజమానుల అవగాహన సదస్సు జరిగింది . ఈ అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్ నగర్ అన్నింట్లో ఫస్ట్ ఉండాలంటే విద్య, వైద్యంలో మనం ముందుండాలని అన్నారు. అందుకే తాను విద్య , వైద్యం పైన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాను అని తెలిపారు. ఆర్థికంగా బలంగా లేనివారు ప్రభుత్వ విద్యాసంస్థలలో మీ పిల్లలను చేర్పించాలని వారికి మంచి విద్యను అందించే బాధ్యత తనదేనని ఆయన స్పష్టం చేశారు. ఏ ఆపద ఎక్కడినుంచి వస్తుందో తెలియదు కాబట్టి ఆపద సమయంలో మనకు అండగా ఉండే మెడికల్ ఇన్సూరెన్స్ ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఆయన సూచించారు. డబుల్ బెడ్రూం ఇండ్లు పథకం ప్రజలను మభ్య పెట్టే పథకమని ఆయన ఆరోపించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని ఆయన చెప్పారు. హోల్ సేల్ యాజమాన్యంతో మాట్లాడి కొత్తగా రిటేల్ షాపులు పెట్టకుండా కట్టడి చేసేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ , మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, అజ్మత్ అలి, మైత్రి యాదయ్య, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ అంజద్ ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ యూనియన్ నాయకులు వి.వెంకటాచారి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహనతోనే ప్రాణ రక్షణ : మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ యశోద ఆసుపత్రిలో బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభతో పాటు పెద్ద సంఖ్యలో వైద్యులు, వైద్య సిబ్బంది, సామాన్య ప్రజలు పాల్గొన్నారు. సదస్సులో మంత్రి సీతక్క మాట్లాడుతూ 'రొమ్ము క్యాన్సర్ సమాజాన్ని పట్టిపీడిస్తోంది. దాన్ని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారించడం చాలా సులభం. ప్రస్తుతం అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. క్యాన్సర్ రాగానే జీవితం ముగిసిందనే భయాలు అవసరం లేదు. క్యాన్సర్ పేషెంట్లకు వైద్యులు విశ్వాసం కల్పిస్తే, దానిని జయించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 'క్యాన్సర్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించడం అత్యవసరం. వైద్యులు ఇలాంటి కార్యక్రమాల్లో ముందుండాలి. యశోద ఆసుపత్రి ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయ మన్నారు. కేవలం పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన క్యాంపులు నిర్వహించాలి. అప్పుడే వైద్య వృత్తి సార్థకమవుతుం దన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్యశాఖల ద్వారా గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తోంది. ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేయించడం ద్వారా మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రభుత్వ అవగాహన కార్యక్రమాలకు వైద్యులు తోడ్పాటు అందించాలన్నారు. ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఇల్లు ఆరోగ్యకరంగా ఉంటుంది. ప్రజల ఆరోగ్యం సమాజ ఆరోగ్యం. వైద్యులు మానవతను జోడించి సేవ చేయాలి. సింపతి, ఎంపతి తో రోగులను చూసుకుంటే జబ్బు త్వరగా నయం అవుతుంది. డాక్టర్ల తెల్ల కోటు ఎంత స్వచ్ఛంగా ఉంటుందో, వారి సేవా భావం కూడా అంత స్వచ్ఛంగా ఉండాలి. సమాజ అభివృద్ధిలో డాక్టర్ల పాత్ర కీలకం అని మంత్రి సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధమాన నటి డా. శ్రీలీల, యశోద హాస్పిటల్ డైరెక్టర్ ఫాల్గుణ గోరుకంటి, మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డా. లింగయ్య, ఆంకాలజీ విభాగం అధిపతి డా. రాజేష్, ఇతర వైద్య ప్రముఖులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల ఎక్స్‌గ్రేషియా బకాయిలు విడుదల చేయాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : కల్లుగీత వృత్తిలో చెట్లపై నుండి పడి మరణించిన కుటుంబాలకు శాశ్వతంగా గాయపడిన వారికి చెల్లించాల్సిన ఎక్స్‌గ్రేషియో బకాయిలు రూ.13 కోట్లను తక్షణమే విడుదల చేయాలని, పెండింగ్‌లోవున్న పెన్షన్ దరఖాస్తులు, గుర్తింపు కార్డులు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 6.7.8 తేదీలలో రాష్ట్ర వ్యాపితంగా గీత పనివారల సంఘం ఎక్సైజ్ కార్యాలయాలు, జిల్లా కేంద్రాలలో సూపరిడెంట్, కలెక్టర్ ఆఫీసుల ముందు ప్రదర్శనతో మెమోరాండాలు సమర్పించాలని హైదరాబాద్లో బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన గీత పనివారల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. షెడ్యూల్ ఏరియాలోని కల్లు గీతవృత్తిలో వున్న గీత వృత్తిదారులకు సహకార సంఘాలు, గీత వృత్తిదారులందరికి రక్షణ వృత్తి పరికరాలు అందించాలని, నీర స్కీమ్ కల్లు గీత సహకార సంఘాల ద్వారా అమలు చేయాలని, పెన్షన్ ఐదు వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి. సాయిల్ గౌడ్, కో-ఆర్డినేటింగ్ సెక్రటరి బొమ్మగాని నాగభూ షణం, ఉపాధ్యక్షులు దూసరి శ్రీరాములు, కెవిఎల్, పబ్బు వీరస్వామి, పి.రాములు, రామ్మూర్తి, నాగరాజు, బొడిగె సైదులు, నాగేశ్వరరావు, తిరుపతి, సుధాకర్‌గౌడ్, ఎర్ర ఆంజనేయులు తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో కల్లుగీత వృత్తిదారులకు 560 జీవో ప్రకారం సొసైటీలకు భూమి, షాపులకు స్థలాలు, వృత్తి అభివృద్ధికి సంక్షేమ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గీత వృత్తిదారుల సమస్యలపై దశల వారిగా ఆందోళన కార్యక్రమం చేపట్టాలని నవంబరు చివరి వారంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించుటకు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశం నిర్ణయిం చింది. సమావేశానికి ముందు మృతిచెందిన నేలపట్ల పెద్దసైదులు, కర్నూల్ బస్సు ప్రమాదంలో మరణించిన వారికి, చెట్లపై నుండి మరణించిన వారికి సమావేశం సంతాపం తెలిపింది.

శ్రీ చైతన్య స్కూల్ సీజ్‌పై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని శ్రీ చైతన్య స్కూల్‌ను జీహెచ్ఎంసీ అధికారులు ఆకస్మాత్తుగా సీజ్ చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర ఆగ్రహం చెలరేగింది. వారం రోజులుగా పాఠశాల మూసివేయబడటంతో వెయ్యి మందికిపైగా విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. పరీక్షలు సమీపిస్తున్న సమయంలో స్కూల్‌ను మూసివేయడం పిల్లల భవిష్యత్తుతో ఆటలు ఆడటమే అని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. వారి వాదన ప్రకారం ఈ భవనం తొమ్మిది సంవత్సరాలుగా అదే ప్రాంగణంలో పాఠశాలగా నడుస్తోంది. ఇంతకాలం ఎటువంటి అభ్యంతరాలు లేకుండా కొనసాగుతుండగా ఒక్కసారిగా సీజ్ చేయడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో అర్థం కావడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. 'భవనంలో లోపాలున్నాయని చెప్పి సీజ్ చేస్తే, శేరిలింగంపల్లిలోని 90 శాతం ప్రైవేట్ స్కూల్స్ మూసివేయాల్సిందే కదా? మరి ఎందుకు ఒక్క శ్రీ చైతన్య స్కూల్‌నే టార్గెట్ చేస్తున్నారు?' అని తల్లిదండ్రులు నిలదీస్తున్నారు. 'సర్కిల్ ఉప కమిషనర్ ప్రశాంతి చెప్పాలి ఈ నిర్ణయం మీదె అయితే ఆధారం ఏమిటి? లేకపోతే పూర్తి సమాచారం లేకుండానే సంతకం చేశారా? పిల్లల చదువులు ఆగిపోతే బాధ్యత ఎవరిది?' అని వారు ప్రశ్నించారు. అకాడమిక్ ఇయర్ మధ్యలో స్కూల్‌ను సీజ్ చేయడం పరిపాలనా నిర్లక్ష్యం కాదు, నేరమని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'భవనంలో లోపాలు ఉన్నా వేసవి సెలవుల్లో సరిచేయమని సూచించవచ్చు. ఇప్పుడు ఈ సమయానికి సీజ్ చేయడం వల్ల పిల్లల భవిష్యత్తు రోడ్డుపాలవుతోందని పేర్కొన్నారు. సర్కిల్ ఉప కమిషనర్ ప్రశాంతి వెంటనే జోక్యం చేసుకుని సీజ్ ఆర్డర్‌ను రద్దు చేయాలి. లేకపోతే తల్లిదండ్రులం అందరం ఏకమై పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సీజ్ ఆదేశాలను వెంటనే ఉపసంహరించి, తరగతులు తక్షణమే పునఃప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్ణయాలు తీసుకునే ముందు విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించి, తల్లిదండ్రులతో చర్చించి సమయానుకూల పరిష్కారం చూపాలని కోరారు. అక్రమ నిర్మాణాలపై చూపే కఠినత్వం విద్యార్థులపై చూపొద్దు. స్కూల్ భవనం కూలిపోలేదు, మీ నిర్లక్ష్యంతో పిల్లల ఆశలు మాత్రం కూలిపోతున్నాయి. పిల్లల భవిష్యత్తును అధికారుల అజాగ్రత్తకు బలిచేయొద్దు వెంటనే చర్య తీసుకోంవాలని డిమాండ్ చేశారు.

నేడు మద్యం దుకాణాలకు డ్రా

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : 27న ఫిర్యాదిగూడ బోడుప్పల్ శ్రీ పలనీ కన్వెన్షన్ లో ఉదయం 11 గంటలకు మేడ్చల్- మల్కాజిగిరి యూనిట్లకు సంబంధించి నూతన మద్యం పాలసీ 2025-27 కు గాను మేడ్చల్ యూనిట్ లోని (118), మల్కాజిగిరి యూనిట్ లోని (88) మద్యం షాపులకు జిల్లా కలెక్టర్ సమక్షంలో డ్రా ఆఫ్ లాట్స్ తియబడును. దరఖాస్తు దారులు, అధికార ప్రతినిధులు తప్పని సరిగా ఉదయం 9గంటలలోపు హాజరు కావాలని, మొబైల్ ఫోన్లు అనుమతించబడవని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ విభాగం అధికారులు తెలిపారు.

ఘనంగా సత్యసాయి శత జయంతి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి వేడులలో భాగంగా ఆదివారం గోపాల్ పట్నాయక్ సునీత గృహమందు మల్లికార్జున నగర్ సత్యసాయి సేవా సమితి మల్కాజిగిరి ఆధ్వర్యంలో 100 పాటలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, సేవా సమితి సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సంపు నిర్మాణానికి నిధులు మంజూరు

విశాలాంధ్ర - తుర్కుంజల్: తుర్కయంజల్ కురుమ సంఘం ఆధ్వర్యంలో 11వ వార్డు కౌన్సిలర్ గుండ ధనరాజ్ అధ్యక్షతన టిఎస్‌క్యాప్ వైస్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా చైర్మన్ కొత్త కురుమ సత్తయ్యను కలిసి తుర్కయంజల్ కురుమ సంఘం వద్ద నీటి సంపు నిర్మాణం గురించి నిధులు కేటాయించమని కోరడంతో వెంటనే సత్తయ్య అభిమానంతో సంపు నిర్మాణానికి వెంటనే ఒక లక్ష రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారనీ వారు తెలిపారు. కురుమ సంఘం కార్యవర్గం తరపున, కులస్తుల తరపున వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఘనంగా రవి జన్మదిన వేడుక

విశాలాంధ్ర, మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి జన్మదిన వేడుకలు వివిఆర్ బ్యాంకట్ హాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఆదివారం ఉదయం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, తీన్మార్ మల్లన్న, తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ గోగుల సరిత, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, పలు మున్సిపల్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తుంగతుర్తి రవిని ఘనంగా సన్మానించి, గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తుంగతుర్తి రవి పిలుపుమేరకు వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరు పూల బొకేలు కాకుండా నోటు పుస్తకాలు, పెన్నులు బహుమతిగా అందించడం విశేషం. అనంతరం ఆర్ వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 100 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

26 నుంచి 28 వరకు ఐకేఎంసీ

హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఐకేపీ నలెడ్జ్ పార్క్ (ఐకేపీ) తన వార్షిక ప్రాధాన్యమైన 19వ ఎడిషన్ కార్యక్రమం ఇంటర్నేషనల్ నలెడ్జ్ మిల్లేనియం కాన్ఫరెన్స్ (ఐకేఎంసీ)ను అక్టోబర్ 26 నుంచి 28 వరకు నిర్వహించనుంది. ఈ కాన్ఫరెన్స్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ), జీనోమ్ వ్యాలీలోని ఐకేపీ నలెడ్జ్ పార్క్ ప్రాంగణంలో జరుగుతుంది. దీపన్విత చట్టోపాధ్యాయ్, మేనేజింగ్ డైరెక్టర్, ఐకేపీ నలెడ్జ్ పార్క్, మాట్లాడుతూ అన్నారు. "ఐకేఎంసీ ఎప్పుడూ ఆవిష్కరణల భవిష్యత్తును కొత్తగా ఊహించేందుకు వేదికగా నిలుస్తూ వస్తోంది." అని తెలిపారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార జోరు

కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు న్యాయం : మంత్రి తుమ్మల

విశాలాంధ్ర-జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావునగర్ డివిజన్ మధురనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్, స్థానిక నాయకులు డివిజన్, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు, మాట్లాడుతూ, ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కట్టుబడి పనిచేసే కాంగ్రెస్ పార్టీనే ప్రజలకు న్యాయం చేస్తుందని తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గారిని భారీ మెజారిటీతో గెలిపించి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ప్రజలకు ఆయన పిలుపు నిచ్చారు.

బీఆర్ఎస్ అభ్యర్థి ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : గులాబీ మయమైన యూసఫ్ గూడ, ప్రజల ఆదరాభిమానాల మధ్య జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర రవాణా శాఖ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం మాజీ డైరెక్టర్ గోసుల శ్రీనివాస్ యాదవ్, రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీష్ రెడ్డి, కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయషలతో కలిసి ఆదివారం యూసఫ్ గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్ లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. గడపగడపకు బీఆర్ఎస్ లక్ష్యంగా ముందుకు సాగారు. జూబ్లీహిల్స్ బరిలో గులాబీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రచారం సాగింది.

బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : జూబ్లీహిల్స్ శాసన సభ ఎన్నికల్లో భాగంగా మల్కాజిగిరికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో 304 పోలింగ్ బూత్‌లోని ఓటర్లను కలిసి బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించారు. మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఈ బూత్ బాధ్యతలను స్వీకరించడంతో మల్కాజిగిరి బిఆర్ఎస్ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టి.జనార్ధన్, భాగ్యనంద్ రావు, రాజేష్ గౌడ్, వేణు యాదవ్, కోటేష్, కె.శ్రీధర్ గౌడ్, మహేష్ గౌడ్, నవీన్, రాజు గౌడ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

'మాన్‌కీ బాత్'లో బీజేపీ నేతలు

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : ఆదివారం, మాన్‌కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జీ. కిషన్ రెడ్డి. జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంకటగిరి లోని ఆఫీసర్స్ కాలనీలో ప్రధాని 'మాన్ కీ బాత్' కార్యక్రమాన్ని బీజేపీ కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్. గౌతమ్‌రావు, ప్రేమ కుమార్, గంగరాజ్, ప్రశాంత్, కొండపల్లి చంద్ర మోహన్, పులిరామ్, బదుగు సతీష్, గ్యానేశ్వర్, కట్రాజ్, నాగమణి, క్రాంతి, కుమారి, రాణి జాదవ్, కవిత, సరోజ, స్వప్న, ఇంకా మహిళలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ ఒంగోలు 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు A.N.No.26/2022

అప్పల చెంచు లక్ష్మి
.... అపిలెంట్/ప్లెయింటిఫ్
మరియు
మాదాసు శ్రీనివాసరావు మరియు ఇతరులు
డిఫెండెంట్/రెస్పాండెంట్:-

5) Malasani Subbaiah s/o. Gangaiah, aged about 55 years, plot No. G1, Swathigruha apartments, S.B.I. Colony, Mehidipatnam, Hyderabad, Rangareddy District.

పై తెలుపబడిన అప్పీలు నెం. 26/2022లో 5వ ప్రతివాది అయిన తమరికి పలుమార్లు శ్రీ కోర్టు వారు అప్పీలు నెం. 26/2022 నందు తమరికి నోటీసులు పంపించియున్నారు, కాని అవి మీకు జారీ కాసందున, అప్పీలు వాయిదా నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియపరుచుటకు, శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున పైన పేర్కొన్న 5వ ప్రతివాది అయిన మీరు ఈ పేపరు ప్రకటనను అప్పీలు నెం. 26/2022 వాయిదా నోటీసుగా భావించి తేది. 07.11.2025 ఉదయం 10.30 గంటలకు మహారాజశ్రీ ఒంగోలు 7వ అదనపు జిల్లా జడ్జి కోర్టు వారి సమక్షంలో తమరు స్వయంగా గానీ, లేదా తమ వకీలు ద్వారా గానీ హాజరై మీ సంజాయిషీని, వాదనను తెలియపరచవలెను. లేనియెడల మీ పరోక్షముగా పై నంబరు అప్పీలు తీర్మానించబడును.

మహారాజశ్రీ ఒంగోలు 7వ అదనపు జిల్లా జడ్జి కోర్టు వారి అనుమతితో
ఒంగోలు
date:27.10.2025

ఇట్లు,
పిల్లల లక్ష్మయ్య
టి. నాగేశ్వరరావు,
అడ్వకేట్స్
ఒంగోలు
Cell No.9848835099

టీఆర్ఎస్ (డీ) నామినేషన్ తిరస్కరించడం అన్యాయం : నరాల

విశాలాంధ్ర, బషీర్ బాగ్: తెలంగాణ రక్షణ సమితి డెమొక్రటిక్ (టీఆర్ఎస్) (డీ) పార్టీ నామినేషన్ ని కావా లనే తిరస్కరించారని ఆ పార్టీ అధ్యక్షులు నరాల సత్యనారాయణ ఆరోపించారు. నామినేషన్‌కు తిరస్కరణకు సరైనా కారణాలు వెల్లడించకుండా రిటర్నింగ్ అధికారి తాత్సరం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఆదివారం మీడియా తో మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీ ఫిర్యాదు తోనే మా నామినేషన్ ను ఆర్వో తిరస్కరించారని ఆయన ఆరోపించారు. నామినేషన్ తిరస్కరణకు కారణాలు చెప్పాలని ఆర్వోకు ఫోన్ చేయగా, కారణం వాట్సాప్‌లో పెడతానని చెప్పారని సత్యనారాయణ అన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు ఏవి?

సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అక్రమార్కులకు కొదవే లేకుండా పోయింది. ప్రభుత్వం ఈ అక్రమాలను అరికట్టాలని హైడ్రాను తీసుకువచ్చి సర్కారు భూములు, చెరువులు, పార్కుల కబ్జాలను అరికడుతుంటే, ఇంకోవైపు వారి కళ్లు కప్పి ధన దాహంతో పరుగులెడుతున్న కొందరు భూ బకాసురులు చాటు మాటున కబ్జాలకు పాల్పడుతున్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఇందిరమ్మ ఫేస్-3, బ్లాక్ నెంబర్ 22,23 వెనక సర్వే నెంబర్- 233/15 ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఈ అక్రమ నిర్మాణాలకు ఇందిరమ్మ ఫేస్ - 3 నుంచి డ్రైనేజ్ కలెక్షన్ వేస్తున్నారనే విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు పొన్నికంటి దస్తగిరి ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ నిజాంపేట్ సర్వే నెంబర్ - 233/15 ప్రభుత్వ స్థలంలో 150 గజాలలో అక్రమ నిర్మాణం జరిగిందని సర్వేయర్ సింధు తెలిపారని, ఈ అక్రమ నిర్మాణంపై అనేక సార్లు ముఖ్యమంత్రి ప్రజా భవన్‌తో మొదలు కొని మేడ్చల్ జిల్లా కలెక్టర్, ఆర్డీవో, బాచుపల్లి మండల తహసీల్దార్ ఫుల్‌సింగ్ చౌహాన్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షబ్బీర్ అలీ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ భానుచందర్, సర్వేయర్ సింధుకి అనేక సార్లు పిర్యాదు చేయడం జరిగిందని, ఫిర్యాదుల అందిన అధికారుల మౌనవ్రతంతో అక్రమార్కులు ఇప్పుడు ఇక్కడ దర్జాగా అదే అదునుగా చేసుకొని ఇప్పుడు అక్రమ నిర్మాణాల నుండి, వెనుక వున్నా ఇందిరమ్మ ఫేస్ -3 డ్రైనేజ్ మాన్యువల్‌కి కలెక్షన్ ఇస్తున్నారని, ఈ అక్రమ డ్రైనేజ్ కలెక్షన్లను ఆపాలని, అట్టి ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున స్థానిక ప్రజలను సమీకరించి పోరాటం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఈశ్వర్,ఎం రామ్ బాబు,మల్లేష్,రాజు,రామ ఆంజనేయులు, వినాయక్,జగదీశ్, పి కవిత,సుధా, అంజలి, లత,కుసుమ తదితరులు పాల్గొన్నారు.

పై హెల్త్ క్యాన్సర్ ఆసుపత్రి ' ప్లే ఫర్ పింక్'

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: నగరంలోని పై హెల్త్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం కొండాపూర్‌లోని ఎ జోన్‌లో ప్లే ఫర్ పింక్ అనే పేరుతో వినూత్నమైన బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించారు. ఆస్పత్రి ఆధ్వర్యంలో మొత్తం 10వేల మందికి క్యాన్సర్ పరీక్షలు చేయాలని ఈ ఏడాది ఆరంభంలో నిర్ణయించుకోగా, ఇప్పటికి 2వేల పరీక్షలు పూర్తయ్యాయి. ఇందులో ప్రధానంగా మహిళలకు రొమ్ముక్యాన్సర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, క్యాన్సర్‌పై అవగాహన పెంచేందుకు ప్లే ఫర్ పింక్ అనే పేరుతో ఈ బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించారు. దీంతోపాటు.. క్యాన్సర్ రోగులు, వారి బంధువుల కోసం హీలింగ్ ఆర్బిట్ అనే వర్చువల్ కమ్యూనిటీని కూడా ప్రారంభించారు. క్యాన్సర్ రోగులకు తగిన మద్దతు లభించడం లేదు. వారికి చికిత్స గురించిన అనుమానాలున్నా, ఆర్థిక సమస్యలున్నా, లేదా భావోద్వేగపరంగా ఏమైనా మానసిక ఇబ్బందులున్నా వాటి గురించి సరిగా చెప్పేవారే ఉండట్లేదు. అందుకే హీలింగ్ ఆర్బిట్ అనేది వారందరికీ ఉమ్మడిగా ఉండే వర్చువల్ కమ్యూనిటీ. ఇది ఎంతగానో ఉపయోపడుతుంది. ఇందులో క్యాన్సర్ రోగులు, వారి బంధువులు ఎవరైనా చేరొచ్చు. వారి వారి అభిప్రాయాలు, అనుభవాలు పంచుకోవచ్చు. చికిత్స పరంగా గానీ, మానసిక పరంగా గానీ ఏమున్నా ఇందులో ఒకరితో ఒకరు చెప్పుకోవచ్చు. ఎవరికైనా ఏమైనా సాయం కావాలని ఇందులో అడిగినా అది అందించే ప్రయత్నం ఆస్పత్రి తరఫు నుంచి చేస్తారు. నాలుగు 'సి'ల ఆధారంగా క్యాన్సర్‌పై అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టాలని ఆస్పత్రి వర్గాలు భావిస్తున్నాయి. అవి.. క్లినీషియన్స్, కాలేజెస్, కార్పొరేట్, కమ్యూనిటీ. ఈ నాలుగు వర్గాలు సమాజంలోని నాలుగు ప్రధాన రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి కాబట్టి, వీళ్ల ద్వారా సమాజం నలుమూలలకు చేరుకుని అందరికీ క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలని నిర్ణయించారు. అందుకోసం ప్లే ఫర్ పింక్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఈ నాలుగు రంగాల ప్రముఖులనే ఎంచుకున్నారు. క్లినీషియన్స్ తరఫున పై హెల్త్ క్యాన్సర్ ఆస్పత్రి సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రఘురామిరెడ్డి, కాలేజెస్ తరఫున ప్రజ్ఞ డిగ్రీ, పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ వెంకటేష్ చారి, కార్పొరేట్ తరఫున స్మార్ట్ ఐఎంఎస్ ఇంక్. హెచ్ఆర్ విభాగం వైస్ ప్రెసిడెంట్ చైతన్య కాంతి, కమ్యూనిటీ తరఫున అమీన్పూర్ మండల్ పద్మసాలి సంక్షేమసంఘం ప్రధాన కార్యదర్శి చెన్నమోహన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

కార్తీక వన సమారాధన

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: మియాపూర్ డివిజన్ పరిధిలోని నరేన్ గార్డెన్స్‌లో జరిగిన కమ్మ సంఘం పఠాన్ చెరువు, బి.హెచ్.ఇ. ఎల్, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్మ సంఘం 29వ కార్తీకమాస వనభోజన మహోత్సవం కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మన్నే సతీష్ కుమార్ , సీనియర్ నాయకులు బండి రమేష్, గౌరవ కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు తో కలిసి ముఖ్యఅతిథిగా పీఏసీ చైర్మన్ ఆరెక పూడిగాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన కార్తీక మాసం సందర్భంగా కమ్మ సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వన భోజన మహోత్సవం కార్యక్రమంను నిర్వహించుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, ఇది ఒక శుభపరిణామం అని,కమ్మ సంఘం సభ్యులు ఐక్యతగా ఉండాలి. కమ్మ సంఘం సభ్యులు ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని గాంధీ తెలిపారు. అదేవిధంగా కమ్మ సంఘం కుటుంబ సభ్యులకు ఎల్లవేళల అందుబాటులో ఉంటానని, తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని, మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని గాంధీ తెలిపారు. కార్తీకమాస వనభోజనాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఒకే చోట చేరుకుంటామని, సమాచార మార్పిడి వీలుగా ఉంటుంది అని, అందరి యోగక్షేమాలు, చిరునామాలు తెలుసుకోవడానికి ఎంతగానో దోహదపడుతుంది అని, ఒక కుటుంబం గా మెలుగుతామని గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో పఠాన్ చెరువు, బి.హెచ్.ఇ. ఎల్, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్ కమ్మ సంఘం సభ్యులు డాక్టర్ లయన్ ఘట్టమనేని బాబు రావు, చంద్రమౌళి , కొల్లి వెంకటేశ్వర రావు, రావి పాపారావు, శివ కోటేశ్వరరావు, రాజా, సత్య , బిఎల్ వి కుటుంబ రావు, అడుసుమిల్లి వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

మస్టర్ల సర్క్యూలర్‌తో కార్మికులను కుదించే కుట్ర : సీతారామయ్య

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : సింగరేణి సంస్థలు 150 మస్టర్ల నిబంధన కార్మికులను కుదించే కుట్రలో భాగమేనని జిఎల్ బి కే ఎస్, ఇఫ్ట్ జనరల్ సెక్రెటరీ జె. సీతారామయ్య ఆరోపించారు. ఇటీవల విడుదలైన సర్క్యులర్ ను రద్దు చేసేలా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు స్పందించాలని కోరారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలు సింగరేణి అనుసరిస్తున్న విధానాలను విమర్శించారు. కొత్త సర్క్యులర్ ప్రకారం ఏడాదిలో తప్పనిసరిగా కార్మికులకు 150 మస్టర్లు ఉండాలని లేకుంటే వారి పై క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకోవడం చాలా అభ్యంతరకరమన్నారు. ఇప్పటికే కొన్నేళ్ల నుంచి సింగరేణిలో 60 శాతం వరకు కార్మికులు కుదిరించబడ్డారని ఈ సర్క్యులర్ అమలయితే చాలామందిని ఉద్యోగులను దొడ్డి దారిన తొలగించే కుట్ర జరుగుతుందన్నారు. యాజమాన్యం ఇలాంటి చర్యలు తీసుకుంటూ రాబోయే కాలంలో భూగర్భ గనులను పూర్తిగా నివారించి ఉపరితల గనులు మాత్రమే చేపట్టి కాంట్రాక్టర్లకు, తాబేదార్లకు లబ్ధి చేకూర్చేలా కుట్రలు పన్నుతున్నట్లు ఆరోపించారు. తీవ్ర అనారోగ్యంతో పనిచేయలేని పరిస్థితిలో ఉన్న 55 మంది కార్మికులను ఇటీవల మెడికల్ బోర్డు అన్ ఫిట్ చేయాల్సి ఉండగా వారిని ఆరోగ్యాంగా ఉన్నట్లు సర్టిఫై చేసారని, ఆయా కుటుంబాల్లో వారసుల ఉద్యోగాలకు ఎగనామం పెట్టేందుకే చాలా వ్యూహాత్మకంగా ఇప్పుడు 150 మస్టర్ల నిబంధన ముందుకు తెచ్చారని విమర్శించారు. ఈ సర్క్యులర్ ను రద్దు చేసేందుకు తమతొ కలిసి వచ్చే సంఘాలతో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఘనంగా శ్రీ గోదా శ్రీకృష్ణ ఆలయ ప్రతిష్ఠ

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : ఖానాపూర్ పట్టణంలో, నూతనంగా వెంకటరమణ చార్యులు నిర్మించిన శ్రీ గోదాదేవి ఆలయ ప్రతిష్ఠాపనకు ముఖ్య అతిథులుగా హాజరైనశ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీ స్వామిని స్థానిక ఎన్టీఆర్ చౌక్ నుండి ఆలయ ప్రాంగణం వరకు ఖానాపూర్ నిర్మల్ మామడ పోన్కల్ వికాస తరంగిణి భక్తులు ఘనంగా మేళ తాళాలతో శ్రీమన్నారాయణ నామస్మరణతో స్వాగతించారు అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన హోమాలను సందర్శించి స్వామివారి కర కమలములచే గోదా శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠను చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇంట్లో దీపం పెట్టి పూజలు నిర్వహిస్తే ఆ కుటుంబంలో దీప కాంతి వలె శాంతి సౌభాగ్యాలు కలిగినట్లే దేవాలయాలు నిర్మించి అందులో వాళ్లకు ఇష్టమైన ఆయా దేవత విగ్రహాలను దీపారాధన చేసి పూజిస్తే ఆ గ్రామాలకు పట్టణాలకు ప్రజల శాంతి సౌభాగ్యాలకు ఆ దేవాలయం నిలయంగా మారుతుందని సూచించారు. మనిషికున్న చెడు అహంబావా మార్గాలన మలిచే శక్తి దైవభక్తి ఆధ్యాత్మిక చింతనకే ఉందని తెలిపారు. ఆలయాలు నిర్మించడం సంతోషకరమని వద్దిపర్తి వెంకటరమణ సంకల్పాన్ని రూప రెడ్డి అనిత రెడ్డి రూపంలో ఆలయ నిర్మాణ సహకారాలు అందించి సఫలం చేశారని చిన్న జీయర్ స్వామి అన్నారు. దినచర్యలో గాలి, నీరు, అగ్ని శ్వాస నిలుపుకోవడానికి ఎంత అవసరమో ఆ శ్వాసలో భగవ భగవత్ ఆరాధన ఎంత ఉంటే అంత ఆనందం తృప్తి జీవితానికి మిగిలిన మిగులుతుంది అన్న జ్ఞానాన్ని మనిషి తెలుసుకోవాలన్నారు. ఎంత సంపాదించినా ఎంత చేసినా చివరికి మిగిలేది మంచి జ్ఞాపకాలేనని అన్నారు. శ్రీ గోదా శ్రీకృష్ణ ఆలయంలొ సంవత్సరాంతం నిత్య పూజ జరపాలని ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొని పునీతులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ప్రాంత ప్రముఖులు పైడిపల్లి రవీందర్రావు పైడిపల్లి రవీందర్‌రావు ప్రత్యేక ఆశీర్వాదాలతో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం హిందూ ఉత్సవ సమస్య వ్యవస్థాపకులు అధ్యక్షులు మంత్రరాజ్యం సురేష్ వేలాదిమంది చిన్న జీయర్ స్వామి భక్తులు తో పాటు వేద పండితులు వికాస్ అత్తారింటికి సభ్యులు డాక్టర్ దాస్యం విజయ్ కుమార్ కొండుకూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య స్కూల్‌ను సీజ్ చేయాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: ఆదివారం సెలవు రోజు తరగతులు నిర్వహిస్తున్న మొయినాబాద్ శ్రీ చైతన్య స్కూల్‌ను వెంటనే సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల అధ్యక్ష కార్యదర్శులు, రేశ్వంత్ చరణ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్ ఎఫ్ఐ ఆధ్వర్యంలో ముందస్తు సమాచారంతో మొయినాబాద్ శ్రీ చైతన్య స్కూల్ ను సందర్శించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం రోజు తరగతులు నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలను సందర్శించి తరగతులు బహిష్కరించి పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల అధ్యక్ష కార్యదర్శులు రేశ్వంత్,చరణ్ గౌడ్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీ రోజురోజుకు పెరిగి పోతుందని ఆరోపించారు. టీవీ, పేపర్స్ లలో భారీ యాడ్స్ ద్వారా అమాయక తల్లిదండ్రుల నుంచి అడ్మిషన్లు తీసుకొని లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఆదివారం రోజు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ విద్యాసంస్థల ఒత్తిడి వేధింపులు తట్టుకోలేక రాష్ట్రంలో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నారని విద్యాశాఖ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. మొయినాబాద్ శ్రీ చైతన్య పాఠశాలలో విద్యా అర్హత బీఈడీ చేసినటువంటి టీచర్లు లేరని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాత్రూంలు లేవని అన్నారు. వెంటనే డిఈఓ, ఎంఈఓ పాఠశాలను సందర్శించి శ్రీ చైతన్య స్కూలు సీజ్ చేయాల ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ నాయకులు, సాయి, మని గౌడ్, హర్ష, వినీత్, బన్నీ గౌడ్, అఖి, భాను ప్రసాద్, వరుణ్ సందేశ్, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

పాషా నరహరిల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిద్దాం

విశాలాంధ్ర - తుర్కయంజల్: భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సిపిఐఎం) రంగారెడ్డి జిల్లా ఉద్యమ నిర్మాతలు, బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాతలు మహబూబ్ పాషా నరహరిల 36వ వర్ధంతి తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో రాగన్నగూడలోని సిపిఎం పార్టీ కార్యాలయం వద్ద అమరులు పాషా నరహరిల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల మున్సిపల్ కార్యదర్శి డి కిషన్ మాట్లాడుతూ 36 సంవత్సరాల క్రితం ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలోని అనేక గ్రామాల్లో దున్నేవానికి భూమి కావాలని చేసే వారికి పని కావాలని పనికి తగ్గ ఫలితం రావాలని ప్రజలందరినీ కూడగట్టి అనేక ప్రజా ఉద్యమాలు నిర్మించిన చరిత్ర మహబూబ్ పాషా నరహరి గార్లకు ఉన్నదని వారు చేసిన పోరాటం ఫలితంగా అనేక గ్రామాల్లో వేలాది ఎకరాలు ప్రభుత్వ గైరాన్ పోరంబోకు భూముల పంపిణీ జరిగిందని అన్నారు. భూస్వాముల వ్యవసాయ పొలాల్లో మిట్టి చాకిరి చేస్తున్న అనేకమంది వ్యవసాయ కూలీలకు ఆ పోరాటాలకు అనంతరం విముక్తి లభించడమే కాక కూలి రేట్లు వేతనాల పెంపు జరిగిందన్నారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దోపిడీ విధానం మారిందని పాలకవర్గాల విధానాల వల్ల కార్మిక వర్గం అనేక హక్కులను కోల్పోతున్నారని శ్రమదోపిడికి గురవుతున్నారని దేశ సంపదంత కార్పొరేట్ ప్రైవేట్ శక్తులకు ధారాధత్వం చేస్తున్నారని అన్నారు. పాషా నరహరి ల స్ఫూర్తితో పాలకవర్గాల అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను ప్రకటించే పద్ధతుల్లో పోరాటాలను తీవ్రతరం చేయాలని అప్పుడు మాత్రమే వారికి నిజమైన నివాళులర్పించిన వారమవుతుమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మున్సిపల్ కమిటీ సభ్యులు ఎం సత్యనారాయణ, జె ఆశీర్వాదం, ఐ భాస్కర్, కే అరుణ్ కుమార్, నాయకులు ఏ భాస్కర్ రెడ్డి, మాధవరెడ్డి, ఐ కృష్ణ, కే సత్యం, పగిళ్ల మధు, సుధాకర్, నవీన్, నాగయ్య, నక్కల్ల యాదగిరి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : రాష్ట్రంలో లంబాడీల సమస్యల పరిష్కారానికై ఉద్యమ కార్యచరణ రూపొందించనున్నట్లు సేవాలాల్ సేన వ్యవస్థాపకులు ధారావత్ ప్రేమ్ చంద్ నాయక్ ప్రకటించారు. ఎస్టీ జాబితా నుండి తొలగించాలని చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడతమని అన్నారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో సేవాలాల్ సేన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షులు భూక్య చిన్న బాబు నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబు నాయక్ లతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సేవాలాల్ సేనను సంస్థాగతంగా పూర్తిస్థాయిలో నిర్మాణం చేస్తామని తెలిపారు. రాజ్యాధికారం సాధనే లక్ష్యంగా పొలిటికల్ ఫోరంను బలోపేతం చేయుటకు కార్యచరణ రూపొందిస్తామన్నారు. రెండవ విడత ప్రజా రగ్ జోళ్ యాత్ర నిర్వహించుటకు జిల్లాల వారీగా తేదీలు ప్రకటిస్తామని అన్నారు. సేవాలాల్ సేన రాష్ట్ర, జిల్లా కమిటీలలో మార్పులపై చేర్పులను త్వరలోనే నిర్ణయిస్తామన్నారు. సేవా లాల్ సేన రాష్ట్ర నాయకులు రవి రాథోడ్, రెక్య నాయక్, సభావత్ రామచంద్రనాయక్, పాతలావత్ రవి నాయక్, రఘునాయక్, రమేష్ నాయక్, శాంతి బాయి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శతవసంతాల ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సీపీఐ పార్టీ త్వరలో శతవసంతాలు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా వాడవా డలా వందేళ్ల వేడుకల జాతీయ సభ ప్రచారాన్ని జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఖమ్మం కేంద్రంగా ఖమ్మం నగరంలో డిసెంబర్ 26 జరగనున్న జాతీయ స్థాయి బహిరంగ సభ వేడుకలను జయప్రదం చేయాలని ప్రతిష్టగా తీసుకొని ఇప్పటినుంచి ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు. వేడుకల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలనే లక్ష్యంతో జిల్లా నాయకత్వం ముందుకు వెళుతుంది. ఈ క్రమంలో భాగంగా ఆదివారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య సారథ్యంలో కార్పొరేషన్ పరిధిలోని రామవరం, బూడిదగడ్డ ఏరియాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సీపీఐ వందేళ్ల చరిత్రను, ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందిస్తు ఉత్సావాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ డిసెంబర్ 25 వరకు పట్టణంలోని అన్ని పార్టీ శాఖల్లో జెండా పండుగలు జరుపుతు న్నామన్నారు. పట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి ప్రచార జాతాల సందర్భంగా బహిరంగ సభలు నిర్వహించబోతున్నట్లు కూడా వివరించారు. డిసెంబర్ 26న ఖమ్మం నగరంలో జరిగే జాతీయ స్థాయి ముగింపు ఉత్సావాల బహిరంగ సభకు పట్టణం నుంచి 10 వేల మందిని తరలించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. అందులో భాగంగానే విస్తృతంగా ప్రచారం చేపట్టామన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ కె. ఫహీమ్ దాదా, జిల్లా సమితి సభ్యులు గెద్దాడు నగేష్, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్, పద్మ, నేరెళ్ల రమేష్, నాయకులు గోపికృష్ణ, గుత్తుల శ్రీనివాస్, సందెబోయిన శ్రీనివాస్, డి గురుమూర్తి, తూముల శ్రీనివాస్, ఎస్ కె. ఖయూమ్, జలీల్, పాటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలకు మహర్దశ

- అర్బన్ స్థానిక సంస్థల ఆదాయంపై స్వేచ్ఛ
- మురికి వాడల్లో మౌలిక సదుపాయాల కల్పన
- మంచినీరు, ప్రజారోగ్యం, రోడ్లు, వంతెనలు, నగరవనాల అభివృద్ధికి ప్రాధాన్యత

విశాలాంధ్ర - సచివాలయం: రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాలు, నగరాలకు మహర్దశ పట్టనుంది. మౌలిక సదుపాయాల కల్పన బిల్లుల చెల్లింపునకు సంబంధించి గతంలో ఉన్న విధానాన్ని రద్దుచేస్తూ ఈ ఆర్థిక సంవత్సరం నుంచి నేరుగా అర్బన్ స్థానిక సంస్థల ఆదాయాన్ని అక్కడే ఖర్చుచేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో నిధుల వినియోగంలో పారదర్శకత, పట్టణాభివృద్ధి పౌరసేవలను విస్తృతం చేయాలని దిశానిర్దేశం చేసింది. ప్రధానంగా అంతర్గత రోడ్లు, ఉద్యానవనాలు, మంచినీరు, విద్యుత్, ఇతర అత్యవసర మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పన్నుల వసూళ్ల ద్వారా ఆదాయాన్ని పెంపొందించుకుని ప్రభుత్వ గ్రాంట్లతో స్వయం సమృద్ధిని సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. స్వర్ణాంధ్ర-2047 దార్శనిక ప్రణాళిక కింద రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఒక రోడ్‌మ్యాప్‌ను రూపొందించింది. ఇది జాతీయ స్థాయిలో వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా రూపొందించారు. ఈ దార్శనికతను సాధించడానికి, రాష్ట్రం ఏటా 15 శాతం పైగా జీఎస్‌డీపీ సాధించే దిశగా అడుగులు వేస్తోంది. ఫలితాల ఆధారిత సూచికలు, కార్యాచరణ, సమయానుకూల క్లస్టర్ ఆధారిత అభివృద్ధి విధానం ద్వారా దార్శనికత కు వాస్తవికతను జోడించటమే ప్రధాన లక్ష్యంగా ఎంచుకుంది. ఇందులో పట్టణ స్థానిక సంస్థలు వృద్ధి కేంద్రాలుగా కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తోంది. సేవల పంపిణీని మెరుగుపరచడం, సత్వర పట్టణ పౌర సేవలను విస్తృత పరచాలని దిశానిర్దేశం చేశారు.

వార్డులలో మున్సిపల్ నిధుల సమర్థ వినియోగం కోసం పర్యవేక్షణ, ఖర్చుల నియంత్రణకు నిర్మాణాత్మక చట్రాన్ని ఏర్పాటు చేయడం తక్షణ కర్తవ్యంగా ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు పురపాలకశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలను సమర్పించింది. నిశిత పరిశీలన అనంతరం ప్రభుత్వం పట్టణ స్థానిక సంస్థలు (యూఎల్బీల) నిర్వహణ, మూలధన వ్యయం కోసం మున్సిపల్ నిధుల వినియోగంపై సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసింది. నిర్దేశించిన విధంగా నిధులు నూరు శాతం ఖర్చుచేసి అభివృద్ధి సాధించాలని స్పష్టం చేసింది. పట్టణ స్థానిక సంస్థల వ్యూహాత్మక ఆర్థిక ప్రణాళిక అవసరమయ్యే కొన్ని ముఖ్యమైన విధులు నిర్దేశించింది. ఇందులో భాగంగా రోడ్లు, వంతెనల నిర్మాణం, గృహ, పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు సరిపోను నీటి సరఫరా ప్రజారోగ్యం, పారిశుధ్యం పరిరక్షణ, ఘన వ్యర్థాల నిర్వహణ, మురికి వాడల అభివృద్ధి, ఉద్యానవనాలు, తోటలు, క్రీడా స్థలాలు, శ్మశాన వాటికలు, దహన సంస్కార స్థలాలు, విద్యుత్ శ్మశాన వాటికలు, వీధి దీపాలు, పార్కింగ్ స్థలాలు, బస్ స్టాప్ లు, సహా ఇతర ప్రజా సౌకర్యాలు మెరుగుపర్చుకోవాల్సి ఉంటుంది. మౌలికసదుపాయాలలో దీర్ఘకాలిక పెట్టుబడులే లక్ష్యాలుగా మునిసిపాలిటీలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందుకు స్థిరమైన ఆర్థిక నిర్వహణ తప్పనిసరని తేల్చిచెప్పింది. మునిసిపాలిటీ లకు ప్రభుత్వ గ్రాంట్లు మినహా స్వీయ ఆదాయ లావాదేవీలు పారదర్శకంగా ఉండేందుకు అవసరమైన ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించింది. రోజు వారీ ఖర్చులు, రాబడులకు సంబంధించి తగిన ఆడిట్ల నిర్వహణతో పాటు పురపాలకశాఖ డైరెక్టరేట్ 15 రోజులకొ సారి సమీక్షించాలని సూచించింది. సమాచారాన్ని డ్యాష్ బోర్డులో నిక్షిప్తం చేయాలని స్పష్టం చేసింది. నిధి భవన్ పోర్టల్ ద్వారానే లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుంది. పురపాలక ఆదాయంలో 20శాతం మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, డ్రెయినేజికి 27శాతం, రహదార్లకు 19, విద్యు ద్దీపాలకు 7, రిక్రియేషన్ ప్రయోజనాలకు 10, మార్కెట్లు, భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి 17శాతం నిధులు వెచ్చించాలని మార్గనిర్దేశం చేసింది. అభివృద్ధి ఖర్చులో 15శాతం ఎస్సీ, 7.5శాతం ఎస్టీ 5శాతం. మహిళా, శిశు సంక్షేమానికి వినియోగించాలి. రెవెన్యూ రిసీ పుల ద్వారా వచ్చే మూలధన వ్యయంలో మునిసిపల్ కార్పొరేషన్లు 30శాతం, సెలక్షన్, స్పెషల్ గ్రేడ్ మునిసిపాలిటీ లు 28శాతం, గ్రేడ్-1,2 మునిసిపాలిటీలు 25శాతం, గ్రేడ్-3, నగర పంచాయతీలు 20శాతం ఖర్చు చేయాలి. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, అభివృద్ధి పనులు చేపట్టి తద్వారా మౌలిక వసతుల కల్పన చేపట్టేందుకు మార్గదర్శకాలు జారీ చేసింది.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

దయనీయంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల, ఏకలవ్య పాఠశాలలు

సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో గిరిజన సంక్షేమానికి తగు నిధులు కేటాయించి, గిరిజన ప్రాంతాలు, గిరిజన పాఠశాలల అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య కోరారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల, ఏకలవ్య పాఠశాలల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. విద్యాబుద్ధులు నేర్పించి, తమ పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దుతారనుకుని పాఠశాలలకు పంపుతున్న గిరిజన తల్లిదండ్రుల ఆశలు అడియాసలవుతున్నాయని అన్నారు. మంచి విద్యతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం అందాల్సిన గిరిజన సంక్షేమ పాఠశాలలలో పిల్లలు అనారోగ్యాలకు గురై, విగతజీవులుగా మారడం బాధాకరమన్నారు. కొన్ని సంవత్సరాలుగా ప్రతి ఏటా పదుల సంఖ్యలో గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులు మృత్యుఒడికి చేరుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖకుగానీ, సంబంధిత అధికారులకుగానీ పట్టకపోవడం విచారకరమని ధ్వజమెత్తారు. ఏటా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న వైద్య పరీక్షలలో వందల మంది గిరిజన బాలబాలికలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించినప్పటికీ శాశ్వత నివారణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యమని విమర్శించారు. 2025 విద్యా సంవత్సరంలో అధికారికంగా 12 మంది, బాహ్య ప్రపంచానికి తెలియకుండా మరో 10 మంది మొత్తం 22 మంది మరణించారన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించి దశాబ్దాల కాలం పూర్తి కావస్తున్నప్పటికీ కనీస మౌలిక సదుపాయాలు లేవని లేఖలో పేర్కొన్నారు. విద్యార్థులకు సరిపడా స్వచ్ఛమైన తాగునీరు, కిచెన్, డార్మిటరీ, వసతి గదులు, తరగతి గదులు, మరుగుదొడ్లు, వైద్య సేవలు, అవసరమైన సిబ్బంది వంటి ఏర్పాట్లు అంతంతమాత్రమేనని అన్నారు. గిరిజన పాఠశాలల్లో విద్యార్థులకు ప్రాథమిక వైద్య సేవలు అందించేందుకు ఏఎన్ఎంల నియామకం, నాణ్యమైన పౌష్టికాహారం, మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు లేవని అన్నారు. రాష్ట్రంలో గిరిజన ప్రాంతాలకు చెందిన అనేక మంది గిరిజన శాఖా మంత్రులుగా బాధ్యతలు చేపట్టినప్పటికీ ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో గిరిజనానికి జరిగిన మేలు అరకొరగానే ఉందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమానికి కేటాయించిన నిధులను ఇతర పథకాలకు దారి మళ్లించడంతో గిరిజన సంక్షేమం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక సార్లు కేంద్ర ప్రభుత్వ సంస్థ 'కాగ్' అక్షింతలు వేసినప్పటికీ రాష్ట్రంలో పాలకుల తీరు మారలేదని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా గిరిజనుల బతుకు చిత్రం మారటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాలు కల్పించలేని స్థితిలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికయినా స్పందించి గిరిజన సంక్షేమానికి తగు నిధులు కేటాయించి, గిరిజన ప్రాంతాలు, పాఠశాలల అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టవలసిందిగా లేఖలో ఈశ్వరయ్య కోరారు.

'రూ.10 కోట్లు ఇవ్వు... లేదంటే మీ కొడుకుని చంపేస్తాం'

ఎంపీకి బెదిరింపు ఫోన్‌కాల్స్

పట్నా: బీజేపీ సీనియర్ ఎంపీ సంజయ్ జైశ్వాల్‌కు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు ఫోన్‌కాల్స్ వచ్చాయి. రూ.10 కోట్లు ఇవ్వకపోతే తన కుమారుడిని చంపేస్తామంటూ బెదిరించడంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. దీంతో రంగంలోకి దిగిన బీహార్ పోలీసులు ఫోన్ చేసిన వ్యక్తిని ట్రాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సబ్ డివిజనల్ పోలీస్ అధికారి (ఎస్‌డీపీవో) వివేక్ దీప్ మీడియాకు వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం కొద్ది నిమిషాల వ్యవధిలోనే ఎంపీకి రెండు ఫోన్ కాల్స్ రావడంతో ఆయన శనివారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాల్ చేసిన వ్యక్తి రూ.10 కోట్లు అడిగాడని, లేదంటే తన తనయుడిని చంపేస్తామని బెదిరించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు చెప్పారు. కాల్ చేసిన వ్యక్తిని ట్రాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కాల్ చేసిన వ్యక్తికి క్రిమినల్ ముఠాలతో సంబంధం ఉన్నట్లు కనబడుతోందని అనుమానిస్తున్న పోలీసులు.. దీని వెనక రాజకీయ వైరం ఉన్నట్లు ఎలాంటి ఆధారాలూ అందలేదన్నారు. ఈ కేసును అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. బిహార్‌కు చెందిన జైశ్వాల్ ప్రస్తుతం లోక్‌సభలో భాజపా చీఫ్ విప్‌గా ఉన్నారు.

విద్యా వ్యవస్థ నిర్వీర్యం!

- ఒక్క విద్యార్థి లేని 8 వేల బడులు
- విధుల్లో 20 వేల మంది టీచర్లు- బెంగాల్, తెలంగాణ టాప్
- లెక్క తేల్చిన విద్యా శాఖ

న్యూఢిల్లీ: దేశంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతోంది. వ్యవస్థలోని అసమానతలతో పాటు వనరుల దుర్వినియోగం స్పష్టమవుతోంది. ఒక్క విద్యార్థి కూడా నమోదు కాని పాఠశాలలు దేశంలో ఎనిమిది వేలకుపైగా ఉన్నాయి. ఈ పాఠశాలలను 'జీరో ఎన్‌రోల్మెంట్ స్కూల్స్' అని అంటారు. ఈ బడుల్లో 20,817 మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు విద్యా శాఖ గణాంకాలు చెబుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 3,812 జీరో ఎన్‌రోల్మెంట్ స్కూళ్లు ఉండగా, వాటిలో 17,965 మంది టీచర్లు ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో మొత్తం 2,245 జీరో ఎన్‌రోల్మెంట్ స్కూళ్లు ఉంటే, వాటిలో 1,016 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అలాగే మధ్యప్రదేశ్‌లోని 463 బడుల్లో 223 మంది టీచర్లు ఉన్నారు. ఉత్తర ప్రదేశ్‌లో 81 జీరో ఎన్‌రోల్మెంట్ స్కూళ్లు ఉన్నాయి. వరుసగా మూడు విద్యా సంవత్సరాల పాటు విద్యార్థులు నమోదు కాని పరిస్థితుల్లో పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామని యూపీ మాధ్యమిక శిక్షా పరిషత్ (యూపీ బోర్డు) ప్రకటించింది. హర్యానా, మహారాష్ట్ర, గోవా, అసోం, హిమాచల్ ప్రదేశ్, చత్తీస్‌గఢ్, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలైన పుదుచ్చేరి, లక్షద్వీప్, దాదర్ నాగర్ హవేలీ, అండమాన్ నికోబార్ దీవులు, దామన్ దయ్యు, చండీగఢ్ సహా దేశ రాజధాని ఢిల్లీలో జీరో ఎన్‌రోల్మెంట్ పాఠశాలలు లేవని డేటా చెబుతోంది. విద్యాశాఖ గణాంకాల ప్రకారం 7,993 బడుల్లో ఒక్క విద్యార్థి కూడా నమోదు కాలేదని తెలుస్తోంది. గతేడాదితో పోల్చితే ఈ సంఖ్య ఐదు వేలకుపైగా తగ్గింది. గతేడాది ఈ స్కూళ్ల సంఖ్య స్కూళ్లు 12,954గా ఉంది. ఇదిలావుంటే, ఏకోపాధ్యయ పాఠశాలు దేశంలో లక్షకుపైగా ఉన్నాయి. వీటిని సింగిల్ టీచర్ స్కూల్స్ అని అంటారు. ఇలాంటి బడుల్లో 33 లక్షల మందికిపైగా విద్యార్థులు నమోదై ఉన్నారు. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, కర్నాటక, లక్షదీప్ ముందు వరుసలో ఉన్నాయి. ఎక్కువ మంది పిల్లలు ఉన్న ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువ కాగా ఆ తర్వాత స్థానాల్లో జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ ఉన్నాయి. 2023-24తో పోల్చితే ఇలాంటి స్కూళ్లు ఆరు శాతం మేర తగ్గాయి. అప్పట్లో వీటి సంఖ్య 1,10,971గా ఉంటే 2022-23లో 1,18,190గా నమోదైంది.

కర్నూలు బస్సు ప్రమాదం
10 మృతదేహాల అప్పగింత

విశాలాంధ్ర-కర్నూలు: కర్నూలు సమీపంలో బస్సు ప్రమాదంలో మరణించిన వారిలో 10 మంది మృతదేహాలను డీఎన్ఏ నివేదిక ఆధారంగా ఆదివారం కుటుంబ సభ్యులకు అధికారులు అప్పగించారు. మరణ ధృవీకరణ పత్రాలు కూడా వారికి అందించారు. ఈ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఎ.సిరి పర్యవేక్షించారు. మృతదేహాలను స్వస్థలాలకు చేర్చేందుకు అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు. బస్సు దగ్ధంలో 19 మంది సజీవ దహనమైన విషయం విదితమే. మరో గుర్తు తెలియని మృతదేహానికి సంబంధించి చిత్తూరు నుంచి ఒకరు వచ్చారని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. తమ తండ్రి కనిపించడం లేదని ఆ వ్యక్తి చెప్పారన్నారు. డీఎన్ఏ నివేదిక ఆధారంగా ఆ మృతదేహం ఎవరిదనే విషయం తేలుతుందని స్పష్టం చేశారు. ప్రమాద సమయంలో బస్సు డ్రైవర్ మద్యం తాగలేదని నివేదికలో తేలిందని ఎస్పీ చెప్పారు.

బైకర్ శివశంకర్‌పై ఎర్రిస్వామి ఫిర్యాదు

ప్రమాద ఘటనలో మరణించిన బైకర్ శివశంకర్‌పై అతడి స్నేహితుడు ఎర్రిస్వామి ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. శివశంకర్ నిర్లక్ష్యం వల్లే బైక్ డివైడర్‌ను ఢీకొట్టినట్లు ఫిర్యాదులో ఎర్రిస్వామి పేర్కొన్నాడు. 'బైక్ డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరం పడిపోయాం. శివశంకర్ ఘటనాస్థలిలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని పక్కకు తీసేందుకు యత్నించా. ఇంతలో మా బైక్‌ను ఓ వాహనం ఢీకొట్టగా రోడ్డు మధ్యలోకి వచ్చింది. అనంతరం వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు బైక్‌ను లాక్కెళ్లింది. దీంతో బస్సులో మంటలు చెలరేగి ప్రమాదం జరిగింది' అని వివరించాడు.

మద్యం తాగినట్లు నిర్ధారణ

బైకర్, మృతుడు శివశంకర్ నుంచి సేకరించిన నమూనాల్లో మద్యం ఆనవాళ్లు ఉన్నట్లు కర్నూలు ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిర్ధారించింది. ప్రమాదం జరిగిన సమయంలో మద్యం తాగి వాహనం నడిపినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు నివేదిక సమర్పించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: మొంథా తుపాను నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టినట్టు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. సంస్థ పరిధిలోని 11 జిల్లాలలో డివిజన్ వారీగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఉద్యోగులకు ఎప్పటికప్పుడు టెలీకాన్ఫెరెన్స్‌ల ద్వారా సూచనలు చేస్తున్నట్టు తెలిపారు సంస్థ పరిధిలోని అన్ని జిల్లాలలో డివిజన్, సెక్షన్ స్థాయి వరకు అధికారులందరూ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. తుపాను సహాయక కేంద్రాలు, ఆసుపత్రులు, సెల్ టవర్లు వంటి అత్యవసర సేవలకు నిరంతర విద్యుత్ సరఫరా కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో ఉద్యోగుల సెలవులు రద్దు చేసినట్టు తెలిపారు. విద్యుత్ సమస్యల కోసం 1912 నంబర్‌కు సమాచారమివ్వాలని ఆయన సూచించారు.

ముంచుకొస్తున్న మొంథా తుపాను

కాకినాడ సమీపంలో రేపు తీరం దాటే అవకాశం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆగ్నేయ బంగాళాఖాతంలోని తీవ్రవాయుగుండం ఆదివారం రాత్రికి నైరుతి మరియు పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది మంగళవారం ఉదయానికి తీవ్ర తుపానుగా మారి, ఆ రోజు రాత్రి కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. ఆదివారం రాత్రి నుంచి తీరం వెంబడి గాలుల తీవ్రత పెరిగింది. గంటకు 35 నుంచి 55 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తున్నాయి. సోమవారం గాలుల తీవ్రత 55 నుంచి 75 కి.మీ వరకు పెరుగుతుందని భావిస్తున్నారు. రాయలసీమ, కోస్తాంధ్రలోని ఒకటి రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదవుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని ఓడరేవుల్లో ఒకటో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రేపు (మంగళవారం) తీరం దాటే సమయంలో గంటకు 90-110 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని అంచనా వేస్తున్నారు. ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. సోమవారం (27వ తేదీ) కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. మంగళవారం (28వ తేదీ) శ్రీకాకుళం, విజయనగరం,అల్లూరి, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి,ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మన్యం, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.

ప్రభుత్వ బ్యాంకులు 8కి పరిమితం?

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) మలివిడత విలీన ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం 12 పీఎస్‌బీలు ఉన్నాయి. వీటిలో నాలుగింటిని విలీనం చేసి మొత్తం పీఎస్‌బీల సంఖ్యను ఎనిమిదికి పరిమితం చేసే యోచనలో ప్రభుత్వం ఉందని ఓ ఆంగ్ల వెబ్‌సైట్ తెలిపింది. విలీనం చేసే బ్యాంకుల్లో ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐఓబీ), సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఉన్నట్లు పేర్కొంది. పెద్ద బ్యాంకులైన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి వాటిల్లో వీటిని విలీనం చేయొచ్చని పేర్కొంటున్నారు. అయితే విలీన ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని ఆయా బ్యాంకర్లు తెలిపారు. 'ఒక బ్యాంకులో మరో బ్యాంకును విలీనం చేయాలా.. వద్దా అనేది దీర్ఘకాలిక దృక్పథంతో తీసుకునే నిర్ణయం. ఈ విషయంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి చర్చలు జరగలేదు. ఆర్థిక శాఖ నుంచి అలాంటి ప్రతిపాదనేదీ రాలేదు. ఇప్పటివరకైతే బ్యాలెన్స్ షీట్లను బలోపేతం చేసుకోవడం పైనే దృష్టి సారిస్తున్నామ'ని ఒక బ్యాంకరు తెలిపారు. అయితే సెబీ నిబంధనకు అనుగుణంగా 'కనీస ప్రజల వాటా' సాధించేందుకు కొన్ని బ్యాంకుల్లో ప్రభుత్వ వాటా తగ్గించుకునేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని మరో బ్యాంకర్ తెలిపారు.

సమాజానికి ప్రమాదకరంగా బ్లూ బ్యాచ్

మంత్రి లోకేశ్ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తప్పుడు ప్రచారం ఆధారంగా రాజకీయం చేద్దామనుకుంటున్న 'బ్లూ బ్యాచ్' సమాజానికి ప్రమాదకరంగా మారిందనడంలో సందేహం లేదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. వైసీపీ తప్పుడు ప్రచారాలపై ఆదివారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. పక్క రాష్ట్రంలో ఒక గురుకుల పాఠశాలలో 2023 నాటి పరిస్థితికి సంబంధించిన ఒక వీడియోను తాజాగా అరకులో జరిగినట్లు ఒక కథనం రాసి వైసీపీ అనుబంధ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇదే వార్తపై, ఇదే వీడియోపై రాష్ట్ర ప్రభుత్వం తరపున 'ఫ్యాక్ట్ చెక్' లో సంపూర్ణ వివరాలతో సమాచారం అందించినా కూడా కొద్ది రోజులు ఊరుకుని మళ్లీ అదే వీడియోతో తాజాగా తప్పుడు ప్రచారం ప్రారంభించారని అన్నారు. ఇలా తరచూ నేరాలకు పాల్పడేవారిని 'హ్యాబిట్యువల్ అఫెండర్స్' (నేరాలు చేయడానికి అలవాటు పడ్డవారు) అంటారన్నారు. అందుకే అది ఒక రాజకీయ పార్టీనా హ్యాబిట్యువల్ అఫెండర్స్ ముఠానా అనే అనుమానం వస్తున్నదన్నారు. ఈ ఫేక్ ప్రచారాన్ని ప్రజలు ఎవరూ కూడా నమ్మవద్దని కోరారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేసే వారిపై ఏపీ పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో నారా లోకేశ్ ట్వీట్ వైరల్ అయింది.

బీజేపీ, అన్నాడీఎంకేపై స్టాలిన్ ఆగ్రహం

చెన్నై: తమిళనాడులో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను ఎన్నికల సంఘం వచ్చే వారం ప్రారంభించనుంది. దీన్ని అధికార డీఎంకే తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. బీజేపీ, అన్నాడీఎంకే కలిసి 'ఎస్ఐఆర్' ద్వారా ప్రజల ఓటు హక్కును హరించి.. ఎన్నికల్లో లబ్ధికి యత్నిస్తున్నట్లు సీఎం ఎంకే స్టాలిన్ ఆరోపించారు. డీఎంకే శ్రేణులనుద్దేశించి ఓ లేఖ విడుదల చేశారు. 'తమిళనాడులోనూ ఎన్నికల ప్రయోజనాల కోసం 'ఎస్ఐఆర్'కు పావులు కదుపుతున్నారు. శ్రామికులు, ఎస్సీలు, మైనారిటీలు, మహిళల ఓట్లను తొలగించడం ద్వారా 2026 అసెంబ్లీ ఎన్నికల్లో గెలవొచ్చని బీజేపీ, దాని మిత్రపక్షం అన్నాడీఎంకే భావిస్తున్నాయి. ఎన్నికల క్షేత్రంలో ప్రజలను ఎదుర్కొనే శక్తి లేనివారు, వారి ఓటు హక్కులు లాక్కొని విజయం సాధించాలని అనుకుంటున్నారు. కానీ తమిళనాడులో వారి ఆటలు సాగవు' అని స్టాలిన్ పేర్కొన్నారు. అప్రజాస్వామిక చర్యలను ప్రజలతో కలిసి చట్టబద్ధంగా ఎదుర్కొంటామని తెలిపారు. అన్నాడీఎంకే అధ్యక్షుడు ఎడప్పాడి కె. పళనిస్వామిపైనా సీఎం స్టాలిన్ మండిపడ్డారు. ఈశాన్య రుతుపవనాల కారణంగా రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలోనూ.. రాజకీయ ప్రయోజనాలకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు అండగా నిలవడం లేదని ఆయనను స్టాలిన్ విమర్శించారు. ధాన్యం సేకరణలో ఆయన ఆరోపణలన్నీ అబద్ధాలేనన్నారు. అటువంటి వాటిని పట్టించుకోకుండా ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్నామని స్టాలిన్ తెలిపారు.

11 జిల్లాలకు రూ.14 కోట్ల విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం తక్షణ సహాయక చర్యల కోసం రూ.14 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వం టీఆర్ 27 కింద నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు, తిరుపతి, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలకు రూ.2 కోట్లు చొప్పున, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, ప్రకాశం, బాపట్ల, కర్నూలు, నంద్యాల, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలకు రూ.1 కోటి చొప్పున నిధులు కేటాయించారు. బాధితులను సహాయ శిబిరాలకు తరలించడం, సురక్షితమైన తాగునీరు, ఆహారం, పాలు అందించడం, ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలకు అత్యవసర మరమ్మతులు, ఇతర సహాయ కార్యకలాపాల కోసం ఈ నిధులను కలెక్టర్‌లు వినియోగించాలని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది.

సీబీఐకి 'కరూర్' కేసు

చెన్నై: తమిళనాడులోని కరూర్‌లో టీవీకే ప్రచార సభలో తొక్కిసలాటపై కేసును సీబీఐ చేపట్టింది. రాష్ట్ర పోలీసుల 'ఎఫ్ఐఆర్'ను తిరిగి నమోదు (రీ-రిజిస్టర్) చేసింది. స్థానిక కోర్టుకు ఈమేరకు సమాచారమిచ్చింది. టీవీకే ప్రధాన కార్యదర్శి బస్సీ ఆనంద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నిర్మల్ కుమార్ తదితరుల పేర్లను చేర్చింది. త్వరలో అరెస్టులు చేయనున్నది. కరూర్ ఘటనపై మద్రాసు హైకోర్టు ఆదేశాల మేరకు ఐజీ ఆశా గార్గ్ నేతృత్వంలోని సిట్ తొలుత దర్యాప్తు చేపట్టింది. టీవీకే దీనిని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. తమిళనాడు పోలీసులు మాత్రమే ఉన్న సిట్‌పై నమ్మకం లేదని, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడంతో పాటు పర్యవేక్షణకు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో బృందాన్ని ఏర్పాటు చేయాలని కోరింది. ఈ వ్యవహారాన్ని జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి అప్పగిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దర్యాప్తును పర్యవేక్షించేందుకు సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. దీంతో సీబీఐ బృందం కరూర్‌లోని ఘటన స్థలాన్ని పరిశీలించింది. బాధితులు, సంబంధిత కుటుంబాల వాంగ్మూలాలు సేకరించింది. గత నెల 27న టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్... కరూర్ సభలో తొక్కిసలాట జరిగి 41 మంది చనిపోగా, 60 మందికిపైగా గాయపడ్డారు. బాధిత కుటుంబాలను విజయ్ సోమవారం చెన్నై సమీపంలోని ఓ రిసార్టులో కలవనున్నారు. రిసార్టులో 50 గదులను బుక్ చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.